ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



విశాఖపట్నం
శనివారం 5 ఆగస్టు 2017 | 16

మన్యంలో ఎస్టీ కమిటీ పర్యటన



వినతులు తీసుకుంటున్న ఎస్టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

16

అంకితభావంతో పనిచేయాలని హితవు

ఆరు నెలల తర్వాత మళ్లీ వస్తాం..

ప్రగతిని సమీక్షిస్తాం

అధికారుల సమీక్షలో ఎస్టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

కమిటీకి వినతుల వెల్లువ

భూమి హక్కు పత్రాలు, ఎన్టీఆర్ గృహాలు, నిరుద్యోగులకు రుణాల కోసం అర్జీలు

బోరుమంటున్న బీర రైతు



ఒక్కసారిగా పడిపోయిన ధర

కేడీపేటలో కిలో రూ.8కి విక్రయం

దిగుబడి పెరగడంతో తక్కువ ధరకు అమ్ముకోవలసిన పరిస్థితి

16

శ్రావణలక్ష్మి వైభవం



విశాఖలోని శ్రీకనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని బంగారు కిరీటం, కవచంతో పాటు వివిధ ఆభరణాలతో అలంకరించారు. అలాగే వన్‌టౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని బంగారు చీర, బంగారు ఆభరణాలతో అలంకరించారు. సామూహిక వ్రతాలు చేశారు.





స్వచ్ఛ నర్సీపట్నం

పట్టణ శివార్లలో నిర్మించిన కంపోస్టుయార్డు

నెల రోజుల్లో చెత్తరహిత పట్టణంగా మార్పు

రాష్ట్రంలో నర్సీపట్నం, బొబ్బిలి మున్సిపాలిటీలు ఎంపిక

రూ.1.16 కోట్లతో ఘన వ్యర్థ పదార్థాల ప్లాంట్ ఏర్పాటు

నిర్వహణ బాధ్యత ప్రైవేటు సంస్థకు అప్పగింత

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ

ప్రతి ఇంటికీ రెండు ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లు

సెంటర్ స్ప్రెడ్‌లో..

పండిట్ల బదిలీలు రద్దు

పీఈటీలవి కూడా...

పదోన్నతుల తరువాతే మరోసారి కౌన్సెలింగ్

తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల

ఈసారి జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 4,250 మంది టీచర్ల బదిలీలు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ మరోసారి అభాసుపాలైంది. అన్ని కేటగిరీల్లో బదిలీలు పూర్తిచేసి ఉత్తర్వులు కూడా అందజేసిన తరువాత తెలుగు, హిందీ గ్రేడ్-2 పండిట్లు, పీఈటీల బదిలీలను రద్దు చేసింది. ఈ మూడు కేటగిరీల ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన తరువాత బదిలీలు చేపడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో గత వారం నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా

మిగతా 6వ పేజీలో..

బిందు, తుంపర

తుంపర సేద్యం ఇలా..



సేద్యానికి పెద్దపీట

జిల్లాలో ఈ ఏడాది 6,500 హెక్టార్లలో అమలు

పరికరాలపై 50 నుంచి వంద శాతం వరకు రాయితీ

బయోమెట్రిక్ విధానంలో లబ్ధిదారుల ఎంపిక

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు

కలుపు నివారణ, ఎరువులు ఆదా



బిందు సేద్యానికి ఉపయోగించే పరికరం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

జిల్లాలో బిందు, తుందర సేద్యానికి పెద్ద పీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరికరాల వీటి వినియోగం వల్ల తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయడంతోపాటు ఎరువుల వృథాను అరికట్టవచ్చు. కలుపు

...మిగతా 6వ పేజీలో..



విశాఖ పోర్టు నుంచి

నేపాల్‌కు సరకు రవాణా

-మెయిన్ ఎడిషన్‌లో..


పినపాడులో మృత్యు ఘోష

గ్రామంలో విజృంభించిన జ్వరాలు

మూడు రోజుల వ్యవధిలో ముగ్గురి మృతి

మృతుల్లో ఒకరు ఆశ కార్యకర్త... పది మంది పరిస్థితి ఆందోళనకరం

3



9న సీఎం అరకు రాక?

ఆదివాసీ దినోత్సవానికి చంద్రబాబు హాజరయ్యే అవకాశం

-వార్త 16వ పేజీలో..



కార్యక్రమంలో రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు

డయల్ యువర్ ఏయూకు విశేష స్పందన

విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఏయూ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలువురు ఫోన్ ద్వారా అడిగిన సందేహాలకు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో దూర విద్య సంచాలకులు ఆచార్య బి.మోహిని, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య రాజేంద్రప్రసాద్, ఎగ్జామినేషన్స్ డీన్ ఆచార్య పుల్లారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐటీఐ దరఖాస్తుల విక్రయం

విశాఖపట్నం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి శనివారం నుంచి దరఖాస్తులు విక్రయించనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఆర్‌వీ రమణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ప్రభుత్వ ఐటీఐల నుంచి రూ.పది చెల్లించి దరఖాస్తు పొందవచ్చన్నారు. దరఖాస్తులు ఈనెల ఐదు నుంచి పదిహేనో తేదీ వరకు అన్ని పనిదినాల్లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రభుత్వ ఐటీఐల్లో విక్రయిస్తామన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ ఫొటోలను తప్పనిసరిగా జతచేయాలన్నారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా ఏ ఐటీఐలో సీటు పొందాలనుకుంటే ఆ ఐటీఐలో సమర్పించాలని రమణ సూచించారు. ఈ నెల 17న జిల్లాలలోని అన్ని ప్రభుత్వం ఐటీఐల్లో ఖాళీలకు, 18న ప్రైవేటు ఐటీఐల్లో ఖాళీలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

10న విద్యా సంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ పిలుపు

విశాఖపట్నం: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల పదో తేదీన విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్టు భారత విద్యార్థి ఫెడరేషన్ నగర అధ్యక్షుడు ఎల్‌జే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, మాతృభాషలో విద్యాబోధన కొనసాగించేలా జీఓ నంబర్ 14ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ సెల్ఫ్ ఫైనాన్స్ స్కూల్స్ ఇండిపెండెంట్ యాక్ట్ 2017ను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీ పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూ.మూడువేలుకు పెంచాలన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తులకు రిజిస్ట్రేషన్ గడువు 30

విశాఖపట్నం: 2016-17 సంవత్సరానికి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తుల రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు విద్యార్థులకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించామని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 15వ తేదీ తర్వాత కౌన్సెలింగ్ ద్వారా చేరిన విద్యార్థులు ఆధార్ నంబర్, ఎస్ఎస్‌సీ హాల్ టిక్కెట్ నంబర్, సెట్ వివరాలతో జన్మభూమి పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.







పర్‌ఫెక్ట్ ఫొటోల కోసం



స్మార్ట్‌ఫోన్‌తో సెల్ఫీలు దిగడం, ఫొటోలకు ఫోజివ్వడం ప్రస్తుతం ఫ్యాషన్‌గా మారింది. హై రిజల్యూషన్, నాణ్యత కలిగిన కెమెరా ఫోన్లు తక్కువ ధరకు వస్తుండడంతో ఎక్కువమంది ఈ ఫోన్లకే మొగ్గు చూపిస్తున్నారు. మనం ఎంతో ముచ్చటపడి తీసుకున్న ఈ ఫొటోలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవడానికి అనేక యాప్స్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని మన ఫొటోలకు, వీడియోలకు మరింత వన్నె తీసుకురావచ్చు. అటువంటి బెస్ట్ ఎడిటింగ్ యాప్స్‌లో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

(విశాఖపట్నం)




గ్యాలరీ పిక్స్‌తోపాటు రియల్‌టైమ్ క్యాప్చర్ సౌలభ్యం

బెస్ట్ యాప్స్

క్యాండీ కెమెరా యాప్



సెలబ్రిటీలతో సెల్ఫీలు దిగడానికి ఇటీవల కాలంలో ఎక్కువ మంది మొగ్గుచూపిస్తున్నారు. ఇటువంటి వారికి క్యాండీ కెమెరా యాప్ సౌకర్యవంతంగా ఉంటుంది. సెల్ఫీలు తీసుకునే సమయంలో దానికి రియల్ టైమ్ ఎఫెక్ట్‌లు, ఫిల్టర్లను అప్లై చేసుకునేందుకు వీలుంది. సెల్ఫీ తీసుకున్న సమయంలో మేకప్ లేకపోయినా, ముఖం జిడ్డుగా ఉన్నా దాన్ని ఆకర్షణీయంగా కనిపించేలా తీర్చిదిద్దేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. దీంతోపాటు కెమెరా క్లిక్‌మనిపించేటప్పుడు వచ్చే షట్టర్ సౌండ్‌ను తగ్గిస్తూ, సైలెంట్ కెమోరా మోడ్‌లో ఫొటోలు తీసుకునేందుకు వీలవుతుంది. అంతే కాకుండా బ్యూటీ ఫంక్షన్, కొల్లేజ్ మోడ్ వంటి ఫీచర్లు ఇందులో అదనంగా పొందుపర్చారు. ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్లకు పై యాప్‌లు లభ్యమవుతాయి.



ఫేస్ యాప్

పాతికేళ్ల తర్వాత మనం ఎలా ఉంటామో తెలుసుకోవాలన్నా.. పదిహేనేళ్ల వయసప్పుడు మనం ఎలా ఉండేవాళ్లమో చూసుకోవాలన్నా ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిందే. గ్యాలరీలో ఉండే ఫొటోలే కాకుండా రియల్ టైమ్‌లో కూడా ఈ యాప్ ద్వారా ఎడిటింగ్ చేసుకోవచ్చు. మనకు నచ్చిన ఫొటోలను ఎడిటింగ్ చేశాక వాటన్నింటినీ కొలేజ్‌లా కూడా రూపొందించవచ్చు. డివైస్‌లోని బ్యాక్ లేదా ఫ్రంట్ కెమోరాతో ఈ యాప్‌ను ఉపయోగించే వీలుంది. ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్లు దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



వింటేజ్ యాప్

మీరు స్మార్ట్ ఫోన్లలో తీసుకున్న ఫొటోలు, వీడియోలకు వింటేజ్ లుక్ ఇవ్వాలంటే వింటెక్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాల్సిందే. రియల్ టైమ్‌లో తీసుకునే ఫొటోలు, వీడియోలకు ఈ యాప్ ద్వారా ఎఫెక్ట్స్ అప్లయ్ చేయవచ్చు. కాంట్రాస్ట్, సాట్యూరేషన్, వైబ్రేన్స్, టెంపరేచర్, ఎక్స్‌పోజర్ వంటి పలు సెట్టింగ్స్‌ను అప్లయ్ చేసుకునే అవకాశం ఉంది. సుమారు 100కు పైగా ఎఫెక్ట్స్ ఫిల్టర్స్ ఇందులో లభ్యమవుతున్నాయి. ఫ్రేమ్స్, ఫ్లేర్ ఎఫెక్ట్స్ ఈ యాప్‌లో స్పెషల్ అట్రాక్షన్. ఐఓఎస్, ఆండ్రాయిడ్ యూజర్లు ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు.

హారిజాన్ కెమెరా యాప్

స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించుకుని ఏ యాంగిల్‌లో ఫోటో లేదా వీడియో షూట్ చేస్తే అదే యాంగిల్‌లో వస్తుందనేది అందరికీ తెలిసిన విషయమే. కానీ అందుకు విరుద్ధంగా హారిజాన్ కెమోరా యాప్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది. డివైస్‌ను ఏ విధంగా పట్టుకుని షూట్ చేసినా ఫైనల్ అవుట్‌పుట్ మాత్రం హారిజంటల్‌గా (అడ్డంగా) వస్తుంది. 4కే అల్ట్రా హెచ్‌డీ వీడియో రికార్డింగ్‌ను కూడా హారిజాన్ కెమోరా యాప్ సపోర్ట్ చేస్తుంది. దీంతో స్లో మోషన్‌లో వీడియోలను తీసుకునేందుకు ఈ యాప్ ఉపయోగకరంగా వుంటుంది.

సుజల స్రవంతి పనులను తక్షణమే ప్రారంభించాలని

9 నుంచి పోస్టుకార్డు ఉద్యమం: కొణతాల

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలని ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి అధ్యక్షుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ముఖ్యమంత్రిని కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన తెలుగుదేశం మహానాడులో 2,140 కోట్ల రూపాయలతో సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని ప్రకటించారే తప్ప నేటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇందుకు సంబంధించి కేబినెట్‌లో కూడా చర్చకు రాలేదన్నారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని తక్షణమే పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నామని చెప్పారు. బుచ్చెయ్యపేట మండలం పెదపూడి గ్రామం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు చెప్పారు. ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే ఉత్తరాంధ్రలోని 30లక్షల ఎకరాలకు సాగునీరు సదుపాయం కల్పించాలని కోరారు. గోదావరితో ఉత్తరాంధ్రలోని అన్ని నదులను అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. అలాగే గోదావరి జలాల్లో ఉత్తరాంధ్రకు న్యాయమైన నీటి వాటాను కేటాయించాలని కోరారు. ఒడిశాతో ఉన్న జల వివాదాలను తక్షణం పరిష్కరించి వంశధార మూడో దశ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వాసితులకు తగిన నష్టపరిహారం చెల్లించి, న్యాయం చేయాలన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ఎడమకాలువ పనుల్లో భాగంగా తాండవ, వరహా, శారదా నదులపై క్రాసింగ్‌లు నిర్మించాలన్నారు. రైల్వేక్రాసింగ్ పనులు కూడా త్వరతగతిన పూర్తి చేయాలని కొణతాల కోరారు.



డిమాండ్ల పత్రాన్ని చూపుతున్న కొణతాల రామకృష్ణ

పినపాడులో మృత్యు ఘోష

గ్రామంలో విజృంభించిన జ్వరాలు

మూడు రోజుల వ్యవధిలో వరుసగా ముగ్గురి మృతి

పది మంది పరిస్థితి ఆందోళనకరం

చింతపల్లి: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పినపాడు గ్రామంలో మృత్యు ఘోష వినిపిస్తున్నది. ఈ గ్రామంలో మూడు రోజుల వ్యవధిలో వరుసగా ముగ్గురు మరణించారు. అలాగే మరో పది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గ్రామస్థులు అందించిన వివరాల ప్రకారం...

పినపాడు గ్రామంలో రెండు వారాలుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. అధిక శాతం ఆదివాసీలు జ్వరాలతో బాధపడుతున్నారు. సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో వ్యాధుల తీవ్రత పెరిగిపోయింది. దీంతో వారంతా మంచం పట్టారు. ఈ నెల 2వ తేదీన కిరసని సువర్ణ(45), 3వ తేదీన ఆశ కార్యకర్తగా పనిచేస్తున్న జిన్ని విమల(35) మృతి చెందారు. శుక్రవారం విమలకు గ్రామస్థులు అంత్యక్రియలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన మరో గిరిజనుడు జన్ని రామకృష్ణ(32) మృతి చెందాడు. కేవలం మూడు రోజుల్లో వరుసగా ముగ్గురు గిరిజనులు మృతి చెందడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో మరో పది మంది అనారోగ్యంతో బాధపడుతున్నారని గ్రామస్థులు రామదాసు, మనోజ్‌కుమార్ తెలిపారు.

'హ్యాపీ సండే'ను విజయవంతం చేయండి

మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం టౌన్: వారం రోజులు పాటు పని ఒత్తిడితో బిజీగా ఉండే ప్రజలు, అధికారులంతా వారంలో ఒక రోజైనా సంతోషంగా గడపాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హ్యాపీ సండే పేరిట వినూత్న కార్యక్రమం ప్రవేశ పెట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు చెప్పారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ, స్థానిక పురపాలక సంఘం, లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమం ఈ నెల 6వ తేదీన ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని



హ్యాపీ సండే ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, లయన్స్ క్లబ్ నవ్య ప్రతినిధులు

విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు. ఒక కుటుంబం ఎలాగైతే పిక్నిక్‌లు, విందు భోజనాలు ఏర్పాటు చేసుకుంటుందో.. అదే తరహాలోనే హ్యాపీ సండేలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మండల స్థాయిలలో పని చేసే అధికారులంతా విధిగా హాజరుకావాలని కోరారు. ఇకపై ప్రతి నెలా ఒక ఆదివారం వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హ్యాపీసండే వంటి కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. తొలి విడతగా కార్యక్రమంలో భాగస్వామ్యమైనందుకు లయన్స్ క్లబ్ నవ్య ప్రతినిధులకు ఆయన అభినందించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్‌అండ్‌బీశాఖా మంత్రి అయ్యన్నపాత్రుడు సైతం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో జానపద, థింసా నృత్యాలతో పాటు పాటలు, అంత్యాక్షరి, తదితర వినోద కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టికి అస్వస్థత

విశాఖ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స



పాడేరు: ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఆయనకు కడుపులో అల్సర్ సమస్య ఏర్పడి తీవ్రమైన నొప్పి రావడంతో వెంటనే విశాఖపట్నంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం అక్కడే చికిత్సలు పొందుతున్నారు. ఇటీవల కాలంలో ఏజెన్సీ వ్యాప్తంగా ఆయన ఆకస్మిక పర్యటనలు చేసిన క్రమంలో సమయానికి ఆహారం తీసుకోకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని వైద్యులు తెలిపారు. దీంతో గత రెండు రోజులు అసెంబ్లీ ఎస్టీ సంక్షేమ కమిటీ పర్యటనలో జాయింగ్ కలెక్టర్ సృజన పాల్గొంటున్నారు. పీవో రవి పట్టన్‌శెట్టి కోలుకోడానికి మరో రెండు రోజుల సమయం పడుతుందని ఐటీడీఏ వర్గాలు తెలిపాయి. గిరిజన ప్రాంత పర్యటనల్లో భాగంగా విస్తృతంగా పర్యటిస్తున్న పీవో అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడం ఏజెన్సీలో చర్చనీయాంశమైంది.

కరెంట్ పోతే బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ కట్


డుంబ్రిగుడలో సెల్‌టవర్

సెల్ టవర్‌కు ఇన్వర్టర్ లేక వినియోగదారుల అవస్థలు
ఇన్వెర్టర్ బ్యాకప్ కనీసం 12 గంటలు కొనసాగేలా చూడాలని డిమాండ్
డుంబ్రిగుడ, మరో 150 గ్రామాలకు కమ్యూనికేషన్ కష్టాలు

డుంబ్రిగుడ, ఆగస్టు 4: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెనువెంటనే బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ కూడా నిలిచిపోతోంది. దీంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం వినియోగదారులు నిరీక్షించాల్సి వస్తోంది.

మండల కేంద్రంలో తమ వినియోగదారుల కోసం బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేసింది. ఫలితంగా ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్, సెల్ సిగ్నల్, 3జి సిగ్నల్ సైతం బాగానే పని చేస్తుంది. కానీ ఇక్కడ ఇన్వర్టర్ లేకపోవడంతో సిగ్నల్స్‌కు బ్యాకప్ ఉండడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ అంతరాయం కారణంగా కనీసం అత్యవసర సర్వీసు 108 అంబులెన్స్ సేవలు పొందలేని దుస్థితి నెలకొంది. విద్యుత్ పోయిన తర్వాత కనీసం ఒక గంటపాటైన బ్యాటరీ బ్యాకప్ లేకపోవడంతో మండల కేంద్రంలోని వినియోగదారులతో పాటు సుమారు 150 గ్రామాల ప్రజలు సెల్ సేవలకు దూరమవుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో అరకు, కించుమండ సెల్ టవర్ల నుంచి వచ్చే సిగ్నల్స్ కోసం ఆయా ప్రాంతాలకు చేరుకోవాల్సి వస్తుందని అంటున్నారు. ప్రస్తుత ఆధునియం యుగంలో పరిజ్ఞానంతో పాటు టెక్నాలజీ అన్ని విధాల అభివృద్ధి చెందుతుంటే డుంబ్రిగుడ మండల కేంద్రంలో మాత్రం సెల్ సంకేతాలు పొందేదుకే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావడం బాధకరమని మండల వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రతిసారి బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా బీఎస్ఎన్ఎల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడితే కనీసం 12 గంటల పాటైనా బ్యాటరీ బ్యాకప్ వచ్చేలా ఏర్పాటు చేస్తే బాగుంటుందని గిరిజనులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలోని ఉన్న సెల్ టవర్‌లో బ్యాటరీ బ్యాకప్ ఉండేలా ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు కోరుతున్నారు. తద్వారా సెల్‌ఫోన్, ఇతర త్రీజీ సేవలు నిరంతరాయంగా కొనసాగే అవకాశం ఉంది.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఆర్‌వో చంద్రశేఖర్‌రెడ్డి

ముంచంగిపుట్టు: ప్రతీ ఒక్క విద్యార్థి ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కళాశాల, పాఠశాల విద్యార్థులకు ఓటు నమోదు, ఓటు హక్కుపై అవగాహన సదస్సును స్థానిక తహసీల్దార్ డి.కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు నమోదుపై ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదుకావాలన్నారు. 16,17 వయస్సు విద్యార్థులకు ఇప్పటి నుంచి ఓటు హక్కుపై అవగాహన అవసరమని అవగాహన కల్పించారు. విద్యార్థులు గ్రామాల్లోని తల్లిదండ్రులకు ఓటు హక్కుపై వివరించాలన్నారు. అవగాహన అనంతరం ఓటు హక్కుపై సందేహాలను విద్యార్థులు అడిగి ప్రశ్నలకు డీఆర్వో సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమం ఎంఎస్‌సీ పాషా, పాడేరుసబ్ కలెక్టర్ కార్యాలయ సూపర్‌వైజర్ మూర్తి, అరకు ఎలక్షన్ డీటీ ఉమామహేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి, ఆర్‌ఐలు కామరాజు, కామేశ్వరరావు, వీఆర్వో కోటిబాబు, కళాశాల అధ్యాపకులు, పలు పాఠశాల ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో కళాశాల, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఇద్దరి మృతి


చంద్రావతి మృతదేహం

పెదబయలు: మండలంలో అనారోగ్యంతో ఇద్దరు మృతి చెందారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతగుంట పంచాయతీ పెదబయలు గ్రామానికి చెందిన చెండా చంద్రావతి(48), సీకరి పంచాయతీ బంగారుమెట్ట గ్రామానికి చెందిన జి. కాసులమ్మ (50)లు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. చెండా చంద్రవతి బుధవారం చెండా చంద్రావతి పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యం పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు.

తపాల సేవలను సద్వినియోగించుకోవాలి

గిరిజనులకు ఐపీవో శ్రీనివాసరావు విజ్ఞప్తి


తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

పెదబయలు, ఆగస్టు 4: తపాలా శాఖల ద్వారా అందించే సేవలను గిరిజనులు సద్వినియోగించుకోవాలని ఆ శాఖ ఐపీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బొండాపల్లి, లక్ష్మీపేట గ్రామాల్లో తపాలా శాఖ కార్యాలయాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల సౌకర్యార్థం తపాలా కార్యాలయాలను మారుమూల ప్రాంతాల్లో సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తపాలా శాఖ అందించే పలు పథకాలను వినియోగించుకోవాలన్నారు. ప్రధానంగా సుకన్య సమృద్ధి వంటి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంపీపీ ఎస్.ఉమామహేశ్వరావు మాట్లాడుతూ.. తపాలా శాఖల్ని అందరూ సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బొండాపల్లి సర్పంచ్ బి.భూదన్న, లక్ష్మీపేట సర్పంచట కమల, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారావు, మాజీఎంపీపీ కొండయ్య, ప్రసాద్, వైస్ సర్పంచ్ అప్పలనాయుడు, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

రక్తం వృద్ధికి ఇంజెక్షన్లు

రక్తహీనత ఉన్నవారి కోసం ప్రత్యేకం
డుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి శాంతికిరణ్

డుంబ్రిగుడ: మండలంలోని స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం రక్తహీనతతో ఉన్న గిరిజన మహిళలకు రక్తం వృద్ధి చెందే ఇంజక్షన్లు అందిస్తున్నారు. రక్తహీనతతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరుతున్న రోగులకు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి వైద్య సిబ్బంది తెలిపారు. ఎవరైనా రక్తహీనతతో బాధపడుతుంటే తక్షణమే ఆస్పత్రిలో చేరి ఇంజక్షన్లు వేసుకోవాలని వైద్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా వైద్యాధికారులు సలహాల ప్రకారం మెరుగైన ఆహారం తీసుకోవాలని కోరారు. 7 నుంచి 9 గ్రాముల రక్తం ఉన్న వారు ఏడుగురు, ఏడు గ్రాముల కన్నా తక్కువ ఉన్నవారు ముగ్గురు రక్తం వృద్ధికి ఇంజక్షన్లు వేయించినట్లు వైద్యాధికారి శాంతికిరణ్ తెలిపారు. 7 గ్రాముల వరకు ఉన్న వారికి ఇక్కడే రక్త వృద్ధి ఇంజక్షన్‌లు అందిస్తున్నామన్నారు. 7 గ్రాముల కన్నా తక్కువగా రక్తం ఉంటే పరిశీలించి అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలిస్తామని తెలిపారు.

మోదకొండమ్మకు పూజలు



పెదబయలు: మండల కేంద్రంలోని మోదకొండమ్మ తల్లి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలి పూజలు నిర్వహించారు.

ఓలుబెడ్డ మార్గంలో రహదారి నిర్మించరూ

● ప్రభుత్వానికి స్థానిక గిరిజనుల విజ్ఞప్తి


అటవీ మార్గంలో నడుచుకుంటూ తమ గ్రామాలకు వెళ్తున్న గిరిజనులు

హుకుంపేట, ఆగస్టు 4: మండలంలోని ఓలుబెడ్డలో రహదారి నిర్మించాలని అక్కడ గిరిజనులు కోరుతున్నారు. ప్రస్తుతం గ్రామాలకు చేరుకోవాలంటే రాళ్లు, తుప్పలు దాటుకుంటూ అటవీ మార్గంలో ప్రయాణించాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ అత్యవసరం వచ్చినా కొండదారుల మధ్య నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం అభివృద్ధికి కొన్నేళ్ల క్రితం రూ.కోటి 95 లక్షలు పీఆర్ నుంచి నిధులు మంజూరైనా, నిధులు సరిపడక రహదారి అభివృద్ధి పడలేదని ఆ గ్రామస్థులు తెలిపారు. ఈ రహదారి అభివృద్ధి చెందితే ఓలుబెడ్డ అంబపడ తదితర గ్రామాలకు వాహనాలు రాకపోకలు సాగించవచ్చని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారి అభివృద్ధి పర్చాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డుంబ్రిగుడలో 15 కొళాయిలు ఏర్పాటు


కొళాయిలు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రజల నీటి సౌకర్యార్థం 15 కుళాయిలను పంచాయతీ అధికారులు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కుళాయిలు ఏర్పాటుతో మండల కేంద్రం వాసులకు నీరు అందుబాటులో వస్తుందని పలువురు మహిళలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీ నిధులతో 15 కుళాయిలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ ఏడాది మరో 15 కుళాయిలను ఏర్పాటు చేయడంతో మండల ప్రజలకు ఇక నీటి కష్టాలు తీరుతాయని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయా కుళాయి పాయింట్లు నుంచి నీరు సక్రమంగా అందేలా తగు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

ఎస్టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు ● డుంబ్రిగుడ పీహెచ్‌సీ సందర్శన


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎస్టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

డుంబ్రిగుడ: పీహెచ్‌సీలో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని అసెంబ్లీ ఎస్టీ కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం.. ఎస్టీ కమిటీ సందర్శించింది. ప్రతీరోజు పీహెచ్‌సీలో రోగులు ఎంతమంది వస్తున్నారు? రోగులకు సరిపడా మందులు ఉన్నాయా? రోగులకు సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలోని వైద్యం, విద్య, రవాణా సౌకర్యాలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందన్నారు. మలేరియా వంటి రోగాలు ప్రబలకుండా గిరిజనులకు ప్రత్యేకంగా దోమ తెరల పంపిణీ, పిచికారి చేయించే ప్రక్రియ చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. గిరిజనులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు.

ఇదిలా ఉండగా.. డుంబ్రిగుడలో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి జైపూర్ జంక్షన్ వద్ద 2015లో అప్పటి గిరిజన మంత్రి రావెల కిషోర్‌బాబు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నిర్మాణం పురోగతి లేదంటూ డుంబ్రిగుడ మండల తెలుగుదేశం అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్టీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కార మార్గం చూపించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, ఎస్టీ కమిటీ మెంబర్ సివేరి సోమ, ఎస్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఏకలవ్య పాఠశాల నిర్మాణ అంశమై వినతి పత్రం స్వీకరిస్తున్న కమిటీ చైర్మన్

జ్వరాల అదుపునకు ప్రత్యేక వైద్య శిబిరాలు

షహీనాబేగం, వైద్యాధికారి అనంతగిరి

ఇంటర్వ్యూ



ప్ర:మలేరియా జ్వరాల తీవ్రత ఏ విధంగా ఉంది?

జ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రస్తుతం మలేరియా జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టింది ఎక్కడైనా జ్వరాల తీవ్రత ఉంటే వెంటనే అక్కడకు వెళ్లి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి జ్వరాల అదుపునకు కృషిచేస్తున్నాం.

ప్ర:మీజిల్స్ రుబెల్లా టీకాల ప్రక్రియ ఎలాసాగుతోంది?

జ: మండలంలో మీజిల్స్ రుబెల్లా టీకాలను వేసే కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. అంగన్‌వాడీ సిబ్బంది సహాయం కూడా తీసుకుంటున్నాం. ప్రస్తుతం మండలకేంద్రంలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులందరికీ టీకాలు వేయడం పూర్తయింది. మిగతా గ్రామాలలో కూడా టీకాలను ఆసుపత్రి సిబ్బంది వేయిస్తున్నారు.

ప్ర: ఆరోగ్యకేంద్రంలో మందులు సరిపడా ఉన్నాయా?

జ: ఆరోగ్యకేంద్రంలో ప్రస్తుతం అన్నిమందులు సరిపడా ఉన్నాయి. వ్యాధుల తీవ్రత బట్టి మందులను ముందుగానే ఇండెంట్ పెట్టి తీసుకువస్తున్నాం. ప్రస్తుతానికి ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేదు.

ప్ర: సిబ్బంది పనితీరు ఏవిదంగా ఉంది?

జ: గ్రామాలలో వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని తెలిసిన వెంటనే సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నారు. కొంతమంది సిబ్బంది లో లోటుపాట్లు ఉన్నా సరి చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

- అనంతగిరి

కాశీపట్నంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌కు డిమాండ్

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటుచేయాలని స్దానికులు కోరుతున్నారు. మైదాన ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో పాటు 11పంచాయతీ లకు కేంద్రంగా ఉండటంతో ఇక్కడ తరుచూ వాహనరాకపోకలు రద్దీ ఎక్కువగా ఉంటోంది. దానితో పాటు వ్యాపార కేంద్రంగా ఉండటంతో ఈ ప్రాంతంలో పోలీస్ అవుట్‌పోస్టు అవసరం ఉందని అభిప్రాయ పడుతున్నారు. ఇటీవల కాలంలో రాత్రిపూట గంజాయి వాహనాలు కూడా అతివేగంగా ప్రయాణిస్తుండడంతో ఆందోళన చెందుతున్నామని వాపోతున్నారు. మరోవైపు మందుబాబులు ద్విచక్రవాహనాలతో విన్యాసాలు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెపుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేస్తే అల్లరిమూకల ఆట కట్టడంతో పాటు గంజాయి రవాణాను కూడా నియంత్రించవచ్చునని అభిప్రాయపడుతున్నారు.

పేదలందరికీ గృహాలు

కొయ్యూరు: నిరు పేదలందరికీ గృహ కల్పనకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు లోకుల గాంధీ అన్నారు. మండలంలో కొమ్మిక పంచాయతీలో పీఎంఏవై పథకం ద్వారా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు గృహ నిర్మాణ హక్కు పత్రాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం కొమ్మిక ఎంపీటీసీ సభ్యుడు బాబూజీ అద్యక్షతన జరిగిన సమావేశంలో గాంధీ మాట్లాడుతూ, ప్రతీ కుటుంబానికి పక్కా గృహం ఉండాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని అలాగే పాత తుమ్మలబంద, కొత్తవీధి గ్రామాలకు రహదారి నిర్మాణాలకు కృషి చేస్తామన్నారు.

బహిరంగ మల విసర్జన అరికట్టాలి

● స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ మురళీమోహన్


మాట్లాడుతున్న మురళీమోహన్

అరకురూరల్, ఆగస్టు 4: బహిరంగ మలవిసర్జన, ఆరుబయట బహిర్భూమికి వెళ్లడాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందని..స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ మురళీమోహన్ అన్నారు. తద్వారా అనారోగ్యకర పరిస్థితులను నివారించవచ్చని పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం.. 'ప్రజల భాగ సామ్యంతో సంపూర్ణ పారిశుధ్య సాధన' శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబం పారిశుధ్యం మెరుగుకు వ్యక్తిగతంగా కొన్ని చర్యలు చేపడితే వీధుల్లో చెత్తాచెదారం లేకుండా ఉంటుందన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ.. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించిని ఏడాది గడుస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించలేదన్నారు. ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈని పలుమార్లు కలిసినా పట్టించుకోలేదని ఫిర్యాదు చేయగా.. ప్రత్యేకంగా దృష్టిసారించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో టాటా కన్సల్టెంట్ భరత్, వరల్డ్‌బ్యాంకు సోషల్ ఎక్స్‌పర్ట్ మురళీకృష్ణ, మరో ప్రతినిధి ప్రకాష్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ రాజేష్, గన్నెల, పెదలబుడు, బొండాం, మాదల సర్పచ్‌లు కమల, గులాబీ గోపాల్‌రావు, సన్యాసి, సుంకరమెట్ట, సిరగం, ఇరగాయి పంచాయతీల నుంచి పంచాయతీ ప్రతినిధులు ప్రసాద్, జగన్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వైద్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

గిరిజన సంఘం ఆరోపణ


రోగులకు భోజనాలు అందిస్తున్న ఏపీజీఎస్ నాయకులు

ముంచంగిపుట్టు: గిరిజనుల వైద్యం పై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని గిరిజన సంఘం జిల్లా నాయకులు పి.శాస్త్రి బాబు అన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు భోజన సౌకర్యాలు కల్పించాలని ఎన్నిమార్లు విన్నవించినా స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీహెచ్‌సీ వద్ద గిరిజన సంఘం భోజన కేంద్రంలో 75 మంది రోగులకు భోజనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైనా గిరిజనుల వైద్యం, ఆరోగ్యం పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఎస్ నాయకులు గంగాదర్, లైకోన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ అధికారులు సహకారం అందించారు.

పాత పద్ధతిలో పింఛన్లు చెల్లించాలి

ప్రభుత్వానికి వృద్ధుల వేడుకోలు



నినాదాలు చేస్తున్న వృద్ధులు

అరకురూరల్: ప్రతీ నెలా ఫించన్ అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. లేదా పాతపద్ధతిలోనే పింఛను చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే అంశమై శుక్రవారం కొందరు వృద్ధులు ఏపీ గిరిజన సంఘంతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలిముద్రలు పడక తమకు పింఛను అందడం లేదని వాపోయారు. ఈ విధంగా ప్రతీ నెలా పంచాయతీలో 20 నుండి 50 మంది వరకు పింఛన్ అందక నానా అవస్థలు పడుతున్నామన్నారు. ఈ క్రమంలో ఇచ్చినట్లు కార్యదర్శులు నేరుగా లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ నిరసనలో మండల ఏపీజీఎస్ కార్యదర్సి రామారావు, గన్నెల, చొంపి, బస్కీ వంటి పంచాయతీల నుంచి పింఛను దారులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి

కొయ్యూరు: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్నదని ఎంపీపీ జి.సత్యనారాయణ అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు ధర నిర్ణయించే స్థాయికి రైతులను తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ సంస్థలను బలోపేతం చేసేలా ఇద్దరు రైతుమిత్రలను నియమించుకోవడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

పండిట్ల బదిలీలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

బదిలీలైన ఉపాధ్యాయులు ఎవరూ రిలీవ్ కావొద్దని పేర్కొంది. జిల్లాలో గ్రేడ్-2 తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులకు సంబంధించి ఖాళీలు తక్కువగా వున్నాయి. గతంలో ఈ కేడర్‌ను అప్‌గ్రేడ్ చేయడం, యూపీ పాఠశాలల్లో పోస్టులు ఎత్తివేయడమే ఇందుకు కారణం. పోస్టులు రద్దు కావడంతో ఈ కేటగిరీ టీచర్లను డీఈవో పూల్‌లోకి తీసుకువచ్చారు. దీనిపై పండిట్లు తీవ్ర అభ్యంతరం చెబుతూ ఆందోళన చేపట్టిన సంగతి విదితమే. ఈ సమస్య విశాఖ జిల్లాలోనే కాకుండా అన్నిచోట్ల ఉత్పన్నమైంది. దీంతో పాఠశాల విద్యాశాఖ తప్పును గుర్తించి ఇప్పటికే చేపట్టిన బదిలీలను రద్దు చేయాలని నిర్ణయించింది. ఖాళీల మేరకు ముందు పదోన్నతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి విశాఖ జిల్లాలో మూడు కేటగిరీల తాత్కాలిక సీనియారిటీ జాబితాను శుక్రవారం సాయంత్రం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దీనిపై అభ్యంతరాలు తీసుకున్న తరువాత తుదిజాబితా రూపొందిస్తారు. కాగా రెండు, మూడు రోజుల్లో పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. గత వారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో గ్రేడ్-2 తెలుగు పండిట్లు 124 మంది, హిందీ 64 మంది, పీఈటీలు 62 మందిని బదిలీ చేశారు. అయితే పోస్టులు లేకపోవడంతో వీరిలో ఎక్కువ మంది డీఈవో పూల్‌లో వున్నారు. అయితే ఈ బదిలీలను ఇప్పుడు రద్దు చేశారు. గ్రేడ్-1లో తెలుగు, హిందీ పండిట్లు, పీఈటీలకు పదోన్నతులకు సంబంధించి ఖాళీలను ఇప్పటికే గుర్తించారు. గ్రేడ్-1 తెలుగులో 64, హిందీలో 33, పీడీ 78 వరకు ఖాళీలు వున్నాయి. సీనియారిటీ జాబితా మేరకు వీటిని తొలుత భర్తీ చేస్తారు. సీనియారిటీ మేరకు పదోన్నతులు పొందగా మిగిలిన వారికి తరువాత పోస్టింగ్ ఇస్తారు. దీంతో ప్రస్తుతం రెండు వందల మందికి పైగా డీఈవో పూల్‌లో వున్న టీచర్ల సంఖ్య తగ్గే అవకాశం వుంది. కాగా గత నెల 31తో ముగిసిన టీచర్ల కౌన్సెలింగ్‌లో జిల్లాలో భారీగా టీచర్లు స్థాన చలనం పొందారు. అన్ని కేటగిరీలు కలిపి 4500 మందిని బదిలీ చేశారు. వీరిలో గ్రేడ్-2 తెలుగు, హిందీ పండిట్లు, పీఈటీలు 250 మంది వరకూ వున్నారు. ఇప్పుడు వారు మినహా మిగిలిన 4250 మంది టీచర్లు కొత్తపాఠశాలల్లోకి వెళ్లిపోయారు. జిల్లాల్లో బదిలీలు పరిశీలిస్తే...గ్రేడ్-2 హెచ్‌ఎంలు 94, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీ తెలుగులో 106, హిందీలో 58, ఇంగ్లీష్‌లో 460, గణితంలో 437, ఫిజిక్స్‌లో 410, బయాలజీలో 342, సోషల్ స్టడీస్‌లో 286 మంది, పీడీలు 36 మంది వున్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు 87, ఎస్జీటీలు (తెలుగు) 1874, ఎస్జీటీ (ఉర్దూ) తొమ్మిది మంది వున్నారు. బదిలీలైన టీచర్లకు దాదాపు ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవంగా వీరంతా ఆగస్టు ఒకటిన కొత్త పాఠశాలలో చేరాల్సి వుంది. అయితే ఉత్తర్వులు వెలువడంతో జాప్యంతో రెండుమూడు రోజుల వ్యవధిలో చేరాలని విద్యాశాఖ ఆదేశించింది. చాలాకాలం తరువాత భారీఎత్తున టీచర్ల బదిలీలు జరిగాయని ఉపాధ్యాయ సంఘనేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కేటగిరీ-1లో వున్న టీచర్లు తాజా బదిలీలతో జిల్లాలో మారుమూల ప్రాంతాలకు వెళ్లిపోవాల్సి వచ్చిందని చెప్పారు.





పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన తెలుగుదేశం పార్టీ నాయకులు... ప్రధాన రహదారి కూడలిలో జగన్ దిష్టిబొమ్మ దహనం

జగన్‌కు వ్యతిరేకంగా టీడీపీ ఆందోళన

నెహ్రూచౌక్‌లో మానవహారం.. దిష్టిబొమ్మ దహనం • జగన్‌ను అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహనరెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. జగన్ దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించి, కూడలిలో దహనం చేశారు. అనంతరం నిరసన ప్రదర్శనగా పట్టణ పోలీసుస్టేషన్‌కు చేరుకుని అక్కడ బైఠాయించారు. సీఐ వచ్చి ఏ సెక్షన్ కింద జగన్‌పై కేసులు నమోదు చేస్తున్నారో చెప్పేవరకూ కదలమంటూ స్పష్టం చేశారు. సైకో జగన్‌ను అరెస్టు చేసి శాంతిభద్రతలను కాపాడాలని నినాదాలు చేయడంతో పాటు ప్లకార్డులు ప్రదర్శించారు. సీఐ వచ్చిన అనంతరం ఫిర్యాదు పత్రం అందజేశారు. కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, నడి రోడ్డుపై ముఖ్యమంత్రిని కాల్చి చంపినా ఫర్వాలేదని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఇది ప్రజలను ప్రేరేపించడమవుతుందని దుయ్యబట్టారు. తీవ్రవాదులకంటే నేరమైన మాటలాడటం సిగ్గుచేటన్నారు. ఆయన మాటలను చూస్తుంటే రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలాగా ఉందని పేర్కొన్నారు. పార్టీ నగర శాఖ ఉపాధ్యక్షుడు మళ్ల సురేంద్ర మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కుటుంబానికి సైతం దూరంగా ఉంటూ పనిచేస్తున్న ముఖ్యమంత్రిపై తీవ్ర పదజాలం చేయడం అమానుషమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రతిపక్ష నేత సహకరించాల్సింది పోయి, ముఖ్యమంత్రిపై తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల వెంకటరావు, కాయల మురళీధర్, బీఎస్‌ఎంకే జోగినాయుడు, గుత్తా ప్రభాకర్‌చౌదరి , వియ్యపు సింహాచలంయాదవ్, పచ్చికూర రాము, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పంచదార్ల సూరిబాబు, కె.రామకృష్ణ, ఆడారి నరసింగరావు, వెంకటరమణ, కె.శ్రీనివాసరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

భూ మాయపై పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

ఎనిమిది మందిపై క్రిమినల్ కేసుల నమోదు

బుచ్చెయ్యపేట: ఎల్బీ అగ్రహారం రెవెన్యూ పరిధిలో లేని సర్వే నంబరు సృష్టించి భూముల అమ్మకాలు చేపట్టిన ఎనిమిది మందిపై తహసీల్దార్ శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారుమెట్టకు చెందిన సాయిం వెంకయ్యదొర, ఆయన కుమారులు నారాయణమూర్తి, తాతయ్యదొర, వరహాలుదొర 1970లో సింహాచలానికి చెందిన పుత్స లక్ష్మీనరసింగరావుకు 0.90 సెంట్ల భూమిని అమ్మారని, దీన్ని 1971లో రెవెన్యూ రికార్డుల్లో 7.90 ఎకరాలుగా నమోదు చేశారని పేర్కొన్నారు. దీన్ని 1995లో పుత్స నరసింగరావు భార్య సీతారావయ్యమ్మ, కుటుంబీకులు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, పినాకాఫాణి వడ్డాదికి చెందిన పావనీదేవికి అమ్మారని తహసీల్దార్ చెప్పారు. దీనిపై బంగారుమెట్టకు చెందిన నలుగురు, సింహచలానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

బిందు, తుంపర సేద్యానికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

బెడద తగ్గుతుంది. మొత్తంమీద తక్కువ పెట్టుబడులతో అధిక పంట దిగుబడులు సాధించవచ్చు. పంటల సాగులో బహుళ ప్రయోజనాలు వున్న బిందు, తుంపర సేద్యం పరికరాలను ఆయా రైతులకు 50 నుంచి 100 శాతం రాయితీపై అందజేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఆరున్నర వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.

తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ ప్రయోజాలు చేకూరే బిందు, తుంపర సేద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఇందుకు అవసరమైన పరికరాలను రాయితీపై అందిస్తున్నది. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 2017-18 సంవవత్సరానికి 6,500 హెక్టార్లలో ఈ పథకాన్ని అమలు చేయనున్నది. కూరగాయ పంటలు సాగు చేస్తే ఎకరాకు రూ.65 వేల విలువ చేసే పరికరాలు అవసరమవుతాయి. మామిడి తోటలకు ఎకరాకు రూ.20 వేలు, ఆయిల్‌పామ్ తోటలకు రూ.20 వేల విలువైన పరికరాలు అవసరం. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.9 కోట్ల వ్యయంతో 2,700 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం పరికరాలను ఏర్పాటు చేసి, సుమారు 2,900 మంది రైతులకు లబ్ధి చేకూర్చారు. ఎక్కువగా నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం, పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి, కె.కోటపాడు, కశింకోట, సబ్బవరం, మునగపాక మండలాల్లో వీటిని అందించారు. ఆయా రైతులు అంతకుముందు కన్నా ఈ పరికరాలు వినియోగించిన తరువాత ఎక్కువ పంట దిగుబడులు పొందారు. దీంతో ఈ ఏడాది ఏకంగా 6,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం పథకాన్ని అమలు చేయాలని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు.

ఎవరు అర్హులు...

పొలంలో విద్యుత్తు బోరు లేదా సోలార్ విద్యుత్ ఆధారిత మోటారు, నిత్యం నీరు అందుబాటులో ఉండే సదుపాయం వుండాలి. ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం రాయితీపై పరికరాలు పొందే అవకాశం ఉంది. ఐదు ఎకరాలలోపు సాగుచేసే చిన్నతరహా రైతులు రూ.2 లక్షలు వరకు 90 శాతం రాయితీపై పొందవచ్చు. మధ్యతరహా రైతులు.... అంటే ఐదు నుంచి పది ఎకరాలలోపు భూమి వున్న రైతులకు పరికరాలపై 70 శాతం రాయితీ ఇస్తారు. పదెకరాలు సాగు చేసేవారు ఎకరాకు రూ.2.8 లక్షల విలువ చేసే పరికరాలు పొందవచ్చు. పది ఎకరాలకు మించి సాగు చేసినా ఈ పథకం వర్తిస్తుంది. ఆయా రైతులు ఎకరాకు రూ.5 లక్షల వరకు 50 శాతం రాయితీపై పరికరాలను పొందవచ్చు.

బయోమెట్రిక్‌లో లబ్ధిదారుల ఎంపిక

రాయితీపై పరికరాలు కావాల్సిన రైతులు మండల కార్యాలయాల్లో ఉద్యాన శాఖ అధికారులకు లేదా ఈ-సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రైతు ఆధార్ నంబర్, భూమి వివరాలు, బ్యాంకు ఖాతా నంబరు, గుర్తింపు కార్డు నకళ్లు అందజేయాలి. ఒక రైతు బిందు, తుంపర సేద్యం పరికరాలను ఒకసారి పొందితే మరో ఏడేళ్ల వరకు రాయితీపై వీటిని పొందే అవకాశం లేదు. ఒక ఇంటిలో ఒక రైతుకు మాత్రమే పథకం వర్తిస్తుంది

బిందు, తుంపర సేద్యంతో బహుళ ప్రయోజనాలు



బిందు, తుంపర సేద్యంతో ఎన్నో ప్రయోజనాలు వున్నాయని జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సాధారణ పద్ధతిలో ఒక ఎకరాకు పెట్టే నీరు, బిందు/తుంపర సేద్యం పరికరాలతో ఐదు ఎకరాలకు పెట్టుకోవచ్చు. ఒక ఎకరా తడవడానికి సాధారణంగా ఎనిమిది నుంచి 12 గంటల సమయం పడుతుంది. ఈ పరికరాలతో రెండు మూడు గంటల్లోనే నీరు పెట్టుకోవచ్చు. మొక్కకు నేరుగా నీరు చేరడం వల్ల కలుపు పెరిగే అవకాశం వుండదు. సాధారణ పద్ధతిలో ఎరువులను మొక్కల వద్ద, చాళ్లలో చల్లుతారు. కానీ బిందు, తుంపర సేద్యం పరికరాల ద్వారా నీటితోపాటు ఎరువులను కలిపి నేరుగా మొక్కలకు మాత్రమే అందేలా చేయవచ్చు. విద్యుత్ ఆదా అవుతుంది. అన్ని రకాల భూముల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలను వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా ఎగుడు, దిగుడు భూముల్లో వీటి వల్ల ఎక్కువ ఉపయోగం వుంటుంది. పొలంలో అన్ని మొక్కలు లేదా చెట్లకు సమానంగా నీరు అందుతుంది. కలుపు తీత, ఎరువులు వేయడానికి కూలీ ఖర్చు వుండదు. మామూలు విధానంలో కంటే 25 నుంచి 40 శాతం దిగుబడులు పెరుగుతాయి.

-ఆర్.శ్రీనివాసరావు, పీడీ, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు

- కశింకోట జాతీయ రహదారిపై రాస్తారోకో
- ఆర్డీఓ సూర్యకళ రావాలని పట్టుబట్టిన రైతులు
- ఎస్ఐ జోక్యంతో శాంతించిన నిరసనకారులు
- నిష్పక్షపాతంగా విచారణ : ఆర్డీఓ

మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి





రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

వివాదాస్పదంగా జమాదులపాలెం భూ వినతుల స్వీకరణ

కశింకోటరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జమాదులపాలెం భూ వినతుల స్వీకరణ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఆర్డీఓ సూర్యకళ రావాలని కోరుతూ రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ఎస్ఐ మధుసూదనరావు జోక్యం చేసుకుని రైతులకు శాంతింపజేశారు. అంతకు ముందు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడారు. దశాబ్దాల తరబడి భూమిని నమ్ముకున్న సాగుదారులను ఇబ్బంది పెట్టడం సరికాదని, పండగ పూట విచారణ చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకే రోజు అందరినీ పిలవడంతో వివాదాలకు దారితీసే అవకాశాలున్నాయన్నారు. సుమారు రెండు వందల సంవత్సరాలు వంశపార్యంపరంగా సాగు చేసుకుంటున్నారని, గతంలో ఏలేరు కాలువలో భూములు పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించారని, అదే సర్వే నంబరులో చాలా మందికి పక్కా ఇళ్లు నిర్మించారని, హుద్‌హుద్ తుఫాన్‌లో నష్టపరిహారం వచ్చాయని ఇంతకంటే వారి దగ్గర ఇంకేమి ఆధారాలుంటాయని దాడి ప్రశ్నించారు. ఈ భూములపై సాగు హక్కు కల్పించాలంటూ అనేక సార్లు పోరాటాలు చేశారని గుర్తు చేశారు. 2010లో అప్పటి కలెక్టర్ భూములను సర్వే చేయించి 260 మందిని సాగుదారులుగా గుర్తించారని తెలిపారు. వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ జమాదులపాలెం భూసమస్యను ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సృష్టించారని, ఆయనే ఈ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పదవికి రాజీనామా చేయాలన్నారు. అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్ మాట్లాడుతూ సాగుదారులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకుడు బాలకృష్ణ మాట్లాడుతూ సాగు హక్కు ఆధారాలు చూపించమంటే రైతుల వద్ద ఆధారాలు లేవని, అందుకే విచారణకు ముందే సర్వే చేయించి వారికి సాగు సర్టిఫికేట్లు ఇవ్వాలన్నారు. ఈ వినతుల స్వీకరణకు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కౌంటరుకు ఒక ఆర్ఐ, వీఆర్వోను ఏర్పాటు చేశారు. వక్ఫ్‌బోర్డు, ఈనాందారులు, సాగు రైతులు వినతిపత్రాలు సమర్పించారు. ఆర్డీవో ఎంవీ సూర్యకళ మాట్లాడుతూ సాగుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసులు ఇచ్చామంటే సాగుదారులుగా గుర్తించినట్లేనని, అది కూడా ఒక ఆధారమని అన్నారు. 2010లో సర్వే చేయించిన ప్రకారం నోటీసులు ఇచ్చామని తెలిపారు. రైతులందరూ ఒక్కొక్కరుగా వినతి పత్రాలు ఇవ్వాలని దీని తర్వాత సమగ్ర విచారణ జరిపించి తదుపరి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఇందులో ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని విచారణ నిష్పాక్షపాతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాజుల రమేష్, విల్లూరి పైడారావు, సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సిట్ ఫిర్యాదులతో కదిలిన యంత్రాంగం

ఆక్రమణల తొలగింపు



అక్రమణ తొలిగించి బోర్డును పెట్టిన అధికారులు

మాకవరపాలెం: మండలం నుంచి సిట్‌కు వెళ్లిన ఫిర్యాదులతో రెవెన్యూ అధికారులు కదిలారు. మండలంలో ప్రభుత్వ భూములు, శ్మశానాలు ఆక్రమణకు గురయ్యాయని సిట్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో గురువారం ఆక్రమణలు తొలగించగా, శుక్రవారం తూటిపాల గ్రామంలో శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణలు తొలగించిన అనంతరం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.రమామణి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి గ్రామాల్లో ఉన్న సమస్యలపై సిట్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఫిర్యాదులు మేరకు అక్రమణలను తొలిగిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని తూటిపాల, భీమబోయినపాలెం, తామరం, రాచపల్లి గ్రామాల నుంచి ఇప్పటికే ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఈ మూడు గ్రామాల్లో ఆక్రమణలపై సిట్‌కు నివేదిక పంపించినట్లు తెలిపారు. తూటిపాల గ్రామంలో శ్మశానవాటిక స్థలంతోపాటు లేవుట్‌ను ఆక్రమణ చేసి పశువుల పాకలు వేసినట్టు ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఇందులో భాగంగానే పశువుల పాకలు తొలిగిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

చేతులు మారుతున్న ప్రభుత్వ భూములు



ప్రభుత్వ భూమిలో సరుగుడు తోట వేసిన దృశ్యం

మాకవరపాలెం: ఎన్నో ఏళ్ల నుంచి సాగులో ఉన్న ప్రభుత్వ భూములు ప్రస్తుతం చేతులు మారుతున్నాయి. ఎకరా భూమి లక్ష రూపాయల ధర పలకడంతో ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములు దస్తా వేజుల రూపంలో అమ్మకాలు జరుగుతున్నాయి. మండలంలో ఎరకన్నపాలెం గ్రామానికి ఆనుకోని 1400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఈ భూమిని గత పదేళ్ల నుంచి కన్నూరిపాలెం, తామరం, మాకవరపాలెం, విశాఖపట్నం, ఎలమంచిలి, రాచపల్లి గ్రామాలకు చెందిన కొందరు బడాబాబులు పది నుంచి 20 ఎకరాలను ఆక్రమణ చేసి సాగు చేస్తూ ఏటా మామిడి, జీడి తోటల నుంచి 5 నుంచి పది లక్షల రూపాయలు ఆదాయం పొందుతున్నారు. అయితే సిట్‌కు ఫిర్యాదులు వెళ్లడం, దానిపై రెవెన్యూ అధికారులు తీసుకుంటున్న చర్యలు నేపథ్యంలో ఈ భూమిని వదులుకోవాలని భూ అక్రమణదారులు సర్దుబాటు చేస్తున్నారు. ఇప్పటికే తామరం గ్రామానికి చెందిన ఇద్దురు 15 ఎకరాల భూమిని 15 లక్షలకు అమ్మకాలు జరిపారు. భూమిని కోనుగోలు చేసిన బడాబాబులు దళితల భూములోకి వెళ్లకుండా దారులు మూసివేయడంతో ఈ భూముల అమ్మకాలు విషయం బయట పడింది. ఇందులో భాగంగానే మాకవరపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తనకున్న పది ఎకరాల భూమిని అమ్మాకానికి పెట్టారు. భూములు కోనుగోలు చేసి తోటలను తొలిగించి సరుగుడు తోటలు వేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అధిక మొత్తంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ చేసిన బడాబాబులను గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలని, లేకుంటే ప్రభుత్వ భూములు అమ్మకాలు జరిగిపోతాయని రైతులు అన్నారు.

రావలమ్మపాలెంలో హత్య



శ్రీనివాసరావు (ఫైల్)

- చెత్త విషయంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ
- మృతుడిది అచ్యుతాపురం మండలం జంగులూరు



సబ్బవరం రూరల్ : మండలంలోని రావలమ్మపాలెంలో ఇరు కుటుంబాల మధ్య తలెత్తిన వివాదం గురువారం అర్ధరాత్రి ఒక వ్యక్తి హత్యకు దారితీసింది. తన కుమార్తెను ఎందుకు దూషించారని అడిగినందుకు పక్కనే వుంటున్న మరో కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అతనిపై దాడి చేసి హతమార్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా వున్నాయి.

విజయనగరం జిల్లా వేపాడ మండలం బల్లంకి గ్రామానికి చెందిన లంక అప్పలనాయుడు (60), అతడి భార్య వరలక్ష్మి, కుమారుడు అప్పారావు (40), కోడలు చిన్నమ్మలు (35) రావలమ్మపాలెం గ్రామంలో వుంటున్నారు. వీరు అదే గ్రామంలో జక్కాన సూర్యనారాయణ వద్ద కొంతకాలంగా నౌకరీ పని చేస్తున్నారు. సూర్యనారాయణకు చెందిన ఇంట్లో ఒక పోర్షన్‌లో ఈ కుటుంబం నివాసం వుంటోంది. అదే ఇంట్లో మరో పోర్షన్‌లో అచ్యుతాపురం మండలం జంగులూరు గ్రామానికి చెందిన లాలం శ్రీనివాసరావు (40), భార్య సత్యవతి, కుమార్తె మౌనిక (16), కుమారుడు (14) మూడేళ్లుగా అద్దెకు వుంటున్నారు. శ్రీనివాసరావు ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా, సత్యవతి అచ్యుతాపురంలోని బ్రాండెక్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. వీరి కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కుమారుడు అచ్యుతాపురంలోని వసతిగృహంలో వుంటూ తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. ఈ ఇరు కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా చెత్తా చెదారం, మురుగు నీరు తదితర విషయాల్లో స్పర్థలు ఏర్పడి తరచూ మాటల యుద్ధం జరిగేది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి శ్రీనివాసరావు కుమార్తె మౌనిక మాత్రమే వారి ఇంట్లో వున్న సమయంలో అప్పలనాయుడు, భార్య వరలక్ష్మి, కోడలు చిన్నమ్మలు ఆమెను ఉద్దేశించి దుర్భాషలాడారు. ఈ విషయాన్ని కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన తండ్రి శ్రీనివాసరావుకు మౌనిక వివరించింది. దీంతో



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



విచారిస్తున్న పోలీసులు

అప్పలనాయుడు, వరలక్ష్మి, చిన్నమ్మలను నిలదీయడంతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో .స్నానానికి ఉపక్రమిస్తున్న శ్రీనివాసరావు పైకి అప్పలనాయుడు కుటుంబ సభ్యులు రాయి విసిరారు. తలకు తగిలి గాయమై శ్రీనివాసరావు కింద పడిపోగా అప్పలనాయుడు, వరలక్ష్మి, అప్పారావు, చిన్నమ్మలు అతడిపై దాడి చేసి కొట్టారు. అక్కడే ఉన్న మౌనిక భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీసి తన తండ్రిని చంపేస్తున్నారంటూ ఇరుగుపొరుగు వారిని తీసుకొచ్చింది. కొన ఊపిరితో వున్న శ్రీనివాసరావును స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. గురువారం రాత్రి విధుల నుంచి వచ్చిన మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు నలుగురిని అనకాపల్లి సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ టి.మల్లేశ్వరరావు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం సీఐ, ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటికి పెద్ద దిక్కు మృతిచెందడంతో శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల తమకు దిక్కెవరంటూ రోదిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ నర్సీపట్నం



నర్సీపట్నం మున్సిపాలిటీ

నెల రోజుల్లో చెత్తరహిత పట్టణంగా మార్పు

నర్సీపట్నం, ఆగస్టు 4:

రాష్ట్రంలో 'స్వచ్ఛ మున్సిపాలిటీ' పథకంలో భాగంగా చెత్త రహిత(జీరో గార్బేజ్) పురపాలక సంఘంగా నర్సీపట్నాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలు చేస్తున్నది. రాష్ట్రంలో కేవలం రెండు మున్సిపాలిటీలు మాత్రమే ఈ పథకం అమలుకు ఎంపిక చేయగా, వాటిలో ఒకటి నర్సీపట్నం, మరొకటి బొబ్బిలి. ఈ రెండూ ఉత్తరాంధ్రలోనే వుండడం గమనార్హం. ఈ పథకం కింద ప్రతి రోజూ మున్సిపాలిటీలో సేకరించిన చెత్తాచెదారాలను ఒకచోట చేర్చి, తడి-పొడి చెత్తగా విభజిస్తారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మారుస్తారు. పొడిచెత్త నుంచి ప్లాస్టిక్, రబ్బర్, మెటల్, వస్త్రం, తదితర వాటిని వేరు చేస్తారు. అనంతరం రీ-సైక్లింగ్ చేస్తారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ బాధ్యతను క్యూ-బయోఎనర్జీ అనే సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

'స్వచ్ఛ మున్సిపాలిటీ' పథకాన్ని అమలు చేయడానికి ప్రధానంగా కావాల్సింది కంపోస్టు నిర్వహణ యార్డు. నర్సీపట్నం శివార్లలోని ఉత్తరవాహిని వద్ద రూ.1.16 కోట్ల వ్యయంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కును నిర్మించారు. గత ఏడాది జూన్ 11వ తేదీన మంత్రి అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేయగా, శరవేగంతో భవనాల నిర్మాణం, పార్కు అభివృద్ధి, ప్రహరీగోడ నిర్మాణం జరిగాయి. ఇంకా యంత్ర సామగ్రి రావాల్సి వుంది. త్వరలో యంత్రాలు వస్తాయని, వీటిని బిగించిన తరువాత తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తామని మున్సిపాలిటీ ప్రజారోగ్య విభాగం అధికారులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకం పనిచేయడం ప్రారంభిస్తుందని తెలిపారు.

క్యూ-బయో ఎనర్జీ సంస్థకు నిర్వహణ బాధ్యత

నర్సీపట్నం మున్సిపాలిటీలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం క్యూ-బయో ఎనర్జీ సంస్థకు అప్పగించింది. ఇళ్లు, వ్యాపార/వాణిజ్య సంస్థలు, దుకాణాలు, వీధుల్లో చెత్త సేకరణ బాధ్యతను మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చేపడతారు. ప్రతి ఇంటికి రెండు ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లు ఇస్తారు. ఒకటి తడి చెత్తకు, రెండోది పొడి చెత్తకు. పారిశుధ్య సిబ్బంది వీధుల్లోకి వచ్చినప్పుడు ప్రజలు తడి, పొడి చెత్తను వారికి ఇవ్వాలి.

సిబ్బంది కూడా తమ రిక్షాలపై రెండు వేర్వేరు ప్లాస్టిక్ బాస్కెట్‌లను వుంచి, వాటిలో తడి, పొడి చెత్తను వేస్తారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కుకు తీసుకెళ్లి అప్పగిస్తారు.

రోజూ 19 టన్నుల చెత్తసేకరణ

మున్సిపాలిటీదిలో రోజూ 19 టన్నుల తడి, పొడి చెత్తను సేకరించి క్యూ-బయో ఎనర్జీ సంస్థకు సరఫరా చేయాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వినియోగంలోకి వచ్చిన తరువాత పట్టణాన్ని చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. సుమారు నెల రోజుల్లో ఈ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం వుందని చెప్పారు. ఈ ప్లాంట్‌లను లీజు పద్ధతిలో క్యూ-బయో ఎనర్జీ సంస్థకు అప్పగిస్తామని, వారికి అవసరమైన నీరు, విద్యుత్ కూడా మున్సిపాలిటీ సరఫరా చేస్తుందని కమిషనర్ తెలిపారు.



పట్టణ శివార్లలో నిర్మించిన కంపోస్ట్ యార్డు



పెదబొడ్డేపల్లి చెరువు వద్ద ప్రస్తుతం వున్న డంపింగ్ యార్డు

ఆధునిక పద్ధతుల్లో రీసైక్లింగ్

పట్టణంలో సేకరించిన చెత్తను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లో ఆధునిక పద్ధతుల్లో రీసైక్లింగ్ చేస్తామని క్యూ-బయోఎనర్జీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ఉమామహేశ్వరరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తొలుత తడి, పొడి చెత్తగా విభజిస్తామని, తడి చెత్తను విండ్రో పద్ధతిలో 40 రోజుల్లో సేంద్రీయ ఎరువుగా మార్పుతుందని చెప్పారు. దీనిని తక్కువ ధరకు రైతులకు ధరకు విక్రయిస్తామన్నారు. పొడిచెత్తలో ప్లాస్టిక్, రబ్బర్, మెటల్ వంటి వాటిని వేరుచేసి రీసైక్లింగ్ చేసి విక్రయిస్తామన్నారు. మిగిలిన రెక్జిన్, థర్మోకోల్ వంటి వాటిని సైంటిఫిక్ పద్ధతిలో ఇక్కడే పూడ్చిపెడతామని తెలిపారు.

వ్యాపారుల గుప్పెట్లో అడ్డాకు ధరలు

కోనాం సంతలో సిండికేట్‌గా మారిన వ్యాపారులు

కావిడి ఆకులు రూ.400 నుంచి రూ.500లకు బేరం

గతంలో రూ.1,000 నుంచి రూ.1,200లకు కొనుగోలు

జీసీసీ కొనుగోలు చేయకపోవడంతో ధరలు తగ్గించిన వ్యాపారులు

కష్టానికి కనీస ప్రతిఫలం దగ్గడం లేదని గిరిజనుల ఆవేదన

చీడికాడ:

విస్తర్ల తయారీకి వినియోగించే అడ్డాకుల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గతంలో కావిడి ఆకులు వెయ్యి నుంచి 1200 రూపాయలకు కొనుగోలు చేసిన వ్యాపారులు, ఇప్పుడు రూ.400 నుంచి రూ.500లకు అడుగుతుండడంతో కొండలు, గుట్టలు, లోయల్లో నుంచి ఎక్కి, దిగి తిరిగి ఇళ్లకు తీసుకెళ్లలేక, వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నది. శుక్రవారం కోనాం సంతకు వచ్చిన పాడేరు మండలం ఐనాడ పంచాయతీ నేరేళ్ల గ్రామానికి చెందిన గిరిజనులు 'ఆంధ్రజ్యోతి' ఎదుట తమ గోడు వెళ్లబోసున్నారు. భార్యభర్తలు కలిసి 15 రోజుల పాటు అడవుల్లో తిరిగితే ఒక కావిడి ఆకులు సేకరించగలుతామని చెప్పారు. తరువాత వాటిని ఎండబెట్టి, ఆరిన తరువాత కావడి కట్టుకుని తెల్లవారుజామున ఐదు గంటలకు గ్రామం నుంచి సంతకు బయలుదేరతామని, తుప్పలు, డొంకలు, రాళ్లు, రప్పల మధ్య నడుచుకుంటూ ఉదయం 11 గంటలకు ఇక్కడకు చేరుకుంటామని తెలిపారు. రెండు మాసాల క్రితం వరకు కావిడి అడ్డాకులు వెయ్యి నుంచి రూ.1200లకు కొనుగోలు చేసేవారని, ఇప్పుడు రూ.400 నుంచి రూ.600 మధ్య వ్యాపారులు అడుగుతున్నారన్నారని వాపోయారు. జీసీసీకి అమ్ముదామంటే వారు కొనుగోలు చేయడంలేదని, ఇదే అదనుగా భావించి వ్యాపారులు ధరలు తగ్గించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డాకులను తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక, వ్యాపారులు అడిగిన ధరకు ఇచ్చేస్తున్నామని చెప్పారు. జీసీసీ అధికారులు స్పందించి అడ్డాకులు కొనుగోలు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



అడ్డాకులను కోనాం సంతలో అమ్ముకోవడానికి తెచ్చిన గిరిజనులు

కూలిపాటు కూడా గిట్టడం లేదు

కుర్రా భీమన్న, నేరెళ్ల గ్రామం



అడ్డాకులు సేకరించడానికి ఎంతో కష్టపడాలి. చెట్లు ఎక్కి ఆకులు తెంచాలి. ఇటువంటి సమయంలో అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతుంటాం. సేకరించిన ఆకులను ఎండబెట్టి, దొంతర్లుగా పేర్చి, కావిడికి కట్టుకుని 30 కిలోమీటర్ల దూరం రాళ్లు, రప్పల మధ్య నడుచుకుంటూ కోనాం సంతకు తీసుకువస్తాం. గతంలో జీసీసీ కొనుగోలు చేసేది. అప్పట్లో గిట్టుబాటు ధర లభించేది. ఇప్పుడు కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నది.

ఇద్దరం కలిసి 15 రోజులు కష్టపడితే...

తామళ్ల భీమరాజు, నేరెళ్ల గ్రామం



ఒక కావిడి అడ్డాకుల కోసం ఇద్దరు కలిసి 15 రోజులు కష్టపడాలి. అడవుల్లో చెట్లు ఎక్కి ఆకులు సేకరించాలి. వాటిని ఇంటికి తీసుకువచ్చి, పచ్చిదనం పోయే వరకు ఆరబెట్టాలి. తరువాత ప్యాకింగ్ చేసుకుని, కావిడితో సంతకు తేవాలి. ఇంత కష్ట పడినా మాకు దక్కేది అరకొరే. సగటున రోజుకి రూ.20 నుంచి రూ.30 మాత్రమే గిడుతున్నది. జీసీసీ కొనుగోలు చేయకపోతే వ్యాపారులు భవిష్యత్తులో ధరలను మరింత తగ్గించేస్తారు.

నక్కపల్లిలో ప్రయోగశాల

- ఆరు మండలాలకు సేవలు
- బోర్లు నుంచి ఏటా ఒకసారి, తాగునీటి పథకాల నుంచి రెండుసార్లు నమూనాల సేకరణ
- ఖనిజ లవణాలు ఎక్కువున్నా... తక్కువున్నా తాగడానికి పనికిరావని నిర్ధారణ
- నీటి పథకాలు, బోర్లుపై మార్కింగ్
- పాయకరావుపేట, ఎలమంచిలి, కోటవురట్ల మండలాల్లో అక్కడక్కడా ఫ్లోరైడ్ మోతాదుకు మించి వున్నట్టు గుర్తింపు
- నీటి పరీక్షల ఫలితాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

తాగునీటి స్కానింగ్





నక్కపల్లి, ఆగస్టు 4:

తాగునీటిలో మన శరీరానికి అవసరమైన పలు ఖనిజ లవణాలు వుంటాయి. ఇవి మోతాదు మేర వుంటే మంచిది. ఖనిజ లవణాలు ఎక్కువైనా, తక్కువైనా ఆరోగ్య సంబంధ సమస్యలు ఏర్పడతాయి. మనం నిత్యం తాగే మంచినీటిలో కాల్షియం, క్లోరైడ్, సల్ఫేట్, నీటి కాఠిన్యత, ఆల్కాలినిటీ, నైట్రేట్, ఫ్లోరైడ్, ఇనుము, తదితర ఖనిజ లవణాలు నిర్ధారిత మోతాదులో వుండాలి. నీటిలో లవణాల సంఖ్య లీటరు నీటికి 500 మిల్లీ గ్రాముల నుంచి 2000 మిల్లీ గ్రాముల వరకు వుండాలి. అంతకుమించి వుంటే ఆ నీరు తాగడానికి పనికిరాదని భావించాలి. ఖనిజ లవణాలు ఎక్కువ, తక్కువ వున్న నీరు తాగితే ఆ ప్రభావం జీర్ణకోశ వ్యవస్థపై పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



నక్కపల్లిలోని తాగునీటి ప్రయోగ శాలలో నీటిని పరీక్షిస్తున్న కెమిస్ట్

నక్కపల్లిలో ప్రయోగశాల

నక్కపల్లి, కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం, ఎలమంచిలి, రాంబిల్లి మండలాలకు కలిపి తాగునీటి ప్రయోగశాల నక్కపల్లిలో వుంది. ఇక్కడ ప్రభుత్వ మంచినీటి పథకాలు(వాటర్ ట్యాంకులు), బోర్లకు సంబంధించిన నీటిని పరీక్షిస్తుంటారు. ఇక్కడ మైక్రో బయాలజిస్ట్, కెమిస్ట్ వున్నారు. పరీక్షలకు అవసరమైన ఆధునిక సామగ్రి వుంది. ఆరు మండలాల నుంచి నెలకు 300 నీటి నమూనాలను సేకరించి పరీక్షిస్తుంటారు. వీటిలో 250 నీటి నమూనాలకు రసాయన పరీక్షలు చేస్తారు. మరో 50 నమూనాలకు మైక్రో బయాలజిస్ట్ బ్యాక్టీరియా పరీక్ష చేస్తారు. గ్రామాల నుంచి నీటి నమూనాలను ఫీల్డ్ అసిస్టెంట్ సేకరిస్తారు. ఆరు మండలాల్లో 315 మంచినీటి పథకాలు, 2,309 బోర్లున్నాయి. ప్రతి బోరు నీటిని ఏడాదిలో ఒకసారి పరీక్షించాలి. ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే నీటిని ఏడాదికి రెండుసార్లు పరీక్షించాలి



నక్కపల్లిలోని తాగునీటి విశ్లేషణ ప్రయోగశాల

నక్కపల్లి ప్రయోగశాల పరిధిలోని మండలాలు, తాగునీటి పథకాలు, బోరు...

మండలం	నీటిపథకాలు	బోర్లు
నక్కపల్లి	50	589
కోటవురట్ల	104	430
ఎస్.రాయవరం	48	382
పాయకరావుపేట	50	335
ఎలమంచిలి	17	193
రాంబిల్లి	46	380
మొత్తం	315	2,309

పరీక్షల అనంతరం బోర్లుకు మార్కింగ్



మంచినీటి పథకాలు, బోర్లు నుంచి నీటి నమూనాలను సేకరించి, నక్కపల్లి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ఫ్లోరైడ్ సహా ఇతర ఖనిజ లవణాలకు సంబంధించి మోతాదు ఎక్కువైనా, తక్కువైనా ఆ నీరు తాగడానికి పనికిరాదని నిర్ధారిస్తారు. ఆ బోర్లు లేదా నీటి పథకం ట్యాంకుపై మార్కింగ్ వేస్తారు. తాగడానికి నీరు ఉపయోగపడుతుందంటే 'టిక్' మార్కు వేస్తారు. తాగడానికి పనికిరాదని తేలితే వాటి ఇంగ్లిష్ అక్షరం 'ఎక్స్' మాదిరిగా 'ఇంటూ' మార్కు వేస్తారు.

పరీక్షల ఫలితాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్



నక్కపల్లి తాగునీటి ప్రయోగశాలలో ప్రథజ నెలా టార్గెట్ ప్రకారం 300 నీటి నమూనాలను సేకరించి పరీక్షిస్తుంటాం. అనంతరం వాటి వివరాలను ఎప్పటికప్పుడు గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం జిల్లా, రాష్ట్ర అధికారులకు తెలియజేస్తాం. ఈ మేరకు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. తాగడానికి నీరు అనువుగా లేకపోతే మార్కింగ్ ఇస్తాం.

కె.భాస్కరరావు, కెమిస్ట్

తేడా వుంటే.... తాగొద్దని చెబుతాం



నక్కపల్లి తాగునీటి ప్రయోగశాలలో ప్రభుత్వ ఆధీనంలో వున్న మంచినీటి పథకాలు, బోర్లు నీటినే మాత్రమే పరీక్షిస్తాం. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల నుంచి నీటిని సేకరిస్తాం. ఫ్లోరైడ్ లేదా ఇతర ఖనిజ లవణాలు ఎక్కువ లేదా తక్కువ వుంటే వాటి నీటిని తాగవద్దని సంబంధిత గ్రామాలు లేదా ప్రాంతాల ప్రజలకు చెబుతాం. అంతేకాక బోరు హెడ్‌పై ఒక మార్క్ వేస్తాం. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎవరైనా తమను లేదా మండల అధికారులను కోరితే నీటిని తప్పకుండా పరీక్షిస్తాం. ప్రభుత్వ పథకాలతో సంబంధం లేని చెరువులు, ఇతర వనరుల నీటిపై అనుమానాలు వున్నాయని, పరీక్షించాలని ప్రజలు కోరితే నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తాం. ఫలితాలను వారికి తెలియపరుస్తాం.

ఎస్.మాధవరాజు, మైక్రో బయాలజిస్ట్



పరీక్షల కోసం గ్రామాల నుంచి సేకరించిన నీటి నమూనాలు

ఏ ఖనిజ లవణం.... ఎంత మేర వుండాలి....

- ఆల్కాలినిటీ 200 నుంచి 600 మిల్లీ గ్రాముల వరకు వుండొచ్చు. అంతకు మించితే నీటి రుచి అదో రకంగా వుంటుంది.
- నీటి కాఠిన్యత(హార్డ్‌నెస్) 300 నుంచి 600 మిల్లీ గ్రాములు ఉండాలి. అంతకుమించి వుంటే శ్వాసకోశ సంబంధ వ్యాధులబారిన పడే ప్రమాదం వుంది.
- కాల్షియం లీటరు నీటిలో 75 నుంచి 200 మిల్లీ గ్రాములు వుండాలి.
- క్లోరైడ్ 250 నుంచి 1000 మిల్లీ గ్రాములు వుండాలి.
- సల్ఫేట్ 200 నుంచి 400 మిల్లీ గ్రాములు వుండాలి.
- క్లోరిన్ 0.2 నుంచి 1.0 శాతం వుండాలి. అంతకు మించితే విరేచనాలు, జీర్ణకోశ సంబంధ సమస్యలు ఏర్పడతాయి.
- ఫ్లోరైడ్ 1.0 శాతం నుంచి 1.5 శాతం మాత్రమే వుండాలి. అంతకంటే ఎక్కువ వుంటే ఎముకలు, దంతాలకు ఫ్లోరోసిస్ సోకుతుంది. ఎముకల్లో కాల్షియం శాతం పడిపోతుంది. ఎముకలు గట్టితనాన్ని కోల్పోతాయి. ఫలితంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. తద్వారా అనేక వ్యాధులు సోకుతాయి. ఎముకలు బలహీన పడి, వంకర్లు తిరుగుతాయి. ఎముకలు పెళుసుగా మారి చిన్నపాటి ప్రమాదాలకే విరిగిపోతాయి. కీళ్ల నొప్పులు అధికమవుతాయి.

అక్కడక్కడ ఫ్లోరైడ్ సమస్య



- ఎలమంచిలి మండలం షేకిళ్లపాలెంలో రెండు మంచినీటి ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే నీటిలో ఫ్లోరైడ్ అధికంగా వున్నట్టు గుర్తించారు.
- పాయకరావుపేట మండలం అంకంపేట గ్రామంలోని రెండు నీటి పథకాల్లో కూడా ఫ్లోరైడ్ సమస్య వున్నట్టు పరీక్షల ద్వారా నిర్ధారించారు.
- కోటవురట్ల మండలం సుంకపూరు ఎస్సీ కాలనీ, పి.తంగేడులోని రెండు స్కీముల నుంచి సరఫరా అయ్యే నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా వున్నట్టు ఇటీవల జరిపిన పరీక్షల్లో తేలింది. సుంకపూరు ఎస్సీ కాలనీలోని నాలుగు బోర్లలో నీరు తాగడానికి పనికిరాదని నిర్ధారించారు.
- నక్కపల్లి మండలంలో ఎక్కువ బోర్ల నుంచి ఉప్పు నీరు వస్తున్నదని, నక్కపల్లి వీవర్స్ కాలనీలో ఒక బోరు, బుచ్చిరాజుపేటలో కొన్ని బోర్ల నీటిలో ఫ్లోరైడ్ శాతం మోతాదుకు మించి వున్నందున వాటి నీటిని తాగవద్దని సూచించారు.

ఇద్దరు గంజాయి నిందితులపై

పీడీ యాక్ట్

కొత్తకోట సీఐ కోటేశ్వరరావు



రాజు, చల్లంనాయుడు

రావికమతం : మండలంలోని కొత్త కోట సర్కిల్ పరిధిలో ఇద్దరు గంజాయి నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేశామని సీఐ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడి విలేఖరులతో మాట్లాడారు. రోలుగుంట మండలం సరబవరం గ్రామానికి చెందిన దోసపర్తి రాజుతో పాటు రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన సోమిరెడ్డి చల్లంనాయుడిపై కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. వారు పలుమార్లు గంజాయి రవాణాలో పట్టుబడడమే కాకుండా ఇతర కేసుల్లోనూ నిందితులుగా ఉన్నారని చెప్పారు. మరికొంతమంది గంజాయి రవాణాదారులపై కూడా పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. గంజాయి రవాణా చేసే వారి సమాచారం,గంజాయి రవాణాలో ఎక్కువ మొత్తం సంపాదించిన వారి సమాచారం తమకు తెలియజేయాలని కోరారు. సమాచారం తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఫిర్యాదులను 9440769080, 8332970780, 949061 9495, 9440904214 సెల్ నంబర్లకు తెలియజేయవచ్చునని తెలిపారు.

చెత్త ఏరుకుంటుండగా పేలుడు

ఇద్దరికి తీవ్రగాయాలు

హెటెరో ఔషధ పరిశ్రమకు సమీపంలో ఘటన

నక్కపల్లి : స్థానిక హెటెరో ఔషధ పరిశ్రమకు సమీపంలో శుక్రవారం సాయంత్రం పేలుడు సంభవించడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.హెటెరో పరిశ్రమ దాటిన తరువాత రాజయ్యపేటకు వెళ్లేదారిలో ఉప్పుటేరుఉంది.ఉపమాక గ్రామానికి చెందిన పి.కిట్టమ్మతో పాటు ఆయన బంధువురాజు ఇక్కడ చెత్త ఏరుకుంటుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. చెత్త ఏరుకునే సమయంలో కెమికల్ డ్రమ్ము ఏదైనా వుండి పేలుడు జరిగిందా ?లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా?అన్నది తెలియాల్సి వుంది. ఈ విషయమ్మై హెటెరో ప్రతినిధి రామకృష్ణారెడ్డిని విలేఖర్లు సంప్రదించగా గాయపడిన వారు తమ కంపెనీలో పని చేయడం లేదని, బయట చెత్త ఏరుకుంటుండగా ప్రమాదం జరిగిందని కొందరు పశువుల కాపరులు చెప్పడంతో మానవతా దృక్పథంతో వారిని ఆస్పత్రికి తరలించామన్నారు.ఇందులో రాజు పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం తరలించారు. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

తల్లి సంవత్సరికానికి వెళ్లి వస్తూ..

రోడ్డు ప్రమాదంలో తమ్ముడు మృతి..

అన్న పరిస్థితి విషమం



మృతి చెందిన రామచంద్రరావు

భోగాపురం:విజయనగరం జిల్లా భోగాపురంలోని అక్కివరం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖలోని విశాలక్షినగర్‌కు చెందిన అన్నదమ్ములు కిల్లంశెట్టి రామచంద్రరావు (35), జనార్ధనరావు తల్లి సంవత్సరికం చేయడానికి శుక్రవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి విశాఖ వస్తుండగా అక్కివరం జంక్షన్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీబలంగా ఢీకొంది. దీంతో రామచంద్రరావు అక్కడకక్కడే మృతి చెందగా జనార్ధనరావుకి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు రామచంద్రరావుకు ఇంకా వివాహం కాలేదు. భోగాపురం ఎస్ఐ తారకేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయండి

- కోనాం గురుకుల కళాశాల విద్యార్థిని మృతిపై దళిత సంఘాల ఆందోళన
- సిబ్బంది నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని ఆరోపణ
- ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారుల నిర్బంధం
- మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్
- సిబ్బందిపై చర్యలకు నివేదిక



మాట్లాడుతున్న గురుకుల కళాశాలల జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్

చీడికాడ : మండలంలోని కోనాం గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని నూకరత్నం కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ... దళిత సంఘాల నాయకులు శుక్రవారం కళాశాల గేటు ముందు ఆందోళన చేపట్టారు.మాలమహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సియ్యాద్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాల సిబ్బందిని లోపలికి వెళ్లకుండా గేటు బయటే అడ్డుకున్నారు. అధికారులు ఎంత నచ్చజెప్పినా.. వినలేదు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

నాతవరం మండలం యర్రవరం పంచాయతీ పరిధిలోని బెండపూడి గ్రామానికి చెందిన నూకరత్నం ఈ ఏడాది కోనాం గురుకుల బాలికల కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరింది. గత నెల 20వ తేదీ నుంచి ఆమె జ్వరంతో బాధపడుతున్నా..సిబ్బంది పట్టించుకోకపోవడంతో పచ్చకామెర్లు, మలేరియా, టైఫాయిడ్‌తో బాధపడుతూ మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఆమె మృతికి కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కారణమని ఆరోపిస్తూ.. దళిత సంఘాల నాయకులు ఆందోళన చేశారు. మృతురాలి కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఈమేరకు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌తో పాటు ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఇతర అధ్యాపకులను మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నిర్బంధించారు. అంతకుముందు ఉపాధ్యాయులను గాని, కూరగాయలను గాని లోపలకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు.

ఇంటికి పంపించడం తప్పే : చంద్రశేఖర్

అనారోగ్యంతో బాధ పడుతున్న నూకరత్నాన్ని ఆమె అమ్మమ్మతో ఇంటికి పంపించడం తప్పేనని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించాల్సి ఉందని, కానీ సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. నూకరత్నం కుటుంబానికిన్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయినా దళితసంఘాల నాయకులు శాంతించకపోగా, స్పష్టమైన హామీ వచ్చేవరకు కదలనివ్వబోమని భీష్మించారు. దీంతో ఆయన విషయాన్ని ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఇంతలో చీడికాడ ఎస్ఐ ఎం. శిరీష్ కుమార్‌సిబ్బందితో వచ్చి ఎటువంటి గొడవలు లేకుండా చూశారు.



కళాశాల వద్ద దళిత సంఘాల ఆందోళన, పక్కన రోదిస్తున్న నూకరత్నం తల్లిదండ్రులు

ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు?

ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖరాన్ని సస్పెండ్ చేయాలని గురుకుల కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం గురించి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు మరువాడ ఈశ్వరరావు, దళిత సంఘ నాయకులు పతివాడ రాంబాబు, మాటూరి చిన్నారావు, చిట్ల చలపతి, వేచలపు ప్రకాష్, జి. సహదేవుడు, జల్లూరి ప్రకాష్, గాలి బుచ్చిబాబు, సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు నుంచి జారి పడి ఆర్మీ ఉద్యోగి మృతి

ఎలమంచిలి: కుటుంబ సభ్యులను చూసేందుకు, వారితో సరదాగా ఉండేందుకు సెలవుపై వచ్చిన ఆర్మీ ఉద్యోగి ప్రమాదవశాత్తు బస్సుపై నుంచి జారి పడడంతో మృతి చెందాడు. పట్టణ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల మేరకు...కశింకోట మండలం జమాదులపాలెం గ్రామానికి చెందిన కూండ్రపు అప్పారావు (21) రెండేళ్ల క్రితం ఆర్మీలో చేరాడు. నాలుగు రోజుల క్రితం తల్లి, అక్కను చూసేందుకు సెలవుపై వచ్చాడు. శుక్రవారం ఎలమంచిలిలోని బంధువుల ఇంటికి వచ్చి అనకాపల్లి డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులో స్వగ్రామానికి వెళ్తుండగా అయ్యప్పస్వామి ఆలయం వద్ద ప్రమాదవశాత్తు బస్సు ఫుట్‌పాత్ నుంచి కాలు జారి పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పారావుకు ఇంకా వివాహం కాలేదు. ప్రస్తుతం రాజస్థాన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రి లేకపోవడంతో కుటుంబ భారమంతా అప్పారావు మీదనే ఆధారపడి ఉంది. ఆయన మృతితో కుటుంబం రోడ్డున పడింది. మృతదేహాన్ని ఎలమంచిలి మార్చురీకి తరలించడంతో ఆ ప్రాంతమంతా కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో నిండిపోయింది.కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.





బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి (ఇన్‌సెట్లో) అప్పారావు

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌పీకి తీవ్ర గాయాలు

కోటవురట్ల: టి. జగ్గంపేట శివారు తిమ్మాపురం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుంకపూర్‌ఉపాధి హామీ పథకం వీఆర్‌పీకి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీవో నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. కోటవురట్ల మండలం సుంకపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం వీఆర్‌పీగా పని చేస్తున్న ప్రకాష్ గురువారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై జగ్గంపేటలోని తన బంధువులు ఇంటికి వెళ్లి అక్కడి నుంచి తిమ్మాపురం వెళ్తుండగా మధ్యలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల బైక్‌ను ఢీకొన్నారు. దీంతో ప్రకాష్ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆయన్ను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలించారు.

ట్రాక్టర్ బోల్తా పడి నలుగురికి గాయాలు

అనకాపల్లిటౌన్ : మండలంలోని జాతీయ రహదారి పరిధిలోని కొప్పాక పరిశ్రమల కేంద్రం వద్ద శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు...అక్కిరెడ్డివానిపాలెం గ్రామానికి చెందిన నారపిన్ని శివగణేష్, బొగ్గు వెంకటరమణ, కె. నూకఅప్పారావు, నూకరాజు పరిశ్రమల కేంద్రంలోని సిమెంట్ గొడౌన్‌లో సిమెంట్ లోడు చేసుకొని ట్రాక్టర్‌పై గ్రామానికి బయలుదేరి వస్తుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో కొప్పాక పరిశ్రమల కేంద్రం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్నారు. దీంతో ట్రాక్టర్ బోల్తా పడి అందులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని బోల్తా పడిన ట్రాక్టర్



ప్రమాదంలో గాయపడిన వారు

మామిడి తోటలకు ఆకుజల్లెడ గూడు పురుగు బెడద

- నివారణ చర్యలు చేపట్టకుంటే నష్టమే
- కృషి విజ్ఞాన కేంద్రం (కొండెం పూడి) ఉద్యానవనశాఖ శాస్త్రవేత్త ఎన్.సత్తిబాబు


ఆకు జల్లెడ గూడు పురుగు తెగులు సోకిన మామిడి తోటను రైతులకు చూపిస్తున్న శాస్త్రవేత్త సత్తిబాబు

రావికమతం: మామిడి తోటల్లో ఆకు జల్లెడ గూడు పురుగు నివారించకుంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం (కొండెం పూడి) ఉద్యానవనశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు అన్నారు. మండలంలోని చినపాచిల, మత్స్యపురం, కొమిర, గొంప తదితర గ్రామాల్లో శుక్రవారం పలు రైతుల మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి తోటల్లో ఆకు జల్లెడ గూడు పురుగు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై, ఆగస్టు నెలల్లో మామిడిలో కొత్త చిగుర్లు వస్తాయన్నారు. ఈ చిగుర్లను ఆకు జల్లెడ గూడు పురుగు కొరికివేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ పురుగు లార్వా ఆకుల మధ్యన ఉన్న కణజాలను పూర్తిగా తినివేసి ఆకులను జల్లెడలా చేసి ఆపై ఆకులన్నీ దగ్గరకు చేర్చి గూడును ఏర్పరచుకుంటుందన్నారు. ఈ పురుగు తీవ్ర దశకు చేరుకున్నప్పుడు లేత చిగురును, పూతను, మొగ్గలను ఆశించిన తరువాత పూగుత్తులను కూడా గూడుగా ఏర్పాటు చేసుకొని పంటకు నష్టం కలిగిస్తుందన్నారు. ఈ పురుగును తక్షణమే నివారించుకోవాలని రైతులకు ఆయన సూచించారు. ఈ పురుగు నివారణకు కినాల్‌పాస్ రెండు మిల్లీలీటర్ల మందును ఒక లీటరు నీటిలో లేదా కార్బిల్ మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. దీనిని రెండుసార్లు చేయాలన్నారు. మందు పిచికారి చేసే ముందు జల్లెడ గూడులుగా ఉన్న మామిడి ఆకులు అన్నింటిని తొలగించిన తరువాతే మందు పిచికారి చేయాలన్నారు. కొత్త చిగురు రావడానికి జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిని, అలాగే 10 గ్రాముల యూరియా కూడా కలిపి చెట్టు అంతా తడిచే విధంగా పిచికారి చేయాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-2లో పేలుడు

ఉద్యోగికి గాయాలు ● కార్మికుల ఆందోళన


పేలుడుకు దెబ్బతిన్న స్లాగ్‌యార్డ్

ఉక్కుటౌన్‌షిప్: విశాఖ ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-2లో శుక్రవారం తెల్లవారుజామున పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో గొందేశి సత్తిబాబు అనే క్రేన్ ఆపరేటర్ గాయపడ్డాడు. వివరాలిలా వున్నాయి. లిక్విడ్ స్టీల్ స్లాగ్ (ఇనుము మరిగిన తరువాత పైన వుండే పొడి)ను డంప్ చేసేందుకు తెల్లవారుజామున 4.30 గంటలకు యార్డ్‌కు తీసుకువెళ్లారు. అయితే అత్యంత వేడిగా వుండే స్లాగ్ కింద వున్న నీటిపై పడడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో స్లాగ్ యార్డ్ ధ్వంసమైంది. యార్డ్ పైకప్పు, యంత్రసామగ్రి, రెస్ట్‌రూమ్ అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇదిలావుండగా గాయపడిన సత్తిబాబును తొలుత ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సిట్ కొరడా

- మధురవాడలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి స్వాధీనానికి ఆదేశం
- కబ్జాదారుల చెరలో రూ.30 కోట్ల భూమి
- దర్జాగా లీజుకు ఇచ్చుకున్న వైనం



స్వాధీనం చేసుకున్న భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 4: రికార్డుల ట్యాంపరింగ్‌పై దర్యాప్తులోనే కాదు..కబ్జాదారుల్లో చేతుల్లో చిక్కుకున్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే విషయంలో కూడా సిట్ దూసుకుపోతోంది. తనకు అందిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపి మధురవాడలో సుమారు రూ.30 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతమైందని గుర్తించింది. తక్షణం స్వాధీనం చేసుకోవాల్సిందిగా కలెక్టర్‌కు సూచించింది.

రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం...గ్రామీణ మండలం మధురవాడ సర్వే నంబర్ 363/3లో 1.96 ఎకరాలు, 325/పి/లో 20 సెంట్లు ప్రభుత్వ భూమి వుంది. మొత్తం 2.16 ఎకరాలను పోతిన వెంకటరావు అనే వ్యక్తి స్వాధీనంలో వుంచుకున్నారు. ఈ భూమిని గతంలో కొందరు ఎస్సీ రైతులకు ఇచ్చినప్పటికీ తరువాత అందులో ఎలాంటి సేద్యం చేయకపోవడంతో పట్టాలను రద్దు చేశారు. అది అసైన్డ్ ల్యాండ్ కావడంతో లబ్ధిదారుల పేర్లు కూడా రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించారు. జాతీయ రహదారికి అత్యంత సమీపంలో (లా కళాశాల వద్ద) వున్న ఈ భూమిని పోతిన వెంకటరావు ఆక్రమించి ఒక షెడ్డు నిర్మించాడు. అందులో అరటి సాగు చేయడంతో పాటు ఒక నర్సరీ యజమానికి లీజుకు ఇచ్చాడు. అయితే ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నట్టు సిట్ అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై వారం రోజుల కిందట డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేశారు. ఆ భూమి ప్రైవేటు వ్యక్తులది కాదని తేలింది. దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదిక మేరకు సిట్ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం మండల అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో ఆక్రమిత స్థలానికి చేరుకున్నారు. అక్కడ నర్సరీ నిర్వహిస్తున్న యజమాని ప్రతాపరాజును భూమికి సంబంధించిన హక్కు పత్రాలను చూపించాల్సిందిగా తహశీల్దార్ భాస్కర రెడ్డి కోరారు. తన వద్ద ఎలాంటి పత్రాలు లేవని, పోతిన వెంకటరావు వద్ద నర్సరీ నిర్వహణకు లీజుకు తీసుకున్నానని తెలిపాడు. తాను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి మొక్కలు సరఫరా చేస్తున్నానని మూడు రోజులు గడువు ఇస్తే మొక్కలు తరలిస్తానని ప్రతాపరాజు అధికారులను అభ్యర్థించాడు.

ఈ విషయంలో ఉన్నతాధికారులు ఆదేశాలను పాటించవలసి వున్నందున వెంటనే ఖాళీ చేయాలని భాస్కర్‌రెడ్డి ఆదేశించారు.షెడ్డు కూల్చివేతఆక్రమిత స్థలంలో వున్న షెడ్డును ఎక్స్‌కవేటర్‌తో అధికారులు కూల్చివేశారు. అలాగే సిమెంటు పోల్స్‌తో వేసిన ఇనుప కంచెను తొలగించారు. అరటి తోటలను ధ్వంసం చేశారు. స్వాధీనం చేసుకున్న భూమిలో మూడు చోట్ల అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.


మాట్లాడుతున్న వడ్డాది వరలక్ష్మి

కేంద్ర సెన్సార్ బోర్డు రీజనల్ సభ్యురాలిగా వడ్డాది వరలక్ష్మి

మాడుగుల: మాడుగుల గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు వడ్డాది వరలక్ష్మికి కేంద్ర సెన్సార్ బోర్డు రీజనల్ సభ్యురాలిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా.. బీజేపీ నాయకుడు వెంకయ్యనాయుడు, ఎంపీ హరిబాబు, చలపతిరావు, ఎంఎల్‌సీ సోము వీర్రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రరాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

1996లో బీజేపీ సభ్యత్వం పొందిన వరలక్ష్మి అదే ఏడాదిలో ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొందారు. అప్పటి నుంచి వివిధ రకాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించిన ఆమె ఎంపీటీసీ పదవీకాలం అనంతరం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పనిచేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శి మండల సునీత, ఎక్స్ సర్పంచ్ దంగేటి సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్టా గంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాతరపల్లి అప్పారావు, టౌన్‌పార్టీ అధ్యక్షుడు చోడ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గౌరపట్టపు జగన్నాథరావు, మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి కొండబాబు, పాలసొసైటీ మాజీ అధ్యక్షుడు కర్రి లక్ష్మిరావు తదితరులు ఆమెను అభినందించారు.

లైంగిక దాడి: నిందితుడికి జైలు

విశాఖపట్నం-లీగల్ : ముక్కుపచ్చలారని పసికందు పై సభ్య సమాజం సిగ్గుపడేలా లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ శుక్రవారం మహిళా కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నంలోని లక్ష్మినగర్‌కు చెందిన కె.రాధాకృష్ణ (25) ఓ బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో సదరు యజమాని ఉద్యోగం నుంచి తప్పించారు. అయినప్పటికీ అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో 2011, ఆగస్టు 30న పాఠశాల నుంచి ఇంటికి బస్సులో వెళుతుండగా అదే బస్సులో ప్రయాణం చేస్తున్న రాధాకృష్ణ బాలిక పక్కనే కూర్చున్నాడు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడిపై పై విధంగా న్యాయమూర్తి శిక్ష విధించారు.

‘వెలమ కార్పొరేషన్ ఏర్పాటు చేయరూ’


జెడ్‌పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంబాబు, సంఘం ఇతర ప్రతినిధులు

విశాఖపట్నం: ఆర్థికంగా, విద్యాపరంగా, ఉపాధి పరంగా వెనుకబడిన వెలమలకు ఆదుకునేలా ప్రత్యేకంగా వెలమ కార్పొరేషన్ ఏర్పాటు చేయలని కోరుతూ శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీని కలిసి ఉత్తరాంధ్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరవ రాంబాబు అధ్యక్షతన సంఘం ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంలో తన వంతు కృషి చేస్తానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఆమెను కలిసిన వారిలో లాలం భాస్కర్‌రావు, కృష్ణమోహన్, గొర్ల చందు, నరవ విజయ్‌కుమార్, నాయుడు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

7న అప్పన్న దర్శనం ఒంటి గంట వరకే



సింహాచలం : శ్రావణ పూర్ణిమ అనగా ఈనెల 7వ తేదీన కేతుగ్రస్త చంద్రగ్రహణం సంభవిస్తుంది. ఈ కారణంగా ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే భక్తులకు వరాహలక్ష్మీ నృసింహస్వామి దర్శనం కల్పిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి కోడూరి రామచంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. చంద్రగ్రహణ నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల లోపు రాత్రి ఆరాధనం, పవళింపు సేవలను పూర్తి చేసి కవాట బంధనం చేస్తామన్నారు. 8వ తేదీ ఉదయం గ్రహణ సంప్రోక్షణం అనంతరం భక్తులకు యధావిధిగా స్వామివారి దర్శనాలు లభిస్తాయని చెప్పారు.

మాతృశాఖకు జిల్లా పర్యాటకాధికారి

- ఇన్‌చార్జిగా దాసు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యాటకాధికారి కె.జ్ఞానవేణిని మాతృశాఖ రెవెన్యూకు అప్పగిస్తూ పర్యాటకశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హిమాంశు శుక్లా ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో తహసీల్దారు హోదా కలిగిన జ్ఞానవేణి గల ఏడాది ఆగస్టు ఒకటిన డెప్యూటేషన్‌పై పర్యాటకశాఖ అధికారిగా చేరారు. డెప్యూటేషన్ గడువు ఏడాది ముగియడంతో ఆమెను ప్రస్తుత విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పర్యాటకశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ పర్యాటకాధికారి జి.దాసుకు జిల్లా పర్యాటక శాఖ బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

మెంటల్ ఎబిలిటి

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
ఎ) EHWYST బి) WEYHTS
సి) TUSEWJ డి) ఏదీకాదు
2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
ఎ) LHLEQK బి) LQLKHE
సి) LELQHK డి) ఏదీకాదు
3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
ఎ) GZOGMV బి) GMVOZG
సి) GVOZMG డి) ఏదీకాదు
4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
ఎ) IPPQT బి) IPTQP
సి) UQOTO డి) ఏదీకాదు
5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు
6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
ఎ) CHUSPNL బి) HNCPLHU
సి) CNHUSPL డి) ఏదీకాదు

7 - 10
ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి
7. NOSE కు సరైన కోడ్?
ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు
8. AIM కు సరైన కోడ్?
ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు
9. MIND కు సరైన కోడ్?
ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు
10. HOME కు సరైన కోడ్?
ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు


11. 6, 7, 16, 51, ---------
ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు
12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు
13. 8, 3, 2, 3, 10, --------
ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు
14. 5, 4, 6, 15, 56, -------
ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు
15. 9, 15, 43, 83, 247, -----------
ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు
16. a - bc - ab - cdabc - da - cd - ----
ఎ) abbcdd బి) adbcbd
సి) abcdbd డి) ఏదీకాదు
17. ab - b - cacc - b - a - cb
ఎ) cbaab బి) aabbc
సి) adcab డి) ఏదీకాదు
18. d - dba - a - db - - a - ac
ఎ) bcdbcc బి) bbcccd
సి) bccdbc డి) ఏదీకాదు
19. ప్రకటనలు: అన్ని జిల్లాలు రాష్ట్రాలు
అన్ని రాష్ట్రాలు దేశాలు
సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు
20. ప్రకటనలు: ఏ సెకను నిమిషం కాదు




Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

కొన్ని నిమిషాలు గంటలు
సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
3. కొన్ని గంటలు నిమిషాలు
4. అన్ని సెకన్లు గంటలు
ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు
21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 20 బి) 22 సి) 18 డి) 14
22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?




ఎ) 8 బి) 9 సి) 10 డి) 11

23 - 25
భిన్నమైనదాన్ని తెలపండి
23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH


26 - 30
A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B
పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి
26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
సి) D మేనకోడలు A డి) ఏదీకాదు
27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A మామగారు C బి) D భర్త C
సి)D కుమార్తె B డి) A తండ్రి D
28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A కోడలు C బి) C భార్య B
సి) B భర్త C డి) C మామగారుA
29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
సి) A తండ్రి D డి) D భర్త C
30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కోడలు B బి) C అత్తగారు A
సి) C తండ్రి D డి) D తండ్రి C

31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు
32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Honey 2. Heart 3. Home
4. Health 5. Help
ఎ) Help బి) Home
సి) Heart డి) Honey
33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు
34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగాను, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగాను రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
ఎ) JaNuaRy బి)JANuary
సి) JAnuARy డి) ఏదీకాదు
35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల ఎడమ అయిదో అక్షరాన్ని తెలపండి?
ఎ)A బి) B సి) O డి) N
36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
ఎ) L బి) M సి) N డి) P

(37-40)



పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి
37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను
41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?



ఎ) 5 బి) 6 సి) 3 డి) 1
42. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదేవారం వచ్చే తదుపరి నెల?
ఎ) నవంబరు బి) అక్టోబరు
సి) జనవరి డి) డిసెంబరు

సమాధానాలు

			19) ఎ	27) సి	35) బి
			20) సి	28) ఎ	36) సి
1) ఎ	7) ఎ	13) ఎ	21) బి	29) సి	37) బి
2) సి	8) సి	14) బి	22) బి	30) ఎ	38) డి
3) బి	9) ఎ	15) సి	23) డి	31) బి	39) సి
4) సి	10) బి	16) బి	24) సి	32) బి	40) ఎ
5) ఎ	11) ఎ	17) ఎ	25) బి	33) సి	41) బి
6) సి	12) బి	18) సి	26) ఎ	34) ఎ	42) డి

ఉద్యోగాలు

ఐజిఐఎంఎస్

పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజిఐఎంఎస్)- **సీనియర్ రెసిడెంట్/ ట్యూటర్** పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు : 57
విభాగాలవారీ ఖాళీలు: అనెస్థీషియా 2, చెస్ట్ & టిబి 1, డెంటిస్ట్రీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ - ఎమర్జెన్సీ 5, జనరల్ సర్జరీ 1, జనరల్ సర్జరీ - ఎమర్జెన్సీ 1, మైక్రో బయాలజీ 1, ఆప్తల్మాలజీ 1, ఆర్థోపెడిక్స్ 1, ఫార్మకాలజీ 1, పీడియాట్రిక్స్ 3, ఫిజికల్ మెడిసిన్ 1, సైకియాట్రీ 1, రేడియాలజీ 6, కార్డియాలజీ 8, కార్డియో థోరాసిక్ వాస్క్యులర్ సర్జరీ 2, నెఫ్రాలజీ 11, న్యూరో మెడిసిన్ 1, న్యూరో సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 1, పీడియాట్రిక్ సర్జరీ 2, యూరాలజీ 1
వయసు: ఆగస్టు 31 నాటికి 35 ఏళ్లు మించరాదు
అర్హత: ఎంసిఐ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సెంట్రల్/ స్టేట్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500
ఇంటర్వ్యూ: ఆగస్టు 21 నుంచి 24 వరకు
వేదిక: Office Chamber of the Director, IGIMS, Patna - 14
వెబ్‌సైట్: www.igims.org

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- **'గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన జిఎంఇ కోర్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా ఎనిమిది నెలల జిఎంఇ షోర్ ట్రైనింగ్, పది నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు **'ఎంఇఒ క్లాస్ 4 పార్ట్ బి'** సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.
సీట్లు: 40(జనరల్ వర్గానికి 20, ఒబిసిలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3 సీట్లు కేటాయించారు)
క్యాంపస్: SCI' Maritime Training Institute, Powai, Mumbai
కోర్సు ఫీజు: రూ.4,50,000
స్టయిపెండ్: నెలకు రూ.15,000 ఇస్తారు
అర్హత: 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు/ ఆఖరు ఏడాది పరీక్షలు రాసి ఆగస్టు 31 నాటికి ఫలితాలు వెలువడే అవకాశం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి & పన్నెండో తరగతి లెవెల్ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆల్ ఇండియా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం రెండు గంటలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించిన మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అడుగుతారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో అర్హత సాధించాలి. అర్హులైనవారిని ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు.
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000
అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని ఆర్డినరీ పోస్ట్/ కొరియర్/ స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్డ్ పోస్ట్ / బై హ్యాండ్ ద్వారా కింది చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
చిరునామా: Vice President I/C, Flee Personnel Dept, Third Floor, The shipping Corporation of India, Shipping House 245, Madame Cama Road, Nariman Point, Mumbai- 400021
వెబ్‌సైట్: www.shipindia.com/careers

గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

జంతు రాజ్యం, మొక్కలు - ఆర్థిక ప్రయోజనాలు

1. క్రికెట్ బ్యాట్ తయారీలో ఉపయోగించే చెట్టు?
ఎ) విల్లో బి) హాల్లీ సి) హాక్‌బెర్రి డి) వెదురు
2. కింది ఏ రంగులను పత్రాల నుంచి సేకరిస్తారు?
ఎ) ఇండిగో బి) హెన్నా సి) క్లోరోఫిల్ డి) పైవన్నీ
3. ఆహారపదార్థాల్లో రంగుగా ఉపయోగించే అన్నెట్టోను ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) వేరు బి) కాండం సి) విత్తనం డి) పత్రం
4. ఏ చెట్టు నుంచి రబ్బరు తయారు చేస్తారు?
ఎ) ఫైకస్ ఎలాస్టికా బి) కాస్టిల్లా ఎలాస్టికా
సి) హివియా బ్రెసిలెన్సిస్ డి) పైవన్నీ
5. కింది ఏ చెట్టు నుంచి గమ్(జిగురు)ను సేకరిస్తారు?
ఎ) ఫైకస్ బి) అకేసియా సి) పైనస్ డి) పైవన్నీ
6. టర్పెంటైన్‌ను కింది ఏ చెట్టు నుంచి సేకరిస్తారు?
ఎ) విల్లో బి) పైనస్ సి) అకేసియ డి) హివియా
7. 'లవంగం' మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) వేరు
బి) ఫలం
డి) పుష్ప విన్యాసం



8. మిరియాలు మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) ఫలం సి) వేరు డి) కాండం
9. చాక్లెట్ల తయారీలో ఉపయోగించే కోకోవాను మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) ఫలం బి) మొగ్గ సి) విత్తనాలు డి) కాండం
10. కింది ఏ సుగంధ ద్రవ్యాన్ని విత్తనాల నుంచి సేకరిస్తారు?
ఎ) యాలకులు బి) లవంగం
సి) దాల్చిన చెక్క డి) పైవన్నీ
11. గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?
ఎ) యూకలిప్టస్ బి) డిజిలాలిస్
సి) బెల్లడోనా డి) క్వినైన్
12. సింకోనా అనే ఔషధ మొక్కలోని ఏ భాగం నుంచి మలేరియా చికిత్సలో ఉపయోగించే క్వినైన్ అనే ఔషధాన్ని సేకరిస్తారు?
ఎ) వేరు బి) బెరడు సి) పత్రం డి) విత్తనాలు
13. 'ముల్లంగి' మొక్కలోని ఏ భాగం?
ఎ) దుంప కాండం బి) నిల్వ చేసే వేరు
సి) ఫలం డి) పుష్ప విన్యాసం
14. కింది వాటిలో ఏక దళ బీజ మొక్క?
ఎ) చిక్కుడు బి) గోధుమ సి) బఠాని డి) ఏదీకాదు
15. అల్లం : భూగర్భ కాండం :: బీట్‌రూట్ : ....
ఎ) వేరు బి) ఫలం సి) లశునం డి) కొమ్ము
16. కింది వాటిలో చిరుధాన్యం?
ఎ) వరి బి) గోధుమ సి) రాగి డి) పైవన్నీ
17. విత్తన సుప్తావస్థను కలుగజేసే ఫైటోహార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) సైటోకైనిన్
సి) జిబ్బరెల్లిన్ డి) ఆబ్‌సైసికామ్లం
18. కింది వాటిలో సంయుక్త ఫలం ఏది?
ఎ) పైనాపిల్ బి) సీతాఫలం
సి) కొబ్బరి డి) మామిడి
19. గోల్డెన్ రైస్ అనేది ఒక ....
ఎ) కీటక నిరోధకత కలిగిన మొక్క
బి) నీటి ఎద్దడిని తట్టుకోగలిగే మొక్క
సి) బీటా కెరోటిన్‌ను కలిగిన జన్యుపరివర్తన మొక్క
డి) పైవన్నీ

జనరల్ స్టడీస్ - బయాలజీ

20. ఊడ వేర్లను కలిగి ఉన్న చెట్టు?
ఎ) మొక్కజొన్న బి) చెరకు సి) మర్రి డి) పైవన్నీ
21. ఆడమ్స్ ఫిగ్, ఆపిల్ ఆఫ్ పారడైజ్ అనే ప్రతి నామాలు కలిగిన ఫలం?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) సీతాఫలం
22. బంగినపల్లి, సువర్ణరేఖ అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) పైనాపిల్
23. చక్కెరకేళి, అమృతపాణి అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) సీతాఫలం బి) జామ సి) మామిడి డి) అరటి
24. స్వర్ణ, మొతి అనేవి ఏ ధాన్యంలోని రకాలు?
ఎ) వరి బి) గోధుమ సి) జొన్న డి) సజ్జ
25. మర్రి చెట్టు జీవితకాలం?
ఎ) 50 సంవత్సరాలు బి) 80 సంవత్సరాలు
సి) 200 - 300 సంవత్సరాలు
డి) 100 - 150 సంవత్సరాలు
26. ఏనుగు సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 35.9°C
బి) 25°C
సి) 42.9°C డి) 51°C



27. కుక్క సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) 125°F బి) 84 - 92°F
సి) 100 - 102.5°F డి) 110 - 114°F
28. గుర్రం సాధారణ శరీర ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 99.5° - 101,5°F బి) 82° - 85°F
సి) 74.3° - 76.5°F డి) 105° - 107°F
29. నీలి తిమింగలం గుండె బరువు?
ఎ) 50 కి.గ్రా. బి) 150 కి.గ్రా.
సి) 750 కి.గ్రా. డి) 78 కి.గ్రా.
30. ఏనుగు గుండె సుమారుగా ఎన్ని కిలో గ్రాముల బరువు ఉంటుంది?
ఎ) 12 - 21 కి.గ్రా. బి) 5 - 6 కి.గ్రా.
సి) 35 - 39 కి.గ్రా. డి) 50 - 56 కి.గ్రా.
31. ఏనుగు గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 26 డి) 06
32. నీలి తిమింగలం గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 16 డి) 07
33. జంతువుల్లో ఎత్తయినది ఏది?
ఎ) ఏనుగు బి) జిరాఫీ సి) గుర్రం డి) గేదె
34. జలగ ఏ వర్గానికి చెందిన జీవి?
ఎ) మొలస్కా బి) నిడేరియ సి) అనెలిడా డి) కార్డేటా
35. 'గుడ్లగూబ' ఒక ....
ఎ) పక్షి
బి) క్షీరదం
సి) సరీసృపం
డి) అకశేరుకం



36. కింది వాటిలో స్వీయ మలభక్షక జంతువు?
ఎ) పంది బి) కుక్క సి) కుందేలు డి) ఏదీకాదు
37. సీతాకోకచిలుక జంతురాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) ఆర్థ్రోపొడా బి) మొలస్కా సి) అనెలిడా డి) కార్డేటా
38. ఏ జంతువు కంటిలో టపేటమ్ లుసిడమ్ ఉంటుంది?
ఎ) పిల్లి బి) కుక్క సి) గుర్రం డి) పైవన్నీ
39. ఊసరవెల్లి ఏ తరగతికి చెందిన జంతువు?
ఎ) క్షీరదం బి) సరీసృపం
సి) ఉభయచరం డి) అకశేరుకం
40. కింది ఏ జంతువు కళ్లు పరస్పరం స్వతంత్రంగా (రెండోదానితో సంబంధం లేకుండా) పనిచేస్తాయి?
ఎ) ఊసరవెల్లి బి) కుందేలు సి) గుడ్లగూబ డి) పిల్లి
41. కింది ఏ జంతువులో మూడు కనురెప్పలు ఉంటాయి?
ఎ) ఏనుగు బి) ఒంటె సి) గుర్రం డి) జిరాఫీ
42. పిల్లికి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 230 - 250 బి) 310 - 330
సి) 196 - 205 డి) 260 - 270
43. కుక్కకి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 220 - 225 బి) 290 - 296
సి) 319 - 321 డి) 200 - 206
44. ఎక్కువ జీవిత కాలాన్ని కలిగి ఉన్న జంతువు?
ఎ) టర్టిల్ బి) ఏనుగు సి) తిమింగలం డి) పులి
45. పులి జీవితకాలం ఎన్ని సంవత్సరాలు?
ఎ) 30 బి) 10 సి) 45 డి) 12
46. కింది ఏ జంతువు జీవితకాలంలో దంతాలు ఒకసారి మాత్రమే ఏర్పడతాయి?
ఎ) కుక్క బి) మానవుడు సి) ఎలుక డి) పైవన్నీ
47. కింది ఏ జంతువులో రధనికలు, అగ్ర చర్వణకాలు ఉండవు?
ఎ) కుందేలు బి) గేదె సి) ఎలుక డి) పైవన్నీ
48. ఒకే రకమైన దంతాలను కలిగి ఉన్న జంతువు?
ఎ) కుక్క బి) కుందేలు సి) మానవుడు డి) డాల్ఫిన్
49. దంతాలు లేని సరీసృపం?
ఎ) తాబేలు బి) బల్లి సి) టర్టిల్ డి) తాబేలు, టర్టిల్
50. కింది వాటిలో కీటకం?
ఎ) సిల్వర్ ఫిష్ బి) డాగ్ ఫిష్
సి) డేవిల్ ఫిష్ డి) ఏదీకాదు
51. కింది వాటిలో క్షీరదం?
ఎ) గబ్బిలం బి) డాల్ఫిన్ సి) డుడాంగ్ డి) పైవన్నీ
52. జతపరచండి.

1. ఉల్లి	ఎ. కొమ్ము
2. బంగాళదుంప	బి. లశునం
3. అల్లం	సి. దుంపకాండం
	డి. కందం

ఎ) 1-ఎ, 2-బి, 3-డి బి) 1-బి, 2-సి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-డి డి) 1-ఎ, 2-సి, 3-డి
53. కింది వాటిలో సరైన జత కానిది?

మొక్క	- క్రోమోజోముల సంఖ్య
1. ఉల్లి	- 16
2. వరి	- 24
3. యాపిల్	- 34

ఎ) 1, 3 బి) 2, 3 సి) 3 డి) ఏదీకాదు
54. కుంకుమ పువ్వును మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) పుష్పం బి) వేరు సి) బెరడు డి) ఫలం
55. కింది ఏ జంతువు నీరు తాగకుండా ఎక్కువ రోజులు ఉంటుంది?
ఎ) గుర్రం బి) ఏనుగు సి) ఒంటె డి) గేదె

సమాధానాలు

1) ఎ	9) సి	17) డి	27) సి	37) ఎ	47) సి
2) డి	10) ఎ	18) ఎ	28) ఎ	38) డి	48) డి
3) సి	11) బి	19) సి	29) సి	39) బి	49) డి
4) డి	12) బి	20) సి	30) ఎ	40) ఎ	50) ఎ
5) బి	13) బి	21) బి	31) బి	41) బి	51) డి
6) బి	14) బి	22) ఎ	32) డి	42) ఎ	52) బి
7) ఎ	15) ఎ	23) డి	33) బి	43) సి	53) డి
8) బి	16) సి	24) సి	34) సి	44) ఎ	54) ఎ
		25) సి	35) ఎ	45) ఎ	55) సి
		26) ఎ	36) సి	46) సి	



అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ కోసం నిర్వహించే ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి ప్రకటనను విడుదల చేసింది.
ఆఫర్ చేస్తున్న కోర్సులు: ఎంబిఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్- ఈవెనింగ్ సెషన్)
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
ఎంబిఏ (ఈవెనింగ్-పార్ట్‌టైమ్)
ప్రవేశం: టిఎస్ఐసెట్-2017 ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 11, 2017
రాత పరీక్ష తేదీ: ఆగస్టు 13, 2017
వెబ్‌సైట్: http://www.ouadmissions.com/

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్, డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఇంటర్మీడియెట్ (బయాలజీ/మేథ్స్, ఫిజికల్ సైన్స్)
వయసు: 17-25 సంవత్సరాలు
దరఖాస్తు: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్ పేరిట రూ.100 డిడిని తీసి నిర్దేశిత చిరునామాకు పంపి దరఖాస్తును పొందొచ్చు. కవర్ మీద అభ్యర్థి వివరాలు రాయాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్,
పిన్: 500028.

బార్క్‌లో డిప్లొమా

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
సీట్ల సంఖ్య: 30
అర్హత: 60 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ (ఫిజిక్స్)
వయసు: 26 సంవత్సరాలు
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21, 2017
రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్ 3, 2017
వెబ్‌సైట్: http://www.barc.gov.in/

జెఎన్‌టియు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు)-హైదరాబాద్, ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
సీట్ల సంఖ్య: 20
అర్హత: 55 శాతం మార్కులతో ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1,000
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
వెబ్‌సైట్: http://jntuh.ac.in/admissions
చిరునామా: డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినేషన్, జెఎన్‌టియూ, కూకట్‌పల్లి, హైదరాబాద్-85.

స్కాలర్‌షిప్

రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్

న్యూఢిల్లీలోని రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్ - సంస్కృత విద్యాభివృద్ధిలో భాగంగా ఉద్దేశించిన **'మెరిట్ స్కాలర్‌షిప్స్'**నకు ప్రకటన విడుల చేసింది. ఇందుకు ఎంహెచ్‌ఆర్‌డి సహకారాన్ని అందిస్తోంది.
శాన్‌స్క్రిట్/ పాళి/ ప్రాకృత్‌లను మెయిన్/ ఆప్షనల్ సబ్జె క్టులుగా శాన్‌స్క్రిట్ పాఠశాల/ శాన్‌స్క్రిట్ మహా విద్యా లయ/ శాన్‌స్క్రిట్ విశ్వవిద్యాలయాల్లో చదువుతు న్నవారు అర్హులు. పూర్వ మాధ్యమ(ప్రథమ సంవత్సరం)/ తొమ్మిదో తరగతి పూర్వ మాధ్యమ (రెండో సంవత్సరం)/ పదోతరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(మొదటి సంవ త్సరం), పదకొండో తరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(రెండో సంవత్సరం), పన్నెండో తరగతి శస్త్రీ, బిఏ/ ఆచార్య ఎమ్మే/ విద్యావారధి/ పిహెచ్‌డి చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
విద్యా సంస్థల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 30
అభ్యర్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 10
వెబ్‌సైట్: www.sanskrit.nic.in, www.scholarship.rsks.in

విద్యుత్ సరఫరా, అంతరాయాల పర్యవేక్షణ

■ డివిజన్‌లో 147 ఫీడర్లకు మోడమ్, సిమ్‌ల ఏర్పాటు ■ వినియోగదారుల సమస్యలు చకచకా పరిష్కారం

■ 1912 టోల్‌ఫ్రీ ద్వారా 24 గంటలు ఫిర్యాదుల స్వీకరణ ■ ఏపీఈపీడీసీఎల్ డీఈ మహేంద్రనాథ్

అనకాపల్లి : ఏపీఈపీడీసీఎల్ ద్వారా విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని డీఈ మహేంద్రనాథ్ తెలిపారు. ఇక్కడి సంస్థ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ పరిధిలో 11 కేవీ ఫీడర్‌లు 147 ఉన్నాయన్నారు. వీటికి మోడమ్, సిమ్‌లను ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యుత్ సరఫరా, అంతరాయాలను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. అంతరాయం కలిగినట్లు ఆన్‌లైన్‌లో గమనించిన వెంటనే సరఫరాను పునరుద్ధరిస్తున్నామని వివరించారు.

మీడియా ద్వారా విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల మెయింటెన్స్ వివరాలు

విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల మెయింటెన్స్ పనుల వివరాలను ముందుగా మీడియా ద్వారా వినియోగదారులకు తెలియజేసి శని, ఆదివారాల్లో చేస్తామని డీఈ చెప్పారు. అలాగే పలు యాప్‌ల ద్వారా వినియోగదారులకు సేవలందిస్తామన్నారు. 1912 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా 24 గంటలు ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పరిధిలోని 295 హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ అధికారులు కైజాలా యాప్‌లో గ్రూపుగా ఏర్పడినట్టు వివరించారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాలో రాబోయే అంతరాయలను ముందుగా గుర్తించి వినియోగదారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. అలాగే ఈస్ట్రన్ పవర్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపు, సరఫరాలో అంతరాయాలను వినియోగదారులు తెలుసుకోవచ్చునన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీఈ మహేంద్రనాథ్, అధికారులు

మీ-సేవలో కొత్తగా ఈవోడీబీ సేవలు

మీ-సేవలో కొత్తగా ఈవోడీబీ అనే సేవను పొందుపరిచామని మహేంద్రనాథ్ వివరించారు. ఇందులో భాగంగా దరఖాస్తుదారుడు కొత్త సర్వీసుకు కావాల్సిన స్తంభాలు, లైన్, లోడు, కేటగిరీ వివరాలు తెలియజేసిన వెంటనే చెల్లించాల్సిన సొమ్ము తెలియజేయడం జరుగుతుందన్నారు. సొమ్ము చెల్లించిన వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి రివిజన్ అవసరం లేని పక్షంలో వెంటనే పని పూర్తి చేసి సర్వీసు రిలీజ్ చేస్తారన్నారు. వినియోగదారులకు ఎల్ఈడీ బల్బులు, ఫ్యాన్లు, ట్యూబులైట్లు అందిస్తున్నామన్నారు. వ్యవసాయ మోటార్ల మార్పు, సోలార్ అగ్రికల్చర్ పంపుసెట్లు రాయితీపై ఇస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఏడీఈ ఎస్.రామకృష్ణ, ఏఈ సీహెచ్.దేముడు తదితరులు పాల్గొన్నారు.

కేవీ తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకోండి

కేంద్ర మంత్రి జవదేకర్‌కు ఎంపీ ముత్తంశెట్టి వినతి

అనకాపల్లి టౌన్ : గ్రామీణ జిల్లాకు ప్రధాన కేంద్రమైన అనకాపల్లికి మంజూరైన కేంద్రీయ విద్యాలయం తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర హెచ్ఆర్‌డీ మంత్రి ప్రకాశ్‌జవదేకర్‌ను శుక్రవారం అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయన కార్యాలయానికి శుక్రవారం కలిశారు. తాత్కాలికంగా తరగతులు ప్రారంభానికి గదులు కూడా పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయని వివరించినట్లు ఎంపీ సోదరుడు ముత్తంశెట్టి మహేష్ ఇక్కడ తెలిపారు. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున విద్యాలయంలో తరగతులు ప్రారంభానికి చొరవ చూపాలని కోరారన్నారు.



మాస్టర్ ప్లాన్ రహదారులపై వుడా దృష్టి

◆ 7 రహదారులకు అడ్డంకులపై చర్చ ◆ ముందుకు సాగాలని నిర్ణయం

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ మాస్టర్ ప్లాన్ రహదారులపై దృష్టి సారించింది. పనులు చేపట్టి చాలా కాలం అయినప్పటికీ చిన్న చిన్న అవాంతరాల వల్ల అవి పూర్తికాకుండా వుండిపోయిన విషయం గుర్తించి, వాటికి పరిష్కారం కోసం జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్‌తో వుడా వీసీ బసంత్ కుమార్ శుక్రవారం భేటీ నిర్వహించారు. ఇరు సంస్థల ఇంజనీరింగ్, ప్లానింగ్ అధికారులు కూర్చొని ఒక్కో రహదారి ఎందుకు? ఎక్కడ ఆగిపోయింది? కారణాలు ఏమిటి? పరిష్కారం ఎలా? అనే దానిపై చర్చించారు. కొన్ని కోర్టు కేసులతోను, మరి కొన్ని నష్టపరిహారం సరిపోలేదని, ఇంకొన్ని టీడీఆర్‌లు ఇవ్వలేదని ఇలా పలు కారణాలతో ఆగినట్టు గుర్తించారు. భూమి కోల్పోయిన వారికి భూములు ఇచ్చేందుకు తాము బాధ్యత వహిస్తామని వుడా వీసీ స్పష్టంచేశారు. టీడీఆర్‌ల విషయం ప్రభుత్వం చూసుకుంటుందని పురపాలక శాఖ మంత్రి నుంచి స్పష్టమైన హామీ లభించింది. ఇక మిగిలిన కేసులను కూడా వ్యక్తిగతంగా వారిని పిలిచి మాట్లాడాలని నిర్ణయించారు. మొత్తం ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులపై ఈ సమావేశంలో చర్చిం చారు. కొమ్మాదిలో నవోదయ స్కూల్ మార్గం 2.25 కి.మీ., నగరపాలెం 900 మీటర్లు, కొమ్మాదిలో రీచ్- 2లో 500 మీటర్లు, బక్కన్నపాలెం 1.7 కి.మీ., ఎండాడ-రుషికొండ 2.8 కి.మీ., సింహాచలం గోశాల నుంచి గోపాలపట్నం వరకు 3 కి.మీ., అనకాపల్లిలో నూకాలమ్మ గుడి నుంచి 60 అడుగుల రహదారి నిర్మాణంపై చర్చించారు. చీఫ్ సిటీ ప్లానర్ విద్యుల్లత, వుడా సీఈ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రపతి కోవింద్‌కు జ్ఞాపికను అందిస్తున్న వీసీ

రాష్ట్రపతికి ఏయూ జ్ఞాపిక బహూకరణ

ఎంవీపీకాలనీ: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను గురువారం సాయంత్రం ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కలిశారు. రాష్ట్రపతిగా నియమితులు కావడంపై అభినందనలు తెలియజేశారు. ఏయూ విశిష్టతను వివరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. వర్సిటీ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ గతంలో తాను ఒక పర్యాయం ఏయూను సందర్శించానని తెలిపారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో ఆచార్య బి.మోహనవెంకట్రామ్, కుమార్‌రాజా, ఉజ్వల్‌కుమార్‌ఘటక్ తదితరులు ఉన్నారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.20
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.50
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.30
క్యాబేజీ	రూ.20
బీన్స్	రూ.60
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.30
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.30
అల్లం	రూ.50
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.20
కాకరకాయలు	రూ.30
ఆనపకాయ(చిన్నది)	రూ.08
ఆనపకాయ(పెద్దది)	రూ.12
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పుదినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.75
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనెధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ప్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	320
విజయనగరం	324
శ్రీకాకుళం	324

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	75.00	75.00
విత్ స్కిన్	105.00	120.00
స్కిన్ లెస్	124.00	130.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	4100	4430
రెండో రకం	3010	3630
మూడో రకం	2940	3140

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 5, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.

మిథునరాశి:(మే21-జూన్21): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విసరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్టు23): వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం.సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.


మకరరాశి: (డిసెంబర్22-జనవరి21): పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్, మూచ్యువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

దారి కనుక్కోండి



సూక్తి

కోపం తెచ్చుకునే హక్కు ఎవరికైనా ఉండొచ్చు..
కానీ ఆ కోపంలో క్రూరంగా ప్రవర్తించే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

టంగ్ ట్విస్టర్స్



1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Sounding by sound is a sound method of sounding sounds.
3. Real rock wall, real rock wall, real rock wall



'పోలార్ పార్క్'లోకి అడుగుపెట్టగానే.. ముఖ్య అతిథిపై పూల వర్షం కురిపించినట్లు...వెన్నెల్లాంటి మంచు జల్లులా కురుస్తుంది. చాలా రోజుల తర్వాత కలిసినా ఆత్మీయుల్లా క్రూర మృగాలు ఆలింగనం చేసుకుంటాయి. ఎంతో ప్రేమతో ముద్దిస్తాయి. స్నేహితుల్లా కలిసిపోతాయి. వాటిని వదిలిపోతుంటే. దీనంగా చూస్తుంటాయి.. ఈ పార్కుకు మీకు వెళ్లాలనుందా? అయితే చలో నార్వే!



ప్రేమతో ముద్దిచ్చే తోడేళ్లు

పోలార్ పార్కు దీన్నే 'పోలార్ జూ'గా కూడా పిలుస్తారు. ఇది 'ట్రోమ్స్' అనే చిన్న దేశంలో ఉంది. నార్వేలోని ప్రసిద్ధ పార్కుగా పేరు పొందింది. ఈ పార్కును 1994, జూన్ 18న ప్రారంభించారు. ఎలుగు బంట్లు, నక్కలు, తోడేళ్లు, పెద్ద అడవి పిల్లి(శివంగి), ధ్రువపు జింకలు, మూస్(లేడి వంటి జంతువు), ఎరుపు జింక, బ్రౌన్ ఎలుగుబంటి జంతువులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగాడుతుంటాయి. 112 ఎకరాల్లో ఉన్న ఈ పార్కుల్లో 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కుకు 12 కిలోమీటర్ల దూరంలోనే 'రోహ్‌కున్ బొర్రి నేషనల్ పార్కు' ఉంది.

సెల్ఫీలకు పోజులు!

ఇక్కడి పార్కులోని తోడేళ్లు మనుషుల్ని చూసి భయపడవు. మనుషుల సమక్షంలో అవి ఆనందంగా గడుపుతాయి. సందర్శకులు తోడేళ్లతో ఎంచక్కా ఆడుకోవచ్చు. మనుషులతో అవి ఇట్టే కలిసిపోతాయి. ప్రేమతో ముద్దులు కూడా ఇస్తాయి. చుట్టూ చేరి తెగ సందడి చేస్తాయి. సెల్ఫీ తీస్తుంటే.. అందమైన పోజులిస్తాయి. అమ్మ ఒడిలో పడుకున్నట్లు.. వాటిపై హాయిగా పడుకున్నా అవి ఏమనవు. మిగతా జంతువులు కూడా సందర్శకులను ఏమీ చేయవు. సందర్శకులు వీటిని మచ్చిక చేసుకోవడానికి తోడేళ్ల ఎన్‌క్లోజర్‌లో గంటపాటు గడపవచ్చు. ఒక రోజు మొత్తం కూడా వాటిలో ఉండొచ్చు. మీతో పాటు తోడేళ్ల శిక్షకులు కూడా ఉంటారు. వాటితో ఎలా మెలగాలో, ఎలా మచ్చిక చేసుకోవాలో వారు సూచిస్తారు. అత్యుత్సాహంతో వాటిని బెదరకొట్టకూడదు. అవి దగ్గరికి వచ్చినప్పుడు నిండైన ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎందుకంటే అవి భయాన్ని పసిగడతాయి. ఒక్కసారి మచ్చిక అయితే పెంపుడు జంతువుల్లా ఉంటాయి.



మొబైల్ రైడ్..

ప్రకృతి ప్రేమికులకు ఈ పార్కు వీనుల విందే. పార్కులో ఎటూ చూసినా అందాలే. మంచు దుప్పటి కప్పుకున్న పర్వతాలను,రకరకాల జంతువులను చూస్తూ... ఎరుపెక్కిన సూరీడు అందాల మాటున స్నో మొబైల్ వ్యానులో షికారు భలేగా ఉంటుంది.

ఎన్నో అరుదైన జంతువుల మధ్యలో హాయిగా గడపడం..ఓ అనిర్వచనీయమైన అనుభూతి. ఈ పార్కుకు వెళ్లాలంటే ఒకే ఒక్క కండీషన్. అదేంటంటే 15 సంవత్సరాల వయసు దాటిని వారినే ఇందులోకి అనుమతిస్తారు.

రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్



తండ్రి : ఏరా! ఎన్నిసార్లు ఫోన్ మోగుతున్నా ఎత్తడం లేదు ఎందుకని?
బన్ను : నాన్నా! నన్ను డాక్టర్ బరువులు ఎత్తొద్దని చెప్పారు. అందుకనే!
తండ్రి : !!!!!!!!

=======

టీచర్ : టీవీ వల్ల హింసలు పెరుగుతున్నాయిట నిజమేనా?
చిన్ను : అవును టీచర్ నిజమే! నేను ఎప్పుడు టీవీ ఆన్ చేసినా మా నాన్న నన్ను కొట్టినంత పని చేస్తున్నారు.

చెప్పగలరా?

కూడులో ఉన్నా కానీ గూడులో లేను
తుదిలో ఉన్నా కానీ ఆదిలో లేను
రుచిలో ఉన్నా కానీ శుచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి


1. హాఆరం ▸ ....
2. ధుమరం ▸ ....
3. చాతిమం ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. DSIE ▸ ....
2. FODO ▸ ....
3. RPEO ▸ ....

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



సిగరెట్ లైటర్‌ని అగ్గిపుల్ల కంటే ముందే కనిపెట్టారు.

ఔనా!


స్టార్ ఫిష్‌కు మెదడు ఉండదు.

జవాబులు

చెప్పగలరా? :
కూతురు
జంతర్‌మంతర్ :
1. ఆహారం
2. మధురం
3. చామంతి
జంబ్లింగ్ వర్డ్స్ :
1.SIDE
2.FOOD
3.ROPE

చుక్కలు కలపండి






తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్3 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 21 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 5, 19 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : డిసెంబర్ 4వ తేదీ ఉన్నాయి

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు, ఇతర సమాచారం కోసం...	139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు	182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్...	08924-226965

ఆర్టీసీ సమాచారం

APSRTC



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 14859

ప్రజావాణి

- ప్రాధాన్యం గుర్తించి త్వరితగతిన పరిష్కారం
- అసెంబ్లీ ఎస్టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు వెల్లడి
- మన్యంలోని సమస్యలపై ప్రజా సంఘాలు, పార్టీలు వినతుల వెల్లువ

అర్జీలపై ప్రత్యేక దృష్టి



అర్జీదారుల సమస్యలు వింటున్న అసెంబీ ఎస్టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

పాడేరు : ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎస్టీ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. కమిటీ విశాఖ మన్యం పర్యటనలో భాగంగా శుక్రవారం ఏజెన్సీలోని సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. వీటిని స్వయంగా పరిశీలించి, ఆయా వినతుల్లో ప్రాధాన్యతను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, రత్నాబాయి, పి.పుష్పాశ్రీవాణి, అప్పలనాయుడు, రాజేశ్వరి, జాయింట్ కలెక్టర్ సృజన, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, కిడారి సర్వేశ్వరరావులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలే!

ఏజెన్సీలో పని చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ వర్తింపజేయాలని, గిరిజన ఉద్యోగులకు లాంగ్ టెర్మ్ హౌసింగ్ రుణాలు ఇప్పించాలని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పదోన్నతులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుడుముల కాంతారావు వినతిపత్రం సమర్పించారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు గిరిజనుల అభివృద్ధి వ్యయం చేయాలని, గిరిజన నిరుద్యోగులకు ఎటువంటి గ్యారంటీ లేకుండా రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్య సేవలు అందించాలని, ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేయాలని బీజేపీ నేతలు కురుసా బొజ్జయ్య, ఉమామహేశ్వరావు, రాజారావు, రామకృష్ణ కోరారు. అలాగే తమ ప్రాంతంలో కోల్ట్ స్టోరేజీ, పసుపు, కాఫీ పొడులు చేసే యంత్రాలను అందించాలని ఆదివాసీ సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొంజుబాబు కోరగా, ఏజెన్సీలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు, హక్కు పత్రాలు ఇవ్వాలని ఆదివాసీ మహాసభ సంఘం అధ్యక్షుడు మర్రి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఏజెన్సీలో జీవిస్తున్న కొండకుమ్మర్లను ఎస్టీ జాబితాలో చేర్పించాలని గిరిజన కొండమ్మర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఏజెన్సీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ వైద్యారోగ్య సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, గిరిజన ప్రాంత వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శెట్టి నాగరాజు కోరగా, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల (సీఆర్‌టీలు) సర్వీసును క్రమబద్ధీకరించాలని, పదో పీఆర్సీ అనుసరించి వేతనాలు ఇవ్వాలని గిరిజన సీఆర్‌టీల సంఘం నేతలు టి.నూకరాజు, భానుమూర్తి, వెంగళరావులు పేర్కొన్నారు.

ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి : టీడీపీ నేతల విజ్ఞప్తి

అనారోగ్య సమస్యలతో మృతి చెందినవారి గిరిజన కుటుంబాలకు చంద్రన్న బీమా ద్వారా నష్టపరిహారం కల్పించాలని, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఎన్‌టీఆర్ గృహ కల్పలో అధికంగా ఇళ్లు మంజూరు చేయాలని, గిరి పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి పాంగి రాజారావు, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు కోరారు.

'గిరిజనుల అనారోగ్య మరణాలపై విచారణ చేయండి'

ఏజెన్సీలో గిరిజనుల అనారోగ్య మరణాలపై సమగ్ర విచారణ జరపాలని, పీహెచ్‌సీల్లో రోగులకు భోజనాలు పెట్టాలని, జీవో నెంబర్ 3ను పకడ్బందీగా అమలు చేయాలని, అటవీ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స వినతి పత్రం సమర్పించారు. ఏజెన్సీలో పని చేస్తున్న ఎన్‌ఆర్‌హెచ్‌ఎం రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని, పదో పీఆర్సీ ప్రకారం వారికి వేతనాలు ఇవ్వాలని గిరిజన ప్రాంత రెండో ఏఎన్‌ఎంల సంఘం నేతలు కోరారు. ఏజెన్సీలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలో పని చేస్తున్న స్కీమ్‌వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని సీఐటీయూ డివిజన కార్యదర్శి ఆర్.శంకరరావు కోరారు.

అంకితభావంతో పని చేయండి

అధికారుల సమీక్షలో అసెంబ్లీ ఎస్టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

పాడేరు: ఏజెన్సీలో గిరిజనుల అభివృద్ధికి అధికారులు అంకితభావంతో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ గిరిజన తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ ముడియం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కాఫీ హౌస్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని, ఆయా పథకాలు, కార్యక్రమాలు వారి చెంతకు చేర్చే బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆరు నెలల్లో మరోసారి ఇక్కడికి వస్తామని, ఈ మధ్య కాలంలో జరిగిన ప్రగతిని సమీక్షిస్తామన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయాలు వ్యయం చేస్తున్నప్పటికీ, వాటి ఫలాలు క్షేత్ర స్థాయిలో గిరిజనులకు ఎందుకు చేరడం లేదో అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏజెన్సీలో వైద్య సేవలు సక్రమంగా అందించి గిరిజనుల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసెంబీ ఎస్‌టీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు

ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కిడారి సర్వేశ్వరరావు మాట్లాడుతూ, ఏజెన్సీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కమిటీ కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

శాఖల ప్రగతిని వివరించిన అధికారులు....

ఏజెన్సీలో వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని ఆయా అధికారులు ఈ సందర్భంగా కమిటీకి వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖ సేవల గురించి డీఎంహెచ్‌వో రమేశ్, పాడేరు ఏడీఎంహెచ్‌వో గురునాథరావు విశదీకరించారు. గిరిజన సంక్షేమ విద్యా శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, విద్యార్థుల ఆరోగ్యం, ఇతర సదుపాయాల గురించి గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయకుమార్ తెలియపరిచారు. చిన్ననీటి వనరుల అభివృద్ధి గురించి ఎస్ఎంఐ ఈఈ రమణ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ పనులను ఈఈ శ్రీనివాసరావు, రెవెన్యూ పరమైన సేవల గురించి ఆర్డీవో వేణుగోపాల్ వివరించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, రత్నాబాయి, పి.పుష్పాశ్రీవాణి, అప్పలనాయుడు, రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ, జూయింట్ కలెక్టర్ సృజన, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





కేడీపేట బజారులో బీరకాయలను విక్రయాలకు తెచ్చిన రైతులు

బోరుమంటున్న బీర రైతు

- కేడీపేటలో కిలో రూ.8 చొప్పున విక్రయాలు
- పంట బాగా పండడంతో బజారుకు భారీగా దిగుమతి
- కొనేవారు లేకపోవడంతో ధర తగ్గించి విక్రయాలు

కృష్ణాదేవిపేట : బీర పండించే రైతులు ఆదిలోనే డీలా పడే పరిస్థితి ఎదురైంది. కృష్ణాదేవిపేట బజారుకు శుక్రవారం వందల కిలోల బీరకాయాలు విక్రయానికి తీసుకువచ్చారు. నవనవలాడుతుండడంతో హాట్ కేకుల్లా అమ్ముడుపోతాయని రైతులు ఆశించారు. తీరా కొనేవారు లేకపోవడంతో రేటు ఒక్కసారిగి పడిపోయింది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 పలికిన వీటి ధర శుక్రవారం కిలో రూ.8కి దిగిపోవడం విశేషం. గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, నాగాపురం తదితర గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 320 ఎకరాల్లో బీర విత్తనాలను నాటారు. అప్పటి వరకు ఉన్న పరిస్థితుల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చునని రైతులు ఆశించారు. పాదులు నేలపై పాకితే అధిక వర్షాలు, పందుల వల్ల దిగుబడి తగ్గుతుందని భావించి పాదుల కోసం పందిళ్లు వేశారు. అయితే దిగుబడి ఆశించిన స్థాయిలో ఉన్నప్పటికీ కోనేవారు లేక పోవడంతో కిలో రూ.8 నుంచి రూ.10కి విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

9న సీఎం పర్యటన?

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం వుంది. ఆ రోజున ఆదివాసీ దినోత్సవాన్ని అరకులోయ భారీ స్థాయిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ మండలంలోని పెదలబుడు గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. గత నెలలోనే ఆ గ్రామానికి సీఎం రావలసి వుంది. వర్షాల కారణంగా హెలికాప్టర్‌లో రాలేకపోయారు. దాంతో పర్యటన రద్దయింది. ఇపుడు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వచ్చే అవకాశం వుందని అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

పాడేరు టౌన్: ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.కాంతారావు కోరారు. గిరిజన భవన్‌లో సంఘం నేత శ్రీను అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన హక్కుల రక్షణలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర నేత అప్పన్నదొర్య మాట్లాడుతూ, గిరిజన యూనివర్సిటీపై ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. మన్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సమావేశంలో ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మన్యంలో మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

డిసెంబర్ నాటికి ఏజెన్సీలో ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరా: ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణమూర్తి

పాడేరు: ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. డిసెంబరు నాటికి ఏజెన్సీలో అన్ని గిరి పల్లెలకు విద్యుత్ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. గతంలో పోల్చితే ఏజెన్సీలో విద్యుత్ సమస్యలు తగ్గాయని, వేసవిలో సైతం నిరంత విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా 3,575 పల్లెలకు ప్రస్తుతం 145 అత్యంత మారుమూల ప్రాంతాలకు మాత్రమే విద్యుత్ సరఫరాను అందించలేకపోతున్నామని చెప్పారు. ఆయా పల్లెల్లో సోలార్ ద్వారా విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే 31 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు.

ఎన్‌టీఆర్ జలసిరికి రూ.6 వేలు సోలార్ యూనిట్

గిరిజన రైతులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఎన్‌టీఆర్ జలసిరిలో భాగంగా మోటార్లు వేసుకున్న గిరిజన రైతులకు రూ.3.2 లక్షల విలువైన సోలార్ యూనిట్‌ను కేవలం రూ.6 వేలుకే అందిస్తామని ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ చెప్పారు. తాము అందించే సోలార్ యూనిట్ 5 హెచ్‌పీ మోటార్ పని చేసే విద్యుత్‌ను అందిస్తుందన్నారు. సాగునీటి సదుపాయంలో పంటలు పండించే గిరి రైతులకు ఇది చక్కని అవకాశమన్నారు. అలాగే ఏజెన్సీలో 50 యూనిట్‌లు వరకు 75 వేల గిరిజన కుటుంబాలకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. అలాగే గిరిజన పల్లెల్లో ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా తక్షణమే ఆయా పరిధిలో ఉన్న తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ వీరభద్రరావు, ఏడీఈ భాస్కరరావు, ఏఈ ప్రభాకరరావు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యువజనోత్సవాలు

ప్రిన్సిపాల్ అప్పారావు

పాడేరు రూరల్: డివిజన్ స్థాయి యువజనోత్సవాలను ఈ నెల 8వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ వి.అప్పారావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో పాడేరులో జరిగే డివిజన్ స్థాయి యువజనోత్సవాల్లో జానపద నృత్యాలు, గీతాలు, సంప్రదాయ నృత్యాలు, వక్తృత్వ పోటీలు, మృదంగం, తబలా, హార్మోనియం, గిటార్, వన్‌యాక్ట్ ప్లేపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల 15 నుంచి 29 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు ఈ నెల 8వ తేదీ ఉదయం 9 గంటల లోపు డిగ్రీ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో సినిమా పాటలు పాడేందుకు అవకాశం ఉండదన్నారు. పూర్తి సమాచారం కోసం కళాశాల ఆంగ్ల అధ్యాపకులు జి.గౌరీశంకరరావును స్వయంగా లేదా సెల్ ఫోన్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు. సమాచారం కోసం 9441415881 ఫోన్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

రెండో విడత ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి: రెండో విడత ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చింతపల్లి ప్రిన్సిపాల్ వి.పరమేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ, శనివారం నుంచి ఐటీఐలో దరఖాస్తులు అందుబాటులో వుంటాయన్నారు. అర్హులైన అభ్యర్థులు రూ.10 చెల్లించి దరఖాస్తును పొందవచ్చునని, ఈ నెల 15న కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆదివాసీలకు సాగు హక్కు పత్రాలు ఇవ్వాలి

చింతపల్లి: గిరిజనుల సాగులో ఉన్న భూములకు అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు హక్కుపత్రాలు ఇవ్వాలని ఎస్టీ కమిటీని కోరినట్టు చైతన్య సంస్థ ప్రతినిధి యేసుబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడారు. తూర్పుగోదావరి గిరిజన ప్రాంతాల్లో ఎనిమిది విడతల్లో అటవీ హక్కుల చట్టం కింద సాగు హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని, విశాఖ ఏజెన్సీలో కేవలం రెండు విడతల్లో మాత్రమే పంపిణీ చేశారని చెప్పారు. ప్రస్తుతం అటవీ హక్కుల చట్టం కింద సర్వేగాని, పట్టాల పంపిణీ కార్యక్రమం గాని నిర్వహించడం లేదని కమిటీకి వివరించామన్నారు. దీనికి కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

రిజర్వాయర్ గట్టు గండి పూడ్చే పనులకు జేఈ హామీ

చింతపల్లి: తాజంగి రిజర్వాయర్ గట్టు గండి పూడ్చేందుకు పనులు ప్రారంభించనున్నట్టు ఇరిగేషన్ జేఈ నాగమణి హామీ ఇచ్చారని సర్పంచ్ రామస్వామి తెలిపారు. శుక్రవారం సర్పంచ్, ఇరిగేషన్ జేఈ కలిసి తాజంగి రిజర్వాయర్‌ను పరిశీలించారు. కుడి కాలువ వైపు ఏర్పడిన గండిని పరిశీలించి చిన్నపాటి రంధ్రం రెండు రోజుల్లో మట్టికూరుకుపోయి పెద్ద గండిగా తయారైనట్టు గుర్తించారన్నారు. గండి పూడ్చి కుడి, ఎడమ కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరగా, జేఈ సానుకూలంగా స్పందించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో శనివారం జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు సబ్ డివిజన్ జేఈ చంద్రశేఖరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ, డౌనూరు-లంబసింగి మధ్యనున్న 33కేవీ విద్యుత్ లైన్ దిగువనున్న జంగిల్ తొలగించే పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్ర నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని జేఈ కోరారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండల కేంద్రంలో శనివారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ కె.గిరికుమార్ తెలిపారు. పాడేరు నుంచి జి.మాడుగుల వరకు 33 కేవీ లైన్‌పై వాలివున్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సౌకర్యం నిలుపుదల చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు మండలంలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల దీక్షలు

పాడేరు టౌన్: సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు దీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ, వీఆర్‌ఏలకు కనీస వేతనాలు అమలుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చేపడుతున్న పోరాటాల్లో భాగంగా ఇపుడు ఈ దీక్షలు నిర్వహించారన్నారు. వీటికి ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తారని హెచ్చరించారు. రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన సేవలను అందిస్తూ, చాలీచాలని జీతాలతో వీఆర్‌ఏలు దయనీయంగా బతుకులు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీరికి కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు సాంబశివరావు, అప్పలరాజు, సత్యనారాయణ, సూర్యప్రసాద్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

పాడేరులో టీడీపీ నేతల నిరసన

జగన్ దిష్టిబొమ్మ దహనం

పాడేరు రూరల్: వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలే బుద్ధిచెపుతారని మాజీ మంత్రి ఎం.మణికుమారి, టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ తీరుకు నిరసనగా శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మణికుమారి, బొర్రా నాగరాజులు మాట్లాడుతూ.. జగన్మోహనరెడ్డికి రాజకీయ పిచ్చి పట్టడంతో మతి భ్రమించి మాట్లాడుతున్నాడన్నారు. నంద్యాలలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్ వైసీపీ ఘనత చెప్పుకోవాలే తప్ప పిచ్చెక్కిన వాడిలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నడిరోడ్డు మీద కాల్చి చంపండి అనడం సరికాదన్నారు. అటువంటి మతి స్థిమితం లేని నాయకుడు రాజకీయాల్లో ఉంటే ప్రజలకు ప్రాణాపాయం తప్పదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఎంపీపీ చైర్‌పర్సన్ బొర్రా విజయరాణి, ఏఎంసీ డైరెక్టర్ రొబ్బి రాము, పార్టీ మండల అధ్యక్షుడు ఉల్లి రామారావు, ప్రధాన కార్యదర్శి పూసర్ల గోపి, సర్పంచ్‌ల ఫోరం డివిజన్ అధ్యక్షుడు సీదరి రాంబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి బాకూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జగన్ దిష్టిబొమ్మను తగలబెడుతున్న టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

బూత్ కమిటీలకు సమర్థులను ఎన్నుకోండి

టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు

పాడేరు రూరల్: బూత్ కమిటీలకు సమర్థవంతులైన యువకులతో ఎన్నుకోవాలని టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు కోరారు. శుక్రవారం పార్టీ అధ్యక్షుడు ఉల్లి రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. దీపం పథకం అర్హులందరికి అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు రాంబాబు, రాజారావు, రాంబాబు, డిప్పల అరుణకుమారి, మర్రి వెంకటరావు, నాయకులు గోపి, కాంతారావు, రమణబాబు, బాలయ్యదొర, ఆనందరావు, లోవరాజు పాల్గొన్నారు.

తెరపల్లి క్వారీలో పేలుళ్లు నిలిపేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

చింతపల్లి: తెరపల్లి తెల్లరాయి క్వారీలో పేలుళ్లు నిలిపి వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. తెల్లరాయి తవ్వకాల వల్ల మంచినీరు కలుషితమైపోతోందని, శబ్దకాలుష్యం ఏర్పడుతోందని తెలిపారు. క్వారీపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. తవ్వకాలకు పెసా కమిటీ, పంచాయతీ తీర్మానాలు ఇచ్చారా..? లేదా..? ప్రజలు వ్యతిరేకిస్తున్న క్వారీని తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయక కార్యదర్శి రమేష్, పార్టీ నాయకుడు బోనంగి చిన్నయ్యపడాల్, ధనుంజై పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం నేత లోకనాథం

ఆంధ్రజ్యోతి
4
మాడుగుల
విశాఖపట్నం। శనివారం 5 ఆగస్టు 2017
మాడుగుల • దేవరాపల్లి • కె.కోటపాడు • చీడికాడ

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరిమేక్స్	దర్శకుడు
శ్రీసాయిలక్ష్మి	గౌతమ్‌నంద
సాయిలక్ష్మి(ఏసీ)	ఫిదా
పూర్ణ	నక్షత్రం

వాడవాడలా శ్రావణ శోభ

కిటకిటలాడిన దేవాలయాలు
ప్రత్యేక భజనలు..
కుంకుమ పూజలు
ఆలయాల కమిటీలు ఏర్పాట్లు
భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

దేవరాపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తి శ్రద్ధలతో చేశారు. శుక్రవారం ఉదయాన్నే ఈ వ్రతాలను నిర్వహించారు. స్తోమత కొద్దీ బంగారు కాసులు, నూతన వస్త్రాలు, గాజులు, వివిధ రకాల పండ్లు, పూలు అమ్మవారికి సమర్పించి పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పలు దేవాలయా లను మహిళలు వెళ్లి దర్శించుకున్నారు.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రమైన మాడుగులలో శ్రావ ణమాసం శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా మహిళలు పసిడి కాసులను, వస్త్రాలను,పలు రకాల పండ్లను కొనుగోలు చేసి, పండివం టలను సిద్ధం చేసి ఇళ్ల వద్ద లక్ష్మిదేవి పూజలను నిర్వ హించారు.

అలాగే గ్రామంలోగల దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పలు దేవాలయాల్లో ప్రత్యేక భజనలు చేశారు.


కె.కోటపాడులో వరలక్ష్మి వ్రతం చేస్తున్న దృశ్యం

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని అన్ని గ్రామాల్లోను వరలక్ష్మి దేవి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పండ్లు, పులిహోర, బంగారం, చీరలు, జాకెట్లు, గాజులు వరలక్ష్మికి సమర్పించారు.


దేవరాపల్లిలో వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల మండలంలో...

మాడుగుల రూరల్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పండ్లు, పూలు, బంగారు ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం పలు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. కేజేపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీసంతోషిమాత ఆలయాలకు మహిళలు తర లివచ్చారు. ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. దీంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండల ప్రజలు శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీదేవి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరిం చారు. ఉదయం నుంచే ఇళ్లల్లో అమ్మవారికి ప్రత్యేక మండ పాలు ఏర్పాటు చేసి పూజలను నిర్వహించారు. అనంతరం వ్రత కథ చదివి పలువురికి వినిపించారు. కె.కో టపాడులో శ్రీకామాక్షిదేవి ఆలయం భక్తుల తాకిడితో కిట కిటలాడింది. సాయంత్రం మహిళలు ఆలయం వద్దకు అధిక సంఖ్యలో చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాత్రికి ఆలయం వద్ద కమిటీ స భ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యుత్ సమస్యలపై కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయండి

ఏపీఈపీడీసీఎల్ ఏఈ రామారావు



రావికమతం: మండలంలో విద్యు త్ సమస్యలపై నేరుగా విని యోగదారులు కాల్‌సెంటర్‌కు ఫిర్యా దు చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఏఈ రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం గాని, లోవోల్టేజ్ సమస్యగాని, ఇతర ఏ సమస్యలైనా నేరుగా కాల్‌సెంటర్ 1912కి తెలియజేయవచ్చున్నారు. 9491049792 ఏఈ రావికమతం, 9491049792 ఏడీఈ వడ్డాది, 9491049790 నర్సీపట్నం డివిజ్ డీఈలకు విని యోగదారులు తెలియపర్చవచ్చునని తెలిపారు. సిబ్బం ది పనితీరులో కూడా ఏ సమస్య లు ఎదురైనప్పటికీ పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సమాచారం అందించవ చ్చునని ఏఈ రామారావు తెలిపారు.

గోవాడ కాంట్రాక్ట్ వర్కర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా 'బండారు'

చోడవరం: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా బండారు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శుక్రవారం జరిగిన కాంట్రాక్ట్ కార్మిక సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సం ఘం ప్రధాన కార్యదర్శిగా ఏడువాక నూకరాజు, ఉపాధ్య క్షుడిగా అట్టా ప్రసాద్, కార్యదర్శిగా దాడి నాగ ముత్యాల నాయుడు, కోశాధికారిగా కరనా నారాయణమూర్తి, కా ర్యనిర్వహణ కార్యదర్శిగా చిటికెల ఎర్రునాయుడులు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కర్రి రాము, కోవిలాపల్లి రమేష్, గొలగాన సూర్య ప్రకాష్, పడాలనారాయణమూ ర్తిలు ఎన్నికయ్యారు.

చోడవరంలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక రేపు

చోడవరం: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఈనెల6న బ్రాహ్మణ వధూవ రుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు గణేష్ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం చైర్మన్ ఈమని నరసింహ మూర్తి, ఉపాధ్యాయుల శ్రీనివాసరావులు తెలిపారు. విశాఖపట్నం అక్కయ్యపాలెం శ్రీలక్ష్మీనారాయణ పరి ణయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాజరై వివా హాలు కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తల్లిపాలే చిన్నారులకు శ్రేయస్కరం

మాడుగుల: పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కర మని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ-2వ కేంద్రం వద్ద పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి జి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లా డుతూ పుట్టిన ప్రతి బిడ్డకు పుట్టిన వెంటనే తల్లిపాలు అందించాలని అన్నారు. పిల్లలకు తల్లిపాలు పూర్తిస్థా యిలో అందించే విధంగా తల్లులు పౌష్టికమైన ఆహారం తీసుకోవాలన్నారు.

గర్భిణి అయిన నాటి నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ద్వారా పాలు, గుడ్డు అందించడంతో పాటు తీసుకోవాల్సిన పౌష్టి కాహార జాగ్రత్తల కోసం వివరిస్తున్నారని చెప్పారు. ఈ అవకాశం వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమా కుమారి, కార్యకర్తలు, తల్లులు, పాల్గొన్నారు.





పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, కె.కోటపాడులో అంగన్‌వాడీల ర్యాలీ

కె.కోటపాడులో..

కె.కోటపాడు: మండల కేంద్రమైన కె.కోటపాడు గ్రా మంలో తల్లిపాల వారోత్సవాల శుక్రవారం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవ గాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.కుమారి, ఎ.లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్ కార్మికులకు వేజ్‌బోర్డు ఏర్పాటే లక్ష్యం

గుర్తింపు కార్మిక సంఘం నేత శరగడం రామునాయుడు

చోడవరం: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు వేజ్ బోర్డు ఏర్పాటే లక్ష్యమని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి శరగడం రాముునా యుడు ప్రకటించారు. గోవాడలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన కార్మిక సంఘం నేతలు శుక్రవారం మండలంలోని వెంకన్నపాలెంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రామునాయుడు మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ ఒడిదుడుకుల్లో ఉన్నప్పటికీ అటు రైతులకు, ఫ్యాక్టరీకి ఇబ్బంది కలగకుండా కార్మికుల ప్రధానమైన డిమాండ్లు సాధించడంలో రెండేళ్ల ప దవీకాలంలో ఎంతో కృషిచేశామన్నారు. తమ పనితీరుపై నమ్మకం ఉంచి మరోసారి గుర్తింపు కార్మిక సంఘం


సమావేశంలో మాట్లాడుతున్న గుర్తింపు కార్మిక సంఘం నేత రామునాయుడు

ఎన్నికల్లో తమకు ఘన విజయం కట్టబెట్టిన కార్మికులకు రుణపడి ఉంటామన్నారు. షుగర్స్ కార్మికుల ప్రధానమైన సమస్య వేతనాలకు సంబంధించి వేజ్‌బోర్డు ఏర్పాటు అని అన్నారు.

నవంబర్‌లో క్రషింగ్ ప్రారంభానికి సిద్ధం

ఫ్యాక్టరీలో క్రషింగ్ ఆలస్యం కావడం వల్ల ఫ్యాక్టరీ ఆర్థికంగా ఇబ్బంది ఎదురవుతున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది నవంబర్ నాటికి క్రషింగ్ ప్రా రంభం అయ్యేలా యాజమాన్యానికి కార్మికులంతా సహక రించనున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీలో పాలనావ్యవహారాల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రెగ్యులర్ అధికారుల నియామ కానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం అధ్యక్షుడు తోట శంకర రావు, నాయకులు తటారి సత్యనారాయణ, పిఎస్ నాయుడు, నానిబాబు, జేవీ శ్రీనివాసరావు, దాడినాగేశ్వర రావు, దేవరపల్లి చంటి, పప్పల రమణమూర్తి, ప్రకాశరావు, ఏడువాక కోటేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొ న్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	వాసుకి
శ్రీసాయిలక్ష్మి	గౌతమ్‌నంద
సాయిలక్ష్మి(ఏసీ)	ఫిదా
పూర్ణ	దండుపాళ్యం-2

నేటి నుంచి గోవాడ వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

చోడవరం: మండలంలోని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో గోవాడ ఫ్యాక్టరీ ఛైర్మన్ గూనూరు మల్లునాయుడు, ఎండీ కెఆర్ విక్టర్‌రాజులు పాల్గొంటారన్నారు. ఈ పవిత్రోత్సవాలు ఈనెల 9వరకూ కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పాఠశాలకు సరస్వతీ విగ్రహం వితరణ



సరస్వతీ విగ్రహం వద్ద యువకులు

బుచ్చెయ్యపేట: ఎల్‌బిపీ.అగ్రహారంలో శుక్రవారం స్థానిక యాదవ్ యూత్ వితరణగా అందించిన సరస్వతీ విగ్రహన్ని ప్రారంభించారు. రూ.15వేలు విలువ చేసే సరస్వతీ విగ్రహాన్ని వితరణగా అందించడంపై యాదవ్ యూత్‌ను గ్రామస్థులు అభినందించారు.

నాలుగు రోడ్ల అభివృద్ధికి రూ.3.5 కోట్లు



అధ్వానంగా వున్న కొండపాలెం రోడ్డు (ఫైల్)

బుచ్చెయ్యపేట: మండలంలో నాలుగు రోడ్ల అభివృద్ధికి రూ.3.5 కోట్ల నాబార్డు నిధులు మంజూరైనట్టు టీడీపీ మండల నాయకులు గేదెల సత్యనారాయణ, ఎంవీవీ.సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, గోకివాడ కోటేశ్వరరావు,ఎం.తాతయ్యలు, సుంకర సూరిబాబులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. కెపీ.అగ్రహారం నుంచి గన్నెంపూడి వయా కొండపాలెం మూడు కిలోమీటర్ల రోడ్డుకి రూ.1.68 కోట్లు, పైడంపేట నుంచి ఐతంపూడి కిలో మీటర్ల రోడ్డుకి రూ.56 లక్షలు, ఆర్‌టీ రోడ్డు నుంచి కరక కిలోమీటరు రోడ్డుకి రూ.58 లక్షలు, పెదమదీనా నుంచి చినమదీనా కిలోమీటర్లు రోడ్డు అభివృద్ధికి రూ.68 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

'చంద్రబాబుకు జగన్ క్షమాపణ చెప్పాలి'

బుచ్చెయ్యపేట: నంద్యాల ఉప ఎన్నిక ప్రచార సభలో చంద్రబాబునాయుడును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదని వాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడు జగన్ చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలని టీడీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గోకివాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, డి.కిషోర్, గేదెల సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు, నాగులాపల్లి సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, సుంకర సూరిబాబు, ఎంవివి.సత్యనారాయణ, వజ్రపు శ్రీను, కోరుకొండ రవి విలేకరులతో మాట్లాడారు. ఉప ఎన్నికల్లో నంద్యాల ఓటర్లు వైసీపీకి ఓటు వేస్తే రౌడీ పాలనకి ఓటు వేసినట్టేనని గ్రహించాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడుపై రౌడీ హెచ్చరికలు మానుకోకపోతే జగన్ తగిన మూల్యాన్ని చెల్లించుకోకతప్పదని వారు హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



అలంకరణలో దుర్గాదేవి



లక్ష్మమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు



కొండపాలెంలో సామూహిక వరలక్ష్మి వ్రతాల దృశ్యం

చోడవరం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. లక్ష్మమ్మగుడి, కన్యకాపరమేశ్వరి, దుర్గాదేవి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మూడు దేవాలయాలతో పాటు వెంకటేశ్వరస్వామి, స్వయంభూ ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రావికమతంలో...

రావికమతం: మండలంలోని చినపాచిల వైష్ణవీదేవి ఆలయంలోను, కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చినపాచిల వైష్ణవీదేవి ఆలయంలో ఆలయ అర్చకులు ఆరవిల్లి వాసుదేవాచార్యులు, సత్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి వైభవంగా వ్రతాలను నిర్వహించారు. ఈ సామూహిక వ్రతాల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో ఆలయ అర్చకులు వేపా రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు. అమ్మవారికి ఎర్రజాకెట్లు, ఎర్ర గాజులు, పండ్లు, పూలతో పాటు బంగారం కాసు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చినపాచిల వైష్ణవీదేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు

సమసరత ఫౌండేషన్ ఆధ్వర్యంలో...


రోలుగుంట: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొండపాలెంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ మండల సమన్వయకర్త గుములూరు సత్తిబాబు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో మహిళలను అధికంగా భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. టీటీడీ సహకారంతో అంట్లపాలెంలో రూ.5లక్షలతో గణపతి ఆలయాన్ని నిర్మించామన్నారు. రెండో విడతలో గిరిజన గ్రామాలైన అర్ల చర్జీపురం, ఎమ్.పెదపేట గ్రామాల్లో టీటీడీ సహకారంతో ఆయా గ్రామాల్లో రూ.5 లక్షలు చొప్పున నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దేవాలయాలు లేని మిగతా గ్రామాల్లో కూడా గ్రామ కమిటీ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపిస్తే మా సంస్థ నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను భక్తి శ్రద్ధలతో చేశారు. ఇంట్లో లక్ష్మిదేవి కలశాన్ని ప్రతిష్ఠించి గాజులు, చీరెలు, పిండి వంటకాలు, పండ్లు సమర్పించారు. శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో గల శ్రీ మంగళదేవి అమ్మవారికి భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు.

మొరాయిస్తున్న సర్వర్..
సరుకుల కోసం పడిగాపులు

చోడవరం: రేషన్ డిపోల్లో సర్వర్ మొరాయిస్తుండడంతో రేషన్ సరకుల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈనెల ఒకటి, రెండో తేదీల్లో సర్వర్ మొరాయింపులతో సరకుల పంపిణీ సక్రమంగా సాగలేదు. రేషన్‌డిపోల ఈపోస్ మెషీన్లలో సాఫ్ట్‌వేర్ వెర్షన్ అప్‌డేట్ కాకపోవడంతో డిపోల్లో సరకుల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. దీంతో ఒకటి రెండు తేదీల్లో జనాలకు సరకులు అందక ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయానికి సర్వర్ సమస్య పరిష్కారం కావడంతో డిపోల్లో సరకుల పంపిణీ యథావిధిగా సాగింది. ఒక్క రోజు గడవకముందే మళ్లీ శుక్రవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. సర్వర్ మొరాయించడంతో పాటు, ఈపోస్ యంత్రాల్లో నెట్ వర్క్ కనెక్షన్ టైం అవుట్ అంటూ ఒకసారి, పీడీఎస్ డిస్ట్రిబ్యూషన్ స్టాప్ అంటూ సమాచారం రావడంతో డిపోల్లో సరకుల పంపిణీ నిలిచిపోయింది. ప్రతి నెలా ఒకటి నుంచి నాలుగు తేదీలకు చాలా డిపోల్లో 50శాతం సరకుల పంపిణీ పూర్తికావలసి ఉండగా, కేవలం గురువారం ఒక్క రోజే సర్వర్ పనిచేయడంతో ఇప్పటివరకూ కే20శాతం మాత్రమే డిపోలలో సరకులు పంపిణీ అయినట్టు తెలుస్తోంది. కొన్ని మండలాల్లో కనీసం 10 శాతం కూడా సరకుల పంపిణీ జరగలేనట్టుగా అధికార వర్గాల సమాచారం. శుక్రవారం ఆగిన సర్వర్ తిరిగి పనిచేసేవరకూ సరకుల పంపిణీలో సమస్య తప్పదని అధి కారులు తెలిపారు. డబ్బులు తీసుకుని సరకులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ,యంత్రాల్లో మాత్రం మార్పులు లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్టు అధికారులు తెలిపారు.



ఈపోస్ మెషీన్లలో కనిపిస్తున్న మెసేజ్



డిపో ముందు సరకుల కోసం వేచి ఉన్న జనం

కౌలు రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవాలి

రోలుగుంట: మండలంలోని కౌలు రైతులు రుణం కావలసిన వారు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పి.విజేత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రైతులకు రౌతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేశామన్నారు. ఈ రుణ అర్హత కార్డులు లేకపోతే లేదా ఉన్న రుణ అర్హత కార్డులు రెన్యువల్ కాకపోతే ఇప్పటికే కొంతమందికి సాగుదారుని పత్రాలను కూడా ఇచ్చామన్నారు. వీటితో కూడా రుణాలను పొందవచ్చన్నారు. రోలుగుంట మండలానికి సంబంధించి ఫసల్ బీమాకు సంబంధించి 33 మంది రైతుల నుంచి 28.5 ఎకరాలకు బీమా ప్రీమియం చెల్లించామన్నారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం ఈ రోజు వరకు 500 ఎకరాలకు పైగా వరినాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రైతులు దమ్ము చేసుకునే సమయంలో దమ్ములో 20 కిలోల చొప్పున జింకు, యూరియా, డీఏపీలను వేసుకోవాలన్నారు. వరి నాట్లను వేసేటప్పుడు కొనలు తుంచి నాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కె.చిరంజీవి, ఎంపీఈవోలు కె.వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

ఎండిపోతున్న కొబ్బరి మొక్కలు

సంరక్షణ లేక ఈ పరిస్థితి... పట్టించుకోని ఉపాధి అధికారులు.. పంచాయతీల ఆదాయానికి బ్రేక్..

నాతవరం:
మండలంలో ఉపాధి హామీ అధికారులు చెరువు గట్ల మీద వేసిన కొబ్బరి మొక్కలు ఎండిపోతున్నాయి. వాటికి సరైన సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. మొక్కలు వేసిన తర్వాత కనీసం వాటి గురించి ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. 2016లో ప్రతి పంచాయతీలో చెరువు గట్టు మీద వంద మొక్కల చొప్పున 2,700 కొబ్బరి మొక్కలు వేశారు. ఈ మొక్కలకు నెలలో నాలుగుసార్లు నీరు అందించడానికి ఉపాధి కూలీకి రూ. మూడు వేలు కేటాయించారు. అయితే చెరువు గట్లపై 2016లో ప్రజాప్రతినిధులచే ఆర్భాటంగా వేసిన కొబ్బరి మొక్కల చుట్టూ కంచెతో పాటు మొక్కలు ఎండిపోకుండా నీరు పెట్టడం వంటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో 27 పంచాయతీల్లో ఇప్పటికే 50 శాతం మొక్కలు చనిపోయాయి.ప్రతి పంచాయతీకి కొబ్బరిచెట్ల ఆదాయం వస్తుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం వేలాది రూపాయలు ఖర్చుపెట్టి చెరువు గట్ల మీద కొబ్బరి మొక్కలు వస్తే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి ఎండిపోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిగిలిన 50శాతం కొబ్బరి మొక్కలనైనా బతికేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


ములగపూడిలో గంటావాని చెరువు గట్టుపై సంరక్షణ లేక పాడవుతున్న కొబ్బరి మొక్కలు

శతశాతం మరుగుదొడ్లే లక్ష్యం

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగమల్లీశ్వరి



ప్రశ్న: మండలంలో మరుగుదొడ్ల నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలేమిటీ?
జ: మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో ఇప్పటికే కొన్ని పంచాయతీలను ఓడీఎఫ్‌లుగా ప్రకటించాం. మిగిలిన పంచాయతీల్లో శతశాతం మరుగుదొడ్లను నిర్మించేందుకు కృషిచేస్తున్నాం.

నిర్మించిన మరుగుదొడ్లుకు బిల్లులు చెల్లించారా?
ఇప్పటివరకు నిర్మించిన మరుగుదొడ్లు అన్నింటికి బిల్లులు మంజూరు చేశాం. గురందొరపాలెం పంచాయతీలో పది మరుగుదొడ్లకు బిల్లులు ఇటీవల ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. మంజూరు కాగానే వారికి అందజేస్తాం.

సమ్మర్ క్రాష్ ద్వారా ఎన్ని బోర్లు బాగు చేశారు?
మండలంలో క్రాష్ కార్యక్రమం ద్వారా వేసవిలో 41రోజులపాటు 122 బోర్లు మరమ్మతులు చేపట్టాం. ప్రస్తుతం అన్నిప్రాంతాలకు పుష్కలంగా తాగునీరు సరఫరా చేస్తున్నాం.

వేములపూడిలోని పెద్దట్యాంకు పనులు ఎంతవరకు వచ్చాయి?
వేములపూడిలో పెద్ద ట్యాంకు పనుల నిమిత్తం అదనంగా రూ.30లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం పైపులైన్ పనులు జరుగుతున్నాయి. ఈనెలాఖరునాటికి ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నాం.

సామూహిక మరుగుదొడ్లు పరిస్థితి ఏమిటీ?
మండలంలోని యరకన్నపాలెం పంచాయతీలో ఇప్పటికే సామూహిక మరుగుదొడ్లు నిర్మించి రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు భవిష్యత్తులో ఎక్కడైనా నిర్మించాల్సి ఉంటే వాటికి ప్రతిపాదనలు పంపిస్తాం.
-నర్సీపట్నం టౌన్

పారదర్శకంగా సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శరత్‌బాబు

నర్సీపట్నం రూరల్:
కౌలు రైతులు, ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌లకు సంబంధించి లబ్ధిదారులకు ప్రభుత్వ సబ్సిడీ రుణాలను పారదర్శకంగా అందించాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.శరత్‌బాబు కోరారు. పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఏడీబీ) బ్రాంచినందు శుక్రవారం సాయంత్రం మండలస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ డి.శరత్‌బాబు మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్‌లు అందించే సబ్సిడీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలను నిర్వహించిన రోజునే లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను తయారు చేయాలని సూచించారు. తరువాత వచ్చే జాబితాలను బ్యాంకు అధికారులు పరిగణనలోకి తీసుకోవడం జరగదన్నారు. అలాగే కౌలు రైతుల రుణాలకు సంబంధించి వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గుర్తించినవారికి మాత్రమే రుణాలను బ్యాంకు అధికారులు మంజూరు చేయాలన్నారు. గతంలో కౌలు రైతులు రుణాలు పొంది తిరిగి చెల్లించని బకాయిదారులకు ఈ ఏడాది రుణాలు ఇవ్వరన్నారు. సక్రమంగా నిర్వహిస్తున్న స్వయం సహాయక గ్రూపులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా పెద్ద మొత్తంలో రుణాలను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ సుకల రమణమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ టీజేఏ మురళీకృష్ణ, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ పీఎస్ ప్రభాకర్, నర్సీపట్నం ఎస్‌బీఐ (ఏడీబీ) మేనేజర్ ఎండీ మహబూబ్‌అహ్మద్, లీడ్ బ్యాంకు అసోసియేట్ ఎల్‌డీఎం మూర్తి, నర్సీపట్నం, కొయ్యూరు, రోలుగుంట, గొలుగొండ మండలాల బ్యాంకర్ల మేనేజర్‌లు, ఎంపీడీవోలు, వ్యవసాయాధికారులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ శరత్‌బాబు

వ్యవసాయ శాఖ ఏడీగా మోహనరావు

నర్సీపట్నంలో బాధ్యతల స్వీకారం



నర్సీపట్నం రూరల్:
నర్సీపట్నం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడిగా వంగపండు మోహనరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన ఎలమంచిలి వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై నర్సీపట్నం వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు శుక్రవారం ఇన్‌చార్జి ఏడీ కె.ఝాన్సీలక్ష్మి నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్నారు. నర్సీపట్నం, రోలుగుంట, గొలుగొండ, రావికమతం, మాడుగుల మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బంది కలిసి తమ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన రైతతులకు అందేలా తనవంతు కృషిచేస్తానన్నారు.

శరవేగంగా న్యాయస్థాన భవన నిర్మాణాలు

నవంబర్‌లో ప్రారంభానికి అధికారుల సన్నాహాలు

నర్సీపట్నం టౌన్:
నర్సీపట్నంలో న్యాయస్థాన భవన సముదాయ నిర్మాణాలు శరవేగంతో సాగుతున్నాయి. ఈ సముదాయాన్ని రూ.2.68 కోట్లతో 16 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. నవంబరు నెలాఖరునాటికల్లా భవనం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని భావిస్తున్నారు. మొదటి అంతస్తులో న్యాయస్థానాలు నిర్వహించడానికి, కింద భాగంలో బ్యాంకు, పార్కింగ్, క్యాంటీన్, పనులపై వచ్చేవారికి వసతి కోసం వినియోగిస్తారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కనే ఉన్న స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనుమతి లభించినా నిధుల కొరతతో ఇప్పటివరకు భవనం పనులు మందకొడిగా సాగాయి. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇటీవల దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపి నిధులు కేటాయించడంతో పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం పట్టణంలో మూడు న్యాయస్థానాలున్నాయి. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సంఘం భవనంలో, కార్యాలయం వెనుక ప్రభుత్వ భవనంలో రెండు న్యాయస్థానాలు, తురకబడి వద్ద అద్దె భవనంలో ఒక న్యాయస్థానం నడుస్తున్నది. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న భవనం పనులు పూర్తయితే ఈ మూడింటిని ఒక్కచోటకు తీసుకు వస్తారని అంటున్నారు. పట్టణానికి దాదాపు రెండు రెండున్నర కిలోమీటర్ల దూరంలో కొత్త భవనాలను నిర్మించడం వల్ల ఆ ప్రాంత అభివృద్ధి జరుగుతుందని పలువురు అంటున్నారు.


పనులు జరుగుతున్న న్యాయస్థాన భవనం

విద్యుత్ సమస్యలపై స్పందించకుంటే ఫిర్యాదు చేయండి

నర్సీపట్నం:
నర్సీపట్నం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించకపోతే తమకు ఫిర్యాదు చేయాలని రూరల్ ఏడీఈ వి.లక్ష్మణరావు కోరారు. తమ పరిధిలో గల నాతవరం, గొలుగొండ, కోటవురట్ల, కొయ్యూరు మండలాల విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలు పరిష్కారానికి సంబంధిత మండలాల సహాయ ఇంజనీర్లను సంప్రదించాలన్నారు. గొలుగొండ ఏఈ 9440812550/ నాతవరం ఏఈ 9440812569/ కోటవురట్ల ఏఈ 9440812548/ కొయ్యూరు ఏఈ 9440812557 ఫోన్ నంబర్‌లలో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. వినియోగదారులు సమస్యలపై సదరు అధికారులు స్పందించని పక్షంలో డివిజనల్ ఇంజనీర్ 9491049790, రూరల్ ఏడీఈ 9440812513 ఫోన్ నంబర్‌లకు ఫిర్యాదు చేయాలని కోరారు.

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	:	08854 254044
ఎంపీడీవో కార్యాలయం	:	9441953611
తహసీల్దార్ కార్యాలయం	:	9441836336
వెలుగు ఏపీఎం	:	9866074067

సినిమా గైడ్

గౌతమ్ : నిన్ను కోరి
సూర్యమహల్ : వాసుకి
సాయిమహల్ : గౌతమ్‌నంద
లక్ష్మీ (ఏసీ) : ఫిదా



గ్రావెల్ వేసి విడిచిపెట్టిన రహదారి నిర్మాణం

- బీటీ రోడ్డుకు రూ.కోటి మంజూరు
- గత ఏడాది నవంబర్‌లో పనుల ప్రారంభం
- గ్రావెల్ వేసి వదిలేశారు
- నల్లమట్టిపాలెం ప్రజల అవస్థలు



బురదమయంగా మారిన రహదారి

నిలిచిన పనులు

నక్కపల్లి : మండలంలోని హెటెరో జంక్షన్ నుంచి నల్లమట్టిపాలెం వరకూ బీటీ రహదారి నిర్మాణానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.కోటి ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టడంతో జాప్యం జరుగుతోంది. దీంతో రాకపోకలకు నల్లమట్టిపాలెం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది నవంబర్ 22న పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్ గ్రావెల్ వేసి వదిలేశారు. ఈ పనులు పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రాజెక్ట్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడం వల్లే రోడ్డు పనులు జాప్యమవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం గ్రావెల్ వేయకపోయినా పాత రోడ్డే నడవడానికి అనుకూలంగా వుండేదని వారు చెబుతున్నారు. గ్రావెల్ వేయడం వల్ల ఏ మాత్రం చినుకులు పడినా రహదారి చిత్తడిగా మారుతోంది. పెద్ద వర్షం పడితే మాత్రం కనీసం సైకిల్ వెళ్లే అవకాశం లేదు. అలాగే నడిచివెళ్లేందుకు కూడా అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. పెద్ద పెద్ద గోతులతో బురదమయంగా మారింది. గ్రావెల్ వేసి ఏడు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ రహదారి పనులు ఎందుకు చేపట్టలేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గోతుల్లో చేరిన వర్షపు నీరు

పట్టించుకోని అధికారులు



నల్లమట్టిపాలెం రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ గ్రావెల్ వేసి విడిచిపెట్టారు. దీంతో వర్షం పడితే పాదం మునిగేంత బురద ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్ర వాహనాలు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇప్పటికే 8 నెలలు కావస్తోంది. దీనిపై ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు.

కాళ్లవీరాస్వామి, నల్లమట్టిపాలెం

అధ్వానం...



మా గ్రామ రహదారి చాలా అధ్వానంగా తయారైంది. కాంట్రాక్టర్ గ్రావెల్ వేసి వదిలేస్తే ఇంత వరకూ అధికారులు ఎందుకు పట్టించుకోలేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయండి.

మాసా కాసులు, నల్లమట్టిపాలెం

వర్షం వస్తే నరకమే



వర్షాలు పడినప్పుడు ఏ అధికారైనా మా గ్రామానికి వస్తే మేము పడే బాధలు తెలుస్తాయి. వర్షం పడితే ఈ రహదారిలో నడవడానికి నరకం అనుభవిస్తున్నాం. దీన్ని పర్యవేక్షించే అధికారులు ఎక్కడ ఉంటున్నారో తెలియడం లేదు. రాత్రి వేళల్లో అత్యవసరమని రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నాం

ఎన్.నాగేశ్వరరావు, నల్లమట్టిపాలెం

60 శాతం పింఛన్లు పంపిణీ : ఎంపీడీఓ

పాయకరావుపేట : మండలంలో ఆగస్టు నెల పింఛన్లు పంపిణీ శుక్రవారానికి 60 శాతం పూర్తయినట్టు ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల్లో అన్ని రకాల పింఛన్లు కలిపి 7,936 మందికి రూ.84 లక్షలు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ నెల 1వ తేదీ సాయంత్రం బ్యాంకు అధికారులు నగదు ఇచ్చారని చెప్పారు. 2వ తేదీ నుంచి శుక్రవారం వరకు రోజుకు 20 శాతం చొప్పున 60 శాతం పంపిణీ పూర్తయ్యిందన్నారు. పదవ తేదీ వరకు సమయం ఉన్నప్పటికీ శని, ఆదివారాల్లో 90 శాతం వరకు పంపిణీ పూర్తయ్యే అవకాశముందన్నారు. మండలంలో మత్స్యకార గ్రామాల్లో పింఛనుదారులు ఒడిస్సా తదితర ఇతర ప్రాంతాలకు వలస వెళుతుండడంతో రెండు, మూడు నెలలకు ఒకసారి వచ్చి పింఛను తీసుకుంటున్నారని ఎంపీడీఓ తెలిపారు.

నేడు సామాజిక తనిఖీపై ప్రజా వేదిక

పాయకరావుపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎ.ఎ.సాంబశివరావు తెలిపారు. గత ఏడాది జూలై 1 నుంచి ఈ ఏడాది మార్చి చివరి వరకు జరిగిన ఉపాధి పనులపై గత నెల 27 నుంచి శుక్రవారం వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ, గ్రామసభలు నిర్వహించారన్నారు. వీటిపై ఉదయం పది గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఈజీఎస్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధి కూలీలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితోపాటు ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

'ముద్రగడ'ను కలిసిన కాపు నేత శ్రీను

పాయకరావుపేట : స్థానిక కాపు జేఏసీ నాయకుడు జగతా శ్రీను శుక్రవారం కిర్లంపూడిలో కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో శ్రీను మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభంతో కాపు ఉద్యమంపై చర్చించినట్లు చెప్పారు. పోలీసులు ఎన్ని రోజులు బంధిస్తే అన్ని రోజులు రోడ్డు మీదకు వచ్చి కంచాలతో నిరసన తెలుపుతూ, ప్రతిరోజూ పాదయాత్రకు సిద్ధంగా ఉన్నామని 'ముద్రగడ' తెలిపారని జగతా శ్రీను చెప్పారు.

పేటలో కొనసాగుతున్న పోలీసు పికెట్



పాయకరావుపేట : కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చేపట్టనున్న పాదయాత్ర నేపథ్యంలో గత నెలలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లు కొనసాగుతుంది. శుక్రవారం ఎస్ఐ వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లాకు వెళ్ళే వాహనాలను తనిఖీ చేసేందుకు పాయకరావుపేటలోని నర్సీపట్నం జంక్షన్ వద్ద తాండవ వంతెన, వై జంక్షన్, పట్టణంలోని గౌతమ్ సెంటర్ వద్ద పోలీస్ గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ఇంకా మరికొన్ని రోజులు కొనసాగుతుందని ఎస్ఐ తెలిపారు.

తపోవనంలో సచ్చిదానందస్వామి ప్రత్యేక పూజలు

పాయకరావుపేట : మండలంలో వరలక్ష్మి వ్రతాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తాండవ నదిని ఆనుకుని తుని వైపు కట్రాళ్ల కొండ సమీపం ఉన్న తపోవనంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి దేవికి స్వామిజి సచ్చిదానంద సరస్వతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు, దుర్గానగర్‌లోని దుర్గమ్మతల్లి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న సచ్చిదానంద స్వామి

ఉపమాక సమాచారం



నక్కపల్లి : ఉపమాక శ్రీవెంకటేశ్వర క్షేత్రంలో శనివారం నిర్వహించు కార్యక్రమాలు...

- ఉదయం ఐదు గంటలకు దిగువ ఆలయాన్ని తెరుస్తారు. 5.30 గంటల నుంచి నిత్యారాధన
- 6.10 గంటలకు కొండపై ఉన్న ఆలయాన్ని తెరుస్తారు. 6.20 నుంచి 7-30 గంటల వరకూ మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం
- 8-20 నుంచి 11-45 గంటల వరకూ సర్వదర్శనాలు
- 11-30 గంటలకు కొండపైన, 11-50 నుంచి 12-20 వరకూ కింద ఆలయంలో రాజభోగం, తీర్థగోష్టి అనంతరం ఆలయ శుద్ధి
- మధ్యాహ్నం 12-45 నుంచి 3.55 గంటల వరకూ ఆలయంలో దర్శనాలు నిలిపివేసి మూసివేస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు తెరుస్తారు.
- సాయంత్రం 4 నుంచి 6-30 గంటల వరకూ కొండ దిగువన సర్వదర్శనాలు. రాత్రి 7-25 నుంచి 7-30 వరకూ పవళింపు సేవ, అనంతరం ఆలయం మూసివేత.

లోఓల్టేజీ సమస్య ఇంకెన్నాళ్లు?

నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని మెరక వీధిలో రెండేళ్ల నుంచి లోఓల్టేజీ సమస్య తీవ్రంగా వుంది. సాయంత్రమైతే ఫ్యాన్లు తిరగడమే గగనమైపోతోంది. లోఓల్టేజీ కారణంగా హోటళ్ల నిర్వాహకులు, పలువురు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి ఇటీవల మెరక వీధి రామాలయం వద్ద ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా దాని సామర్థ్యం చాలకపోవడంతో లోఓల్టేజీ సమస్య పరిష్కారం కాలేదు. వారం రోజుల కిందట కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వారం రోజుల నుంచి గంటకు పది సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. కంప్యూటర్లు, ఇళ్లల్లో గృహిణులు నిత్యం వాడే మిక్సీలు, గ్రైండర్లు కూడా పనిచేయడం లేదు. ఇన్వర్టర్లు కూడా పని చేయడం లేదని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపమాక సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా ఎవరూ వుండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని స్థానిక యువకులు చెప్పారు. దీనిపై మండల ఏఈ భాస్కరరావును సంప్రదించగా లోఓల్టేజీ సమస్య ఎక్కడుందో తెలుసుకుని, వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రజాసాధికార సర్వే ఆధారంగా గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపిక

తహసీల్దార్ శ్రీనివాసరావు



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

కోటవురట్ల: ప్రజాసాధికారక సర్వే ఆధారంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తహసీల్దార్ ఎం.ఎ.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పి.కె.పల్లి గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడారు. రెండో విడతగా 466 గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. వీటికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎంపీడీవో, తహసీల్దార్, హౌసింగ్ ఏఈ సమక్షంలో జరుగుతుంది. రోజుకు ఆరు గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. కమ్మల ఇంటిలో ఉన్న వారికే ఎన్టీఆర్ గృహం మంజూరు అవుతుందని, ఇప్పటి వరకు ఇల్లు ఉన్న వారికి, అలాగే గతంలో మంజూరు అయిన వారికి ఎన్టీఆర్ గృహం మంజూరు కాదని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి

4

ఎలమంచిలి

విశాఖపట్నం। శనివారం, 5 ఆగస్టు 2017


ఎలమంచిలి। అచ్యుతాపురం। మునగపాక। రాంబిల్లి

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - దండుపాళ్యం-2

తులసీ చిత్రమందిర్ - నిన్నుకోరి

పరమేశ్వరి - పటేల్...ఎస్ఐఆర్



ఖాళీగా ఉన్న దుకాణాలు

వెలవెలబోయిన వారపు సంత

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో శుక్రవారం జరిగిన వారపు సంత కొను గోలుదారులు లేక వెలవెలబోయింది. శ్రావణ శుక్రవారంతో పాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పెద్దగా వ్యాపారాలు జరగలేదు. ఇక్కడ ప్రతి శుక్రవారం జరిగే సంతకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా వ్యాపారులు వస్తుంటారు.సంతలో పశువులు, మేకలు, గొర్రెలు, నాటుకోళ్ళు, కొబ్బరికాయల వ్యాపారం ఎక్కువగా జరుగుతోంది. అయితే శ్రావణ శుక్రవారం కావడం, ఎండలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు ఎవరూ రాకపోగా కొనుగోలుదారులు కూడా లేకపోవడంతో సంత వెలవెలబోయింది. 11 గంటల వరకు విక్రయదారులు చూసి, వెళ్లిపోయారు.

పోస్టల్‌లో ఏటీఎం సేవలు

అచ్యుతాపురం : పోస్టల్‌లో కూడా ఏటీఎం సేవల కొనసాగుతున్నాయని ఎలమంచిలి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన జంగులూరులో బ్రాంచి పోస్టాఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూగతంలో పోస్టాఫీస్ అంటే కేవలం ఉత్తరాలు ఇవ్వడానికే అన్న అపోహ ఉందని, ప్రస్తుతం బీమా, ఎస్‌బీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు ఏటీఎం సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నామన్నారు. బ్యాంక్ ఏటీఎంలానే పోస్టల్‌లో కూడా ఎస్‌బీ (సేవింగ్స్ బ్యాంక్) అకౌంట్ ప్రారంభించి దేశంలో ఏ పోస్టాఫీస్/జాతీయ బ్యాంక్ ఏటీఎంల నుంచైనా డబ్బులు డ్రా చేసుకోవచ్చునని చెప్పారు. అలాగే ఏదో ఒక పోస్టాఫీస్‌లో ఎస్‌బీ ఖాతా ప్రారంభించి ఎక్కడి నుంచైనా ఆ ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు వేసుకోవచ్చునన్నారు. పోస్టల్ సేవలు పెంచాలన్న ఉద్దేశంతోనే గ్రామాల్లో శాఖలు ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జంగులూరు సర్పంచ్ లాలం నాగేశ్వరరావు, అచ్యుతాపురం ఎస్‌బీఎం భవానీ శంకర్, ఎస్‌కె లాల్ మహమ్మద్, విశ్వేశ్వరరావు, నారాయణ బాబు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో రాఖీల సందడి



ఎలమంచిలి : పట్టణంలోని పలు దుకాణాల్లో రాఖీల సందడి నెలకొంది. వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా వివిధ రకాల్లో రూపొందించిన రాఖీలను వ్యాపారులు విక్రయానికి ఉంచారు. సోమవారం జరిగే రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణంలో వీటి విక్రయాలు జోరందుకున్నాయి. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా పది రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకు వ్యాపారులు రాఖీలను అమ్మకాలకు ఉంచారు.

నర్సరీ బెడ్‌ల తయారీపై శిక్షణ

నర్సరీ బెడ్‌లు తయారుచేస్తున్న విద్యార్థినులు



మునగపాక : పని అనుభవం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నైరా కళాశాల నుంచి వచ్చిన ఏజీ బీఎస్సీ విద్యార్థులు శుక్రవారం చూచుకొండలోని రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా నర్సరీ బెడ్ తయారీ గురించి కేవీకే కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం. శ్రీకాంత్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. అలాగే అరబుపాలెంలో అంతర పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు.



పీఎస్ఆర్‌పేటలో పిల్లలను కేంద్రానికి తీసుకువస్తున్న కార్యకర్త



లైనుకొత్తూరులో పిల్లలను ఆడిస్తున్న ఆయా

కేంద్రాల్లో సిబ్బంది కొరత

కొన్నిచోట్ల ఆయాలు లేక...

మరికొన్నిచోట్ల కార్యకర్తలు లేక అవస్థలు

ఇంకొన్నిచోట్ల ఇద్దరూ లేక మూసివేత

నలుగురు కార్యకర్తలు, ఏడు ఆయా పోస్టులు ఖాళీ

భారంగా మారుతున్న కేంద్రాల నిర్వాహణ

అంగన్‌వాడీలా!

ఎలమంచిలి రూరల్ : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల కార్యకర్తలు, మరి కొన్నిచోట్ల ఆయాలు లేక కేంద్రాల నిర్వాహణ డీలా పడుతోంది. మండలంలోని 16 పంచాయతీల్లో 32 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 28 మంది కార్యకర్తలు, 20 మంది ఆయాలు పని చేస్తున్నారు. ఇంకా నలుగురు కార్యకర్తలు, ఏడుగురు ఆయాల పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ఆయాల కొరత ఉన్న కేంద్రాల్లో పిల్లలకు కార్యకర్తలే అన్ని పనులు చేయాల్సి వస్తోంది. అలాగే కార్యకర్తలు కొరత ఉన్న చోట ఆయాలే అన్ని పనులు చేస్తున్నారు. ఆయాలు లేని కేంద్రాల్లో కార్యకర్తలే ఇంటింటికి వెళ్లి పిల్లలను తీసుకురావడం, వారికి, గర్భిణీలు, బాలింతలకు వంటలు చేయడం వంటి అన్ని పనులు చేస్తున్నారు. లైనుకొత్తూరు,తురంగలపాలెం, క్రిష్టాపురం కాలనీ, రామభద్రపురం కేంద్రాలకు కార్యకర్తలు లేరు. రేగుపాలెం-1, లైనుకొత్తూరు, పోతిరెడ్డిపాలెం, పులపర్తి-2, పద్మనాభరాజుపేట-2, ఏటికొప్పాక-1, క్రిష్టాపురం కేంద్రాల్లో ఆయాల కొరత ఉంది. లైనుకొత్తూరు కేంద్రంలో కార్యకర్త, ఆయా కూడా లేకపోవడంతో పక్క గ్రామమైన సోమన్నపాలెం కేంద్రానికి చెందిన ఆయాను డిప్యూటేషన్‌పై వేశారు. అక్కడ కార్యకర్త లేకపోవడంతో నాలుగేళ్ళ నుంచి ప్రతి రోజూ ఉదయం సోమన్నపాలెం నుంచి ఆటోలో ఆమె కేంద్రానికి వెళ్లి గ్రామంలోని పిల్లలను తీసుకువచ్చి వారిని ఆడించడం అలాగే వారితో పాటు మిగతా వారందరికీ వంటలు చేస్తున్నారు. ఆటో ఖర్చు రోజుకి రూ. పది ఆమే భరిస్తోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కేంద్రాల్లో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఏసీడీపీఓ మేరీ సువార్త వద్ద ప్రస్తావించగా కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల కొరత ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే సిబ్బంది కొరత విషయమై అధికారులు నివేదించినట్టు తెలిపారు.

ఆయా లేక అవస్థలు



మా కేంద్రంలో ఆయా లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. ఉదయాన్నే కేంద్రాన్ని తెరిచి దాన్ని అలా వదిలేసి ఊరు మీదకి వెళ్లి పిల్లలను ఎత్తుకొని తీసుకురావల్సి వస్తుంది. తరువాత పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు వంటలు చేసే సమయంలో పిల్లలను చూసే వారు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం.

ఆర్డమూరి నూకాలమ్మ, పీఎస్ఆర్‌పేట, కార్యకర్త

అన్ని పనులు మాకే



మా కేంద్రంలో ఆయా లేక అన్ని పనులు నేనే చేసుకోవల్సి వస్తుంది. పిల్లలను ఆడి ంచడం, వారికి వంటలు చేయడం వాటితో పాటు ఒకరినే కావడంతో మిగతా పనులన్నీ చేసుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నాను.

లాలం రమాదేవి

కనీసం ఆటో ఖర్చులు కూడా ఇవ్వడం లేదు



నాలుగేళ్ల నుంచి సోమన్నపాలెం నుంచి ప్రతి రోజూ లైనుకొత్తూరు కేంద్రానికి ఆటోలో రాకపోకలు చేస్తున్నాను. కనీసం ఆటో ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాను. ప్రతి రోజూ రాకపోకలు చేయడానికి ఆటోకి రోజుకి పది రూపాయలు ఇస్తున్నాను.

అల్లు అమ్మాజీ, ఆయా, లైనుకొత్తూరు

కమ్యూనిటీ హాల్ ఆక్రమణపై ఫిర్యాదు

మునగపాక : గణపర్తిలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు నిర్మించిన కమ్యూనిటీ హాల్ అన్యాక్రాంతమవుతుందని, నిబంధనలకు విరుద్ధంగా హాల్‌ను గౌరీ దేవాలయంగా మార్చేస్తున్నారని గ్రామానికి చెందిన వదరం అప్పలనాయుడు, వీడీ నాయుడు, కొండలరావు, సత్యనారాయణ తదితరులు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. కమ్యూనిటీ హాల్‌ను సర్పంచ్ కర్రి జయలక్ష్మి భర్త రామనాగేశ్వరరావు ఉద్దేశపూర్వకంగానే గౌరీ దేవాలయంగా మార్చి భవనం రూపురేఖలు తెలిపారు. దీని వల్ల అందరికీ ఉపయోగంలో ఉండాల్సిన కమ్యూనిటీ హాల్ కేవలం ఒక మతం వారికే ఉపయోగపడేలా ఉందని ఆరోపించారు. ఈ విషయమై సర్పంచ్ కర్రి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మారిశెట్టి కనకరామలక్ష్మి వివరణ ఇస్తూ గ్రామంలో అందరి సామాజిక అవసరాలు తీర్చే విధంగా కమ్యూనిటీ హాల్ వినియోగిస్తున్నామని చెప్పారు.తమపైకావాలనే కొందరు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాంబిల్లి : రాంబిల్లి, కొత్తపేట ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు డీఈ ఎల్. మహేంద్రనాథ్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.మూడు ఫీడర్లలో విద్యుత్ పనుల చేపట్టనుండడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మానసిక ఒత్తిడి వల్లే ఆత్మహత్యలు : ఎస్ఐ

మునగపాక : మండలంలో ఇటీవల ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతుండడంతో ఎస్ఐ స్వామినాయుడు శుక్రవారం పోలీస్ స్టేషన్ స్థానిక యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడి తట్టుకొని ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. ఒత్తిడిలో ఉన్న యువకులకు మానసిక ధైర్యం చెప్పాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు టెక్కలి వీర కొండలరావు, ఆడారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ స్వామినాయుడు

కన్నారావుకు సన్మానం

మునగపాక : వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామితులైన మారిశెట్టి కన్నారావును గురువారం రాత్రి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోతో టీడీపీ గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయన్నారు. ముఖ్యంగా పింఛన్ రెండు వేల రూపాయలు చేస్తామన్న దానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోదెపు గోవింద, రాజాన బుజ్జి, మళ్ల సంజీవరావు, బొడ్డేడ అప్పలనాయుడు, దాడి పోలీస్, సర్పంచ్ టెక్కలి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు టెక్కలి వీరకొండలరావు పాల్గొన్నారు.



కన్నారావును సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

పిసినికాడలో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

కొత్తూరు : పిసినికాడ గ్రామంలో 90 మంది ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించినట్టు హౌసింగ్ ఏఈ రామచంద్రరావు తెలిపారు. పిసినికాడ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన గ్రామసభలో మాట్లాడారు. పల్స్ సర్వే ఆధారంగా 200 మందికి ఇళ్లు లేవని గుర్తించామని పేర్కొన్నారు. వీరిలో ప్రస్తుతం తొంభై మందిని ఎంపిక చేశామన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- నిన్నుకోరి
శ్రీసత్య - వశం
రాజా - గ్రీన్‌కార్డు
షిర్డీసాయి - దర్శకుడు
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : గౌతమ్‌నంద
శ్రీసత్యనారాయణ: నక్షత్రం

ఆక్రమణల చెరలో ఎర్ర చెరువు!

• వేటజంగాలపాలెంలో కొందరి ఆగడాలు • కబ్జా చేసి పంటలు • ఎంచక్కా నీరు మళ్లింపు • లబోదిబోమంటున్న ఆయకట్టు రైతులు


వేటజంగాలపాలెంలో ఉన్న ఎర్ర చెరువు

అనకాపల్లి : మండలంలోని వేటజంగాలపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న ఎర్ర చెరువు ఆక్రమణలకు గురవుతోంది. సర్వే నంబర్లు 8, 9లలో సుమారు 15 ఎకరాల్లో ఈ చెరువు విస్తరించి ఉంది. ఈ గ్రామానికి చెందిన భూములకు, భూగర్భ జలాలకు ఈ చెరువే ఆధారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ చెరువులో కొంత భాగాన్ని కొందరు ఆక్రమించి సేద్యం చేసుకుంటున్నారు. ఈ చెరువు కింద సుమారు వంద ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. చెరువు విస్తీర్ణంలో సుమారు ఐదారు ఎకరాల వరకు ప్రస్తుతం ఆక్రమణకు గురైంది. మిగిలిన భాగంలో ఉన్న నిల్వ నీటితోనే ఆయకట్టు రైతులు తమ పంటపొలాలను పండించుకుంటున్నారు. ఇప్పటికే ఈ ఏడాది చెరువు గర్భంలో నారుమళ్లు వేసుకున్నారు. నారు ఎదిగిన వెంటనే నీరు చెరువులోకి వచ్చిన తరువాత నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ తరుణంలో కొందరు ఆక్రమణదారులు చెరువు నీటిని చక్కగా తమ పొలాలకు మళ్లిస్తుండడంతో ఆయకట్టు రైతులు లబోదిబోమంటున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే గత ఐదారు సంవత్సరాలుగా ఆయకట్టు భూములకు సాగునీరు అందలేదని వారంతా ఆరోపిస్తున్నారు. ఇదిలావుంటే, చెరువుకు తూర్పు భాగంలో గట్టు లేదు. దీంతో చెరువులోకి వచ్చిన నీరు ఎప్పటికప్పుడు వృథాగా పోతోంది. దీనికి కళింగ కూడా నిర్మించాల్సి ఉంది. ఈ పని కూడా జరగలేదు. చెరువును సర్వే చేయించాలని గతంలో వేటజంగాలపాలెం సర్పంచ్ పూడి చిన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరావులు పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.


చెరువును ఆక్రమించి పంటలు పండిస్తున్న దృశ్యం



ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- సత్యనారాయణ, తహసీల్దార్, అనకాపల్లి



ఎర్ర చెరువు ఆక్రమణల విషయం నాకు తెలియదు. ఇటీవలే నేను ఇక్కడ బాధ్యతలు స్వీకరించాను. వీఆర్వోను పంపించి వాస్తవ పరిస్థితులపై ఆరా తీస్తాను. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణ నేరం. దీనిని అతిక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవు. ఆక్రమణలు ఉంటే ఆయా గ్రామాల ప్రజలు కూడా అధికారుల దృష్టికి తీసుకురావాలి.

ఆర్మీ, నేవీ కోర్సులలో ఉచిత శిక్షణ

అనకాపల్లి రూరల్ : ఆర్మీ, నేవీ రంగాల్లో చేరాలనుకునే యువకులకు మాజీ సైనిక ఉద్యోగి ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. మండలంలోని గొలగాం గ్రామానికి చెందిన మిండి శివకుమార్ 17 ఏళ్లపాటు ఆర్మీలో పనిచేసి ఈ ఏడాది జనవరిలో రిటైర్ట్ అయ్యారు. అనంతరం ఆర్మీ, నేవీలలో చేరాలనుకొనే గ్రామీణ యువతకు తనవంతు తర్ఫీదు అందించాలని సంకల్పించారు. దీంతో కొద్ది రోజుల కిందట తన గ్రామంలోనే ఇద్దరు యువకులతో శిక్షణ ప్రారంభించి ప్రస్తుతం 30 మందితో ఒక బ్యాచ్‌ను ఏర్పాటుచేసి వారికి ఫిజికల్‌గా శిక్షణ ఇస్తున్నాడు. అలాగే నామమాత్రపు ఫీజుతో వ్రాత పరీక్షకు అవసరమైన శిక్షణ అధ్యాపకులచే ఇప్పిస్తున్నట్టు శివకుమార్ తెలిపారు.

6న ఇంద్రగంటి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ సింగింగ్ సంస్థ ప్రారంభం


వర్ధమాన సినీ సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్

గవరపాలెం : యువతను గాయనీ, గాయకులుగా తీర్చిదిద్దేందుకు ఈ నెల ఆరో తేదీన ఇంద్రగంటి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫిషనల్ సింగింగ్ సంస్థను ప్రారంభించనున్నట్టు వర్ధమాన సినీ సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. వీవీ రమణ రైతు భారతి హాల్లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కల్యాణి నృత్య సంగీత అకాడమీ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు కానున్న ఈ ఇనిస్టిట్యూట్‌ను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆయనే చైర్మన్‌గా కొనసాగుతారని వివరించారు. అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా సినీగేయ రచయిత చంద్రబోస్, సినీ సంగీత దర్శకులు మాదవపెద్ది సురేష్, సినీ గాయకులు శ్రీకృష్ణ, అంజనా సౌమ్య, హేమచందర్, వనమాలిక, దాడి ప్రభాకర్ కొనసాగుతారన్నారు. ఆసక్తిగలవారు తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

శారదా నది ఒడ్డున స్విమ్మింగ్ పూల్



నెహ్రూచౌక్ : శారదా నది ఒడ్డున గల ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయం పక్కన ఆహ్లాదకరమైన వాతావరణంలో శారదా జలవిహార్ పేరిట స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మించారు. పట్టణవాసుల వినోదం, వ్యాయామం కోసం ఇది ఏర్పాటు కావడంతో ముఖ్యంగా యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లల కేరింతలకు అయితే హద్దే ఉండడం లేదు.

‘షాపు ఎంప్లాయీస్’ వజ్రోత్సవాలు ప్రారంభం

• ఐక్యతకు నిదర్శనం ఈ వేడుక
• వర్తకసంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో శుక్రవారం రాత్రి ది అనకాపల్లి షాపు ఎంప్లాయీస్ యూనియన్ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వర్తకసంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుమస్తాలు ఎంత ఐక్యతగా ఉన్నారో ఈ వజ్రోత్సవాలు నిదర్శనమని పేర్కొన్నారు. 1943లో ప్రారంభించిన యూనియన్‌లో ఏ ఒక్కరూ బేషజాలకు పోకుండా సంస్థను క్రమశిక్షణతో నడిపించడం అభినందనీయమన్నారు. మార్కెట్‌లోని కొలగార్లు, కళాసీలు, గుమస్తాలు ఐక్యంగా పనిచేస్తున్నారనడానికి ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు. అయితే గతంలో కార్మికులు, కొలగార్లు, గుమస్తాలకు చేతి నిండా పని ఉండేదని అన్నారు. గతంలో రోజుకి లక్ష వరకు బెల్లం దిమ్మలు మార్కెట్‌కు దిగుమతి అయ్యేదని ప్రస్తుతం 50వేల లోపు రావడం గగనంగా మారిందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ గుమస్తా అప్పారావును వర్తకసంఘం ప్రతినిధులు సత్కరించారు అంతకు ముందు సాయి ప్రశాంతి క్రియేషన్ కళాకారులు ప్రదర్శించిన వశీకరణం నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వర్తకసంఘం అధ్యక్షుడు కోరుకొండ శరత్‌కుమార్, కోశాధికారి దాడి విశ్వనాథం, యూనియన్ గౌరవాధ్యక్షుడు మళ్ల సత్యనారాయణ, కొలగార్ల సంఘం అధ్యక్షుడు బుద్ద నాగేశ్వరరావు, కార్యదర్శి పెంటకోట శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్షుడుపెంటకోట త్రినాధరావు, కార్యదర్శి విల్లూరి వెంకటరమణబాబు, కోశాధికారి తిమ్మాపాత్రుని నూకరాజు, కొణుతుల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సంతోషిమాత ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే పీలా


సంతోషిమాత అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి : సంతోషిమాత ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, ఆలయ చైర్మన్ దాడి వాసు, మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు, కొణతాల నూకనాయుడు, ఈవో శర్మ పాల్గొన్నారు.

శాసనసభ ఎస్టీ కమిటీకి ఘన స్వాగతం

మోదకొండమ్మను దర్శించుకున్న ప్రతినిధులు

జ్ఞాపికతో సత్కరించిన కమిటీ సభ్యులు





అసెంబ్లీ ఎస్టీ కమిటీకి పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం... అమ్మవారిని దర్శించుకుంటున్న కమిటీ సభ్యులు

పాడేరు: శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీకి పాడేరులో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. కమిటీ ప్రతినిధులు మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ప్రధాన కార్యదర్శి బూరెడ్డి నాగేశ్వరరావు తదితరులు వారికి స్వాగతం పలికారు. పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానం పలికారు. ఎస్టీ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, రత్నాబాయి, పి.పుష్పాశ్రీవాణి, అప్పలనాయుడు, రాజేశ్వరి తదితరులు మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, సభ్యులకు ఆలయ కమిటీ తరపున ఎమ్మెల్యే ఈశ్వరి, ప్రతినిధులు నాగేశ్వరరావు, గోవిందరావు తదితరులు అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. అనంతరం వారిని దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ, అరకులోయ వైసీపీ సమన్వయకర్త శెట్టి పల్గుణ, ఆర్డీవో వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కళకళలాడిన దేవాలయాలు

పాడేరు రూరల్: పట్టణంలో శ్రావణ మాసం సందడి కనిపించింది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం మోదకొండమ్మ, కనకదుర్గమ్మ, షిరిడీసాయి మందిరాలు కళకళలాడాయి. మహిళలు వేకువ జామునే లేచి గ్రామంలో ఉన్న ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం గృహాల్లో ఉపవాసాలతో వరలక్ష్మి పూజలను చేపట్టి తోటి మహిళలకు తాంబూలాలు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల ప్రజలు పట్టణానికి వచ్చి బంగారు ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేసుకున్నారు.

ధారకొండ ఆలయాల్లో...

సీలేరు: ధారకొండలోని మారెమ్మ, ధారాలమ్మ ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ మాసం ప్రారంభం నుంచి ప్రతీ శుక్రవారం ఈ ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. అలాగే అమ్మవార్లను ప్రత్యేక రూపాల్లో భక్తులకు దర్శనం ఇస్తుండడంతో సీలేరు, ధారకొండ ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేస్తున్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి

ఎంపీపీ సత్యనారాయణ



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

కొయ్యూరు: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్నదని ఎంపీపీ జి.సత్యనారాయణ అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు ధర నిర్ణయించే స్థాయికి రైతులను తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ సంస్థలను బలోపేతం చేసేలా ఇద్దరు రైతుమిత్రలను నియమించుకోవడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అనంతరం రైతుమిత్రలుగా కురుజు రమేష్, నత్తు సోమన్నదొరలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భారతి, పశు వైద్యాధికారి రాజేష్, ఉద్యాన శాఖ డీపీఎం శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాము కాటుతో బాలుడికి అస్వస్థత

పాడేరు రూరల్: మండలంలోని ముంతమామిడి గ్రామానికి చెందిన మర్రి మహేష్(8) శుక్రవారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో బాలుడు పాము కాటు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. వైద్యాధికారి అనిల్ ఆస్పత్రిలోనే ఉంచి బాలుడికి సేవలు అందిస్తున్నారు.

25 పంచాయతీ కేంద్రాల్లో తపాలా సేవలు

అరకు సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు



రాప గ్రామంలో తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాడేరు రూరల్: మన్యంలో 25 పంచాయతీల్లో పోస్టల్ సేవలు అందించనున్నట్టు అరకు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అండిభ, బొడ్డాపుట్టు, చీకుమద్దుల, గన్నేరుపుట్టు, రాప, వాల్తా, మత్స్యపురం పంచాతీ కేంద్రాల్లో శుక్రవారం తపాలా సేవలను ఆయన ప్రారంభించారు. అనంతరం పాడేరు వచ్చిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. మారుమూల పంచాయతీల్లో కార్యాలయాల ఏర్పాటుతో ప్రజలకు తపాలా సేవలు మరింత చేరువ అవుతాయన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన తపాలా కార్యాలయాల్లో పొదుపు, ఆర్డీలు, తపాలా జీవిత బీమా తదితర సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని మారుమూల ప్రాంత గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన్యంలో మరి కొన్ని పంచాయతీల్లో తపాలా కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఉద్యోగులు పి.రామకృష్ణ, జె.మహేశ్వరరావు, ఎం.శివయ్య, ఎ.రాధామాధవి, టీడీ.ప్రసాదరావు, జి.నీలకంటేశ్వరరావు, ఎస్.గుండన్న, జి.రాజు, హరిబాబు, ఏడు పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీసీసీ బంకులో ఆయిల్ కొరత

జి.మాడుగుల: మండల కేంద్రంలోని జీసీసీ పెట్రోల్ బంకులో ఆయిల్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఈ బంకులో పెట్రోల్, డీజిల్ కొరత వల్ల ఆయిల్ కోసం పాడేరు వెళ్లాల్సి వస్తుందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. జీసీసీ అధికారులు తక్షణమే స్పందించి నిత్యం పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాంగ్రెస్ సీలేరు పట్టణ అధ్యక్షుడిగా ముత్యాలు

సీలేరు: కాంగ్రెస్ పార్టీ సీలేరు పట్టణ అధ్యక్షుడిగా వానపల్లి ముత్యాలు నియమితులయ్యారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు పసుపులేటి బాలరాజు లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యవర్గ సభ్యుడు కారే శ్రీనివాస్ విలేఖర్లతో మాట్లాడుతూ, వానపల్లి ముత్యాలు కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి ఈ పదవిని మరలా కట్టబెట్టారన్నారు. పార్టీ అభివృద్ధికి ముత్యాలు మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ కోరారు.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

178 మంది జ్వర బాధితులకు రక్త పరీక్షలు ● ఇద్దరు మలేరియా, నలుగురు వైరల్ జ్వర బాధితుల గుర్తింపు



ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న జ్వర బాధితులు

పాడేరు రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. శుక్రవారం ఏరియా ఆస్పత్రి ఓపీ 401కి చేరింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవల కోసం రోగులు క్యూ కట్టారు.

గిరిజన గ్రామాల్లో వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఏరియా ఆస్పత్రిలో రోగులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఓపీలో 401 మంది, మధ్యాహ్నం మరో 40 మంది వరకు రోగులు వైద్య సేవలు పొందారు. వీరిలో 178 మంది వరకు జ్వర బాధితులే ఉన్నారు.

ఏరియా ఆస్పత్రి రక్త పరీక్షల కేంద్రంలో జ్వర బాధితులందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఇద్దరు మలేరియా, నలుగురు వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. అదే విధంగా ఆస్పత్రి పరిధిలోని వివిధ ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, స్పందించి తక్షణమే స్పందించి గ్రామాలు, గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు, హెచ్ఎంలు, వసతిగృహ నిర్వాహకులు, విద్యార్థులు ముక్త కంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదలందరికీ గృహాలు

కొయ్యూరు: నిరు పేదలందరికీ గృహ కల్పనకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు లోకుల గాంధీ అన్నారు. మండలంలో కొమ్మిక పంచాయతీలో పీఎంఏవై పథకం ద్వారా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు గృహ నిర్మాణ హక్కు పత్రాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం కొమ్మిక ఎంపీటీసీ సభ్యుడు బాబూజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాంధీ మాట్లాడుతూ, ప్రతీ కుటుంబానికి పక్కా గృహం ఉండాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని అలాగే పాత తుమ్మలబంద, కొత్తవీధి గ్రామాలకు రహదారి నిర్మాణానికు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సుబ్రహ్మణ్యం, నూకరాజు, అప్పలరాజు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పథంలో

- మొక్కలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన ఆవరణ
- దేశ నాయకుల విగ్రహాల ఏర్పాటు
- విద్యార్థులకు కంప్యూటర్ విద్య...గ్రంథాలయం
- పాఠశాల అభివృద్ధికి గ్రామస్థుల సహకారం



మొక్కలతో కళకళలాడుతున్న ఎం.కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాల

మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోటపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి పథంలో ముందుకు పోతోంది. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడంతో పాటు పాఠశాల ఆవరణను పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా ఉంచారు. తరగతి గదులు ముందు వివిధ రకాల మొక్కలు నాటిన కుండీలను ఉంచారు. పాఠశాల ఆవరణలో గాంధీమహాత్ముడు, నెహ్రూ, సరస్వతీ విగ్రహాలను కూడా గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందిస్తున్నారు. పాఠశాలలో గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇదిలావుండగా పాఠశాలలో నిర్మించిన వంటగదిని పూర్తిస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వినియోగించుకుంటున్నారు. ఎండా, వానలకు ఇబ్బందులు పడకుండా వంటగదిలోనే గ్యాస్ పొయ్యిలపై వంటలు వండుతూ విద్యార్థులకు సకాలంలో భోజనాన్ని అందిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ పెద్దలు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. దీనికి పాఠశాల హెచ్ఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సిబ్బంది కృషిచేస్తున్నారు. ఎం.కోటపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి



పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు



పరిశుభ్రంగా ఉన్న పాఠశాల ఆవరణ

ఎనిమిదవ తరగతి వరకు 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఏడుగురు ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తుంటారు. ఈ పాఠశాలకు మరో నాలుగు ఎస్జీటీ పోస్టులు కూడా మంజూరయ్యాయి. త్వరలో మరో నలుగురు ఉపాధ్యాయులు కూడా పాఠశాలకు రానున్నారు. విద్యార్థులకు ఎనిమిది తరగతి గదులు ఉన్నాయి. పాఠశాలలో వంటగది, విద్యార్థులకు మరుగుదొడ్లు కూడా ఉన్నాయి. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు మెరుగైన విద్యను అందించడంతో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది.

గతంలో ఈ గ్రామం నుంచి అధిక మంది విద్యార్థులు మాడుగుల ఆర్సీఎం బాలికోన్నత పాఠశాలకు బస్సులపై వెళుతుండేవారు. క్రమ క్రమంగా స్థానిక పాఠశాలలో అందిస్తున్న మెరుగైన విద్య, మౌలిక వసతులను చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తున్నారు. దీంతో ఏడాదికి ఏడాదికి విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా గ్రామ పెద్దల సహకారం, కొంతమంది దాతలు ముందుకు వచ్చి వసతులు కూడా కల్పించడంతో అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తోంది.

పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తా



మా పాఠశాల అభివృద్ధికి గ్రామపెద్దలు, యువకులు సహకరిస్తున్నారు. ఏవైనా కార్యక్రమాలు చేపట్టినా గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరై విషయాలను తెలుసుకునేందుకు మక్కువ చూపుతారు. దాతల సహకారంతో కంప్యూటర్లు, గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశాం. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు కంప్యూటర్ విద్యను కూడా అందిస్తున్నాం. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మంచి వాతావరణం నెలకొంటుంది. దీంతో పాఠశాలను అభివృద్ధి చేసుకునేందుకు మొక్కలు నాటడం, పలు కార్యక్రమాలు చేపట్టాం. పాఠశాల మరింత అభివృద్ధికి ఉపాధ్యాయులంతా కృషిచేస్తాం. శ్రమిస్తాం.

సీహెచ్. వెంకటేశ్వర్లు,
హెచ్ఎం, ఎంపీయూపీ స్కూల్, ఎం.కోటపాడు



తరగతి గదుల ముందు కుండీల్లో ఉంచిన మొక్కలు

ఇది కైరళి కిండర్ గార్డెన్ ఎక్స్‌ప్రెస్



కైరళి పాఠశాలలో ట్రైన్ మాదిరిగా గదులు రూపకల్పన

దేవరాపల్లి: ఇది గరీబ్‌రథ్ రైలు అనుకుంటే పొరబడినట్టే. స్థానిక కైరళి ఇంగ్లీష్ మీడియం పాఠశాల గదులను రైలు మాదిరిగా రూపకల్పన చేశారు. దీంతో పిల్లలు రైలు ఎక్కినంత ఆనందంగా ఉన్నారు. మూడు గదులకు రైలు బోగీలు తలుపులు, కిటికీలు ఆనుకొని వున్న గచ్చు ప్లాట్‌ఫారం మాదిరిగా అమర్చారు. రైలు అక్కడకు వచ్చి ఆగినట్టు నమూనాను తయారు చేయించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదు చేయండి

మాడుగుల: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామని ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ గ్రామంలో విద్యుత్ సరఫరా విషయంలో అంతరాయాలు ఏర్పడినా డీఈ 9491049790, ఏడీఈ వెంకటగోపాల్ 9491049792, మాడుగుల ఏఈ ప్రసాద్ 9440812572 నంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు. ఈ నంబర్‌లలో ఉన్న అధికారులు వివిధ సమావేశాల్లో ఉంటూ స్పందించని సందర్భంలో 1912 కాల్‌సెంటర్‌కు సమాచారం అందించవచ్చునని ఆయన తెలిపారు.

'ప్రభుత్వ భూముల్లో రొయ్యల చెరువులను నిషేధించాలి'



రొయ్యల చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దేవరాపల్లి: ప్రభుత్వ భూముల్లో రొయ్యల చెరువులను నిషేధించాలని సీపీఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం చింతలపూడి పంచాయతీ శివారు వీరబద్రపేట సమీపంలోని రొయ్యల చెరువులను సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి సీహెచ్.రాజులు గిరిజనులతో కలసి పరిశీలించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో గిరిజనులను బినామీగా పెట్టి పట్టణవాసులు ఇక్కడ లక్షలు వెచ్చించి రొయ్యల పెంపకం చేస్తారన్నారు. జీవో నంబరు 7, 15 ప్రకారం రెవెన్యూ అధికారుల అనుమతులు పొందాలి, రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి చాపకింద నీరులా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో చేనులపాలెం గ్రామంలో కేట్ పిష్ పెంపకాలు జరిగాయని ఫిర్యాదులతో నిలిపివేశామన్నారు.

నేడు దండిసురవరంలో మన గ్రామం- మన విశాఖ

చీడికాడ: మండలంలోని దండిసురవరం గ్రామంలో శనివారం మన గ్రామం- మన విశాఖ కార్యక్రమం జరుగనుందని ఎంపీడీవో ఆర్ఎం.గ్లాడ్సు తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ రావాలని కోరారు.

పోతనవలసలో...

కె.కోటపాడు: మండలంలోని పోతనవలస గ్రామంలో శనివారం మన గ్రామం -మన విశాఖ, దోమలపై దండయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. మండల కోఆర్డినేటింగ్ అధికారి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

పొంగలిపాకలో పోస్టాఫీస్ ప్రారంభం

మాడుగుల రూరల్: మండలంలోని పొంగలిపాక గ్రామంలో శుక్రవారం పోస్టాఫీస్ కార్యాలయాన్ని చోడవరం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, మాజీ మునసబు నాయని ఎరుకునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాపీస్ సేవలు ముమ్మరం చేసేందుకు పోస్టాఫీస్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్టాఫీసుల్లో డబ్బు పొదుపుగా దాచుకోవడం వల్ల ఖాతాదారుడికి భద్రతతో పాటు పలు పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. పొంగలిపాకతో పాటు ఎల్.పొన్నవోలు, జంపెన, చింతలూరు, జి. అగ్రహారం, కవ్వగుంట గ్రామాల్లో పోస్టాఫీస్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాఫీస్‌లు ఏర్పాటు చేయడం వల్ల పూర్తి స్థాయిలో సేవలు పొందేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఓంద్రు



పొంగలిపాకలో పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గంగమ్మ కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు మజ్జి రామారావు, సర్పంచ్ దాసరి కొండబాబు, ఉప సర్పంచ్ నాయని సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఉండూరు దేముడు పాల్గొన్నారు.

నేడు రామచంద్రాపురంలో మన గ్రామం- మన విశాఖ

మాడుగుల రూరల్: మండలంలోని రామచంద్రాపురంలో శనివారం మన గ్రామం- మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డేవిడ్‌రాజ్ తెలిపారు. ఉదయం పది గంటలకు మండల ప్రత్యేకాధికారిణి పి.శైలజతో పాటు అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో గ్రామంలో పర్యటించి సమస్యలపై చర్చిస్తామని ఎంపీడీవో డేవిడ్‌రాజ్ తెలిపారు.

అన్ని పంచాయతీల్లో ఎల్ఈడీ లైట్లు

ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు

చోడవరం: ఈనెల15 నాటికి నియోజకవర్గంలో అన్ని పంచాయతీల్లో ఎల్ ఈడీ లైట్లు ఏర్పాటు పూర్తిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో వివిధ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు మందకొడిగా సాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని 109 పంచాయతీల్లో కేవలం 36 పంచాయతీల్లో మాత్రమే ఎల్ఈడీ లైట్ల పూర్తయిందన్నారు. అన్ని పంచాయతీల్లో ఈ లైట్ల ఏర్పాటు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రోలుగుంట మండలంలో 21 పంచాయతీలకు 11 పంచాయతీల్లో లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, అలాగే రావికమతం మండలంలో 24 పంచాయతీల్లో ఏడు పంచాయతీలు, బుచ్చెయ్యపేట పంచాయతీలో 32 పంచాయతీలకు 26 పంచాయతీలు, చోడవరంలో 32 పంచాయతీలకు 23 పంచాయతీల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు కావలసి ఉందన్నారు. నాలుగు మండలాల్లో 20వేల లైట్లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 5,661 లైట్లు ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గానికి అదనంగా మంజూరైన 2,200 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక త్వరలోనే పూర్తవుతుందని, లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. బుచ్చెయ్యపేట మండలంలో ఏర్పాటు కానున్న కృషి విజ్ఞానకేంద్రం ఏర్పాటుకు అడ్డంకులు తొలగిపోయాయన్నారు. చోడవరం మండలంలోగల చాకిపల్లి వద్ద బొడ్డేరునదిపై వంతెన నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి లోకేష్ ఆమోదం తెలిపారన్నారు. త్వరలో ఈ పనికి నిధులు మంజూరవుతాయన్నారు. రెండు నెలల్లోగా ఈవంతెన నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. కనిశెట్టి మత్స్యరాజు, దంగేటి రామకృష్ణ, గూనూరు పెదబాబు, గండి సింహాద్రి,గేదెల సత్యనారాయణ, మజ్జి గౌరీశంకర్ దొమ్మేసి గిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు

గోవాడ షుగర్స్ కార్మికులకు వేజ్‌బోర్డు ఏర్పాటే లక్ష్యం

గుర్తింపు కార్మిక సంఘం నేత శరగడం రామునాయుడు

చోడవరం: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు వేజ్ బోర్డు ఏర్పాటే లక్ష్యమని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి శరగడం రామునాయుడు ప్రకటించారు. గోవాడలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన కార్మిక సంఘం నేతలు శుక్రవారం మండలంలోని వెంకన్నపాలెంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రామునాయుడు మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ ఒడిదుడుకుల్లో ఉన్నప్పటికీ అటు రైతులకు, ఫ్యాక్టరీకి ఇబ్బంది కలగకుండా కార్మికుల ప్రధానమైన డిమాండ్లు సాధించడంలో రెండేళ్ల పదవీకాలంలో ఎంతో కృషిచేశామన్నారు. తమ పనితీరుపై నమ్మకం ఉంచి మరోసారి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తమకు ఘన విజయం కట్టబెట్టిన కార్మికులకు రుణపడి ఉంటామన్నారు. షుగర్స్ కార్మికుల ప్రధానమైన సమస్య వేతనాలకు సంబంధించి వేజ్‌బోర్డు ఏర్పాటు అని అన్నారు.

గోవాడ షుగర్స్‌లో జరుగుతున్న అవతవకలను బాధ్యత కలిగిన కార్మికులుగా అడ్డుకుని ఫ్యాక్టరీ శ్రేయస్సుకు పాటుపడతామని ఆయన చెప్పారు. ఫ్యాక్టరీలో కాలుష్యం బయటకు పోకుండా అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుర్తింపు కార్మిక సంఘం నేత రామునాయుడు

నవంబర్‌లో క్రషింగ్ ప్రారంభానికి సిద్ధం

ఫ్యాక్టరీలో కృషింగ్ అలస్యం కావడం వల్ల ఫ్యాక్టరీ ఆర్థికంగా ఇబ్బంది ఎదురవుతున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది నవంబర్ నాటికి క్రషింగ్ ప్రారంభం అయ్యేలా యాజమాన్యానికి కార్మికులంతా సహకరించనున్నట్టు తెలిపారు. ఫ్యాక్టరీలో పాలనావ్యవహారాల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రెగ్యులర్ అధికారుల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం అధ్యక్షుడు తోట శంకరరావు, నాయకులు తలారి సత్యనారాయణ, పిఎస్ నాయుడు, నానిబాబు, జేవీ శ్రీనివాసరావు, దాడినాగేశ్వరరావు, దేవరపల్లి చంటి, పప్పల రమణమూర్తి, ప్రకాశరావు, ఏడువాక కోటేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చైనా వస్తువుల బహిష్కరణ కోరుతూ ఏబీవీపీ ర్యాలీ

చోడవరం: చైనా వస్తువులను బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేశంపై చైనా దురాక్రమణ పర్వం మితిమీరిందని విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు టి.ఎన్. రాజు విజ్ఞప్తి చేశారు. చైనా వస్తువులు బహిష్కరించి దేశానికి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి చైనా వస్తువులు బహిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నాని, మణికంఠ, శేఖర్, విఘ్నేష్, డి.క్రాంతికుమార్‌పాల్గొన్నారు.



చైనా వస్తువులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

రోలుగుంట: ఈనెల 9న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈరెల్లి చిరంజీవి తెలిపారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో రూ.198 కూలీ చాలలేదని, ఆ కూలీ రేటును రూ.250కు పెంచాలని కోరారు. గిరిజనులకు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేసి నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ తదితర డిమాండ్లతో ఈ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

చురుగ్గా చెత్తశుద్ధి కేంద్రం పనులు

రావికమతం: మండలంలోని గుమ్మళ్లపాడు గ్రామంలో చెత్తశుద్ధి కేంద్రం ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామ ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకొని పారమ్మ చెరువు సమీపంలోగల ఎకరా స్థలంలో ఈ కేంద్రాన్ని సర్పంచ్ శివయ్యానాయుడు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు గాను ఉపాధి హామీ పథకం నుంచి రూ.2.50 లక్షల నిధులు మంజూరవుతాయని సర్పంచ్ శివయ్యానాయుడు తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు కోసం ఎంపీఈవో జయప్రకాశరావు, ఈవోపీఆర్‌డీ మహేష్‌లు పరిశీలించారని ఆయన తెలిపారు. దీనివల్ల గ్రామంలో సంపూర్ణ పారిశుధ్య జరుగుతుందన్నారు. చెత్తశుద్ధి కేంద్రంతో పాటు ఇక్కడ చెరువు ఉన్నందున ఆహ్లాదకరమైన పార్కు, ఎంపీపీ దంగేటి రామకృష్ణ, దేశం పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడులు దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మె ల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు సహకారంతో కల్యాణ మండపం కూడా నిర్మించతలపెట్టామని సర్పంచ్ శివయ్యానాయుడు తెలిపారు. ఈకార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యుడు జె.తాతలు పాల్గొన్నారు.



చెత్తశుద్ధి కేంద్రం స్థలాన్ని ట్రాక్టర్‌తో చదును చేస్తున్న దృశ్యం

నేడు గర్నికంలో మన గ్రామం- మన విశాఖ

రావికమతం: మండలంలోని గర్నికం గ్రామ పంచాయతీలో శనివారం మన గ్రామం -మన విశాఖ కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీవో జయప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి టి.శివరాంప్రసాద్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. అలాగే గ్రామంలోగల వీధుల్లో తిరగడంతోపాటు సమస్యలను గుర్తిస్తారని ఆయన వివరించారు. ఈకార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా పాల్గొనాలని ఆయన సూచించారు.

విద్యుత్ సమస్యలపై కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయండి

ఏపీఈపీడీసీఎల్ ఏఈ రామారావు



రావికమతం: మండలంలో విద్యుత్ సమస్యలపై నేరుగా వినియోగదారులు కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఏఈ రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం గాని, లోవోల్టేజీ సమస్యగాని, ఇతర ఏ సమస్యలైనా నేరుగా కాల్‌సెంటర్ 1912కి తెలియజేయవచ్చునన్నారు. 9491049792 ఏఈ రావికమతం, 9491049792 ఏడీఈ వడ్డాది, 9491049790 నర్సీపట్నం డివిజ్ డీఈలకు వినియోగదారులు తెలియపర్చవచ్చునని ఆయన తెలిపారు. సిబ్బంది పనితీరులో కూడా ఏ సమస్యలు ఎదురైనప్పటికీ పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సమాచారం అందించవచ్చునని ఏఈ రామారావు తెలిపారు.

గోవాడ కాంట్రాక్ట్ వర్కర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా 'బండారు'

చోడవరం: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా బండారు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన కాంట్రాక్ట్ కార్మిక సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏడువాక నూకరాజు, ఉపాధ్యక్షుడిగా అట్టా ప్రసాద్, కార్యదర్శిగా దాడి నాగ ముత్యాలనాయుడు, కోశాధికారిగా కురసా నారాయణమూర్తి, కార్యనిర్వహణ కార్యదర్శిగా చిటికెల ఎర్రునాయుడులు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కర్రి రాము, కోవిలాపల్లి రమేష్, గొలగాన సూర్య ప్రకాష్, పడాలనారాయణమూర్తిలు ఎన్నికయ్యారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

ట్రాన్స్‌కో ఏఈ శ్రీనువాస్

రోలుగుంట: విద్యుత్ సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ బి.శ్రీనువాస్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం కోసం మండలంలోని విద్యుత్ వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణమే సంబంధిత అధికారులు వారి విద్యుత్ అంతరాయ సమస్యలను పరిష్కరి స్తార న్నారు. 1912 నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుం దన్నారు. ఆ నంబర్‌లో స్పందించకపోతే డీఈ నర్సీపట్నం- 9491049790, ఏడీఈ నర్సీపట్నం- 9440812509, ఏఈ నర్సీపట్నం రూరల్-9440817648 నంబర్లల్లో కూడా సంప్రదించాలని కోరారు. మండల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చోడవరంలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక రేపు

చోడవరం: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఈనెల6న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు గణేష్ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం చైర్మన్ ఈమని నరసింహమూర్తి, ఉపాధ్యాయుల శ్రీనివాసరావులు తెలిపారు. విశాఖపట్నం అక్కయ్యపాలెం శ్రీలక్ష్మీనారాయణ పరిణయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పెద్దలు యువతీ యువకులు అందరూ హాజరై వివాహాలు కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పదేళ్ల నుంచి వస్తున్న పింఛన్లు నిలిపేశారు

సొమ్ము ఇవ్వలేదని.. నేతలే ఆపించారు...

వితంతువుల ఆరోపణ



నాతవరం: మండలంలోని ఎం.బెన్నవరంలో 2007 నుంచి 2017 జూలై వరకు ఇచ్చిన వితంతు పింఛన్లను నిలిపివేశారని ఎం.బెన్నవరం పంచాయతీ ములగపూడి గ్రామానికి చెందిన తొళెం లక్ష్మి, చెక్కా కళ్యాణం ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త నూకరాజు లేకపోవడంతో పదేళ్ల నుంచి వితంతు పింఛను ఇస్తున్నారని తొళెం లక్ష్మి తెలిపారు. తనకు పింఛను ఇవ్వాలంటూ జన్మభూమి కమిటీ సిఫార్సు కూడా చేసిందని, అయినా ఇవ్వడం లేదన్నారు. తనకు ఏ ఆధారం లేకపోవడంతో నెలనెలా ప్రభుత్వం ఇచ్చే పింఛనుతోనే కాలం గడుపుతున్నామని వాపోయింది. అలాగే తనకు పదేళ్ల నుంచి వితంతు పింఛను ఇస్తున్నారని చెక్కా కళ్యాణం తెలిపింది. అయితే ములగపూడికి చెందిన ఒక ముఖ్యనాయుడు పింఛను డబ్బులు ఆగస్టు నుంచి రావాలంటే రూ.4వేలు అడిగాడని, ఆమొత్తాన్ని ఇవ్వకపోవడంతో తన పింఛన్ ఆపించారని ఆమె వాపోయింది. గత ఏడాది ఈ నాయకుడికి పింఛను కొనసాగడానికి రూ.3వేలు చొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తొళెం లక్ష్మి, చిక్కా కళ్యాణం తెలిపారు.

రేషన్ సరుకులు ఇవ్వాలి

కార్డుదారులు అభ్యర్థన

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురంలో విజిలెన్స్ దాడులతో మూతబడిన రేషన్ డిపోలను తెరిచి లబ్ధిదారులకు నిత్యవసరాలు అందించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు. గురువారం ఏఎల్‌పురం 30, 32 రేషన్ డిపోల్లో సరుకులు సక్రమంగా పంపిణీ చేయలేదని విజిలెన్స్‌కు అందిన ఫిర్యాదుపై దాడులు నిర్వహించారు. అయితే ఆ సమయంలో డీలర్లు లేకపోవడంతో రేషన్ డిపోలను సీజ్ చేశారు. ప్రస్తుతం ఆ రెండు డిపోల్లో 1,300 మంది లబ్ధిదారులు నిత్యవసర సరుకులు పొందుతున్నారు. విజిలెన్స్ సీజ్‌తో తమ రేషన్‌ను ఎలా విడిపించుకోవాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే తమకు రేషన్ ఇప్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై గొలుగొండ తహసీల్దార్ అంబేడ్కర్, సివిల్ సప్లయ్ డీటీ రామలింగస్వామిని వివరణ కోరగా గ్రామంలో ఉన్న మరో డిపోలు ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత ఇసుక ప్రియం

నదులు పక్కనున్నవారే కొనుగోలు చేస్తున్నారు..

రాత్రి వేళల్లో నేతలు లారీల్లో ఇసుక తరలింపు

ఇసుక కొనలేక పనులు నిలిపేసిన గృహ నిర్మాణదారులు

ఆగిన అభివృద్ధి పనులు.. పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం: ఉచిత ఇసుక ప్రియంగా మారడంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మండలంలో సర్పానది, వరహానది, జాజిగెడ్డ ఉన్నప్పటికీ స్థానికులకు ఇసుక కొనుగోలు చేసుకోవలసి వస్తున్నది. ఉచిత ఇసుకను విక్రయాలు చేస్తుండడంతో గృహనిర్మాణ లబ్ధిదారులతోపాటు అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 150 వరకు ఎన్‌టీఆర్ గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. సుమారు రూ.3 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటికి ఇసుక దొరక్క పనులు నిలిచిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు అభివృద్ధి పనులతోపాటు



నిలిచిన మండల పరిషత్ సమావేశం భవనం పనులు

ఎన్‌టీఆర్ గృహ నిర్మాణాలకు అనుమతులు ఇస్తుండడంతో వాటిని ఆసరాగా తీసుకున్న నాయకులు ఇసుక దోపిడీ చేస్తున్నారు. మండలంలో ఇసుక కొనుగోలు చేయాలంటే ట్రాక్టర్ లోడుకి రూ.1,500 నుంచి రూ.రెండు వేలు ఖర్చు చేయాల్సి వస్తున్నదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఉచిత ఇసుక అని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు ఇక్కడ జరుగుతున్నా ఇసుక వ్యాపారానికి పొంతన లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు.

కొందరు బడా నాయకులు రాత్రి సమయాల్లో ఇసుకను లారీల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా నదుల్లో ఇసుక ఉన్నప్పటికీ లబ్ధిదారుడుకి ఇసుక అందడం లేదని వారంటున్నారు. అనుమతుల పేరుతో రెవెన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతు న్నారని వారు ఆరోపిస్తున్నారు. నాయకుల నుంచి ఒత్తిడి పెరగడంతో రెవెన్యూ అధికారులు ఇసుకకు అనుమతులను ఆపేశారని వారంటున్నారు. చాలాచోట్ల ఇసుక లేక అభివృద్ధి పనులు ఆపేశారు. మండల పరిషత్ సమావేశ మందిరం పనులు కూడా ఆగిపోయాయి. ఇప్పటికైనా గృహనిర్మాణ లబ్ధిదారులకు ట్రాక్టరు ఇసుక 1000 రూపాయలకే అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

భక్తులతో ఉదయం నుంచి కిటకిటలాడిన ఆలయాలు... ప్రతి ఇంటిలోను పూజలు..



సర్వాంగ సుందరంగా అమ్మవారు



నర్సీపట్నంలో ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

నర్సీపట్నం టౌన్: శ్రావణమాసం రెండో శుక్రవారంనాడు మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే కుటుంబసమేతంగా ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, బలిఘట్టం లక్ష్మీదేవి ఆలయం, కనకదుర్గమ్మ ఆలయం, స్వామి అయ్యప్ప దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల సౌకర్యార్థం కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శ్రీకన్య జంక్షన్‌లో ఉన్న అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మహిళలు చీరలు, పసుపు, కుంకుమలు, గాజులు అమ్మవారికి సమర్పించుకున్నారు.

నర్సీపట్నం రూరల్‌లో...

మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు వరలక్ష్మివ్రతాలను భక్తిశ్రద్ధలతో చేశారు. ధర్మసాగరం, చెట్టుపల్లి, ఒ.ఎల్.పురం, గబ్బాడ, గురందొరపాలెం, అమలాపురం, వేములపూడి, యరకన్నపాలెం, నీలంపేట, దుగ్గాడ, తదితర ప్రాంతాలలో మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు పోటెత్తారు. మహిళలు బంగారు, వెండి వస్తువులతో తయారుచేసిన లక్ష్మీకాసులు, పూలు, పండ్లు, వివిధ రకాల పత్రులతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. పలువురు ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు.

గొలుగొండలో...

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి పూజలు సందడిగా చేశారు. మండలంలో జోగంపేట, గొలుగొండ, పాకలపాడు, కె.మల్లంపేట, అమ్మపేట, పప్పుశెట్టిపాలెం, కె.ఎల్లవరం, కశిమి, కరక, ఏటిగైరంపేట, చీడిగుమ్మలల్లో శుక్రవారం మహిళలు ఇళ్ల వద్ద ప్రత్యేక పూజులు నిర్వహించారు. ద్వారకానగరంలోని దుర్గాదేవి ఆలయంలో పూజలు చేశారు.

నేడు బంగారయ్యపేట, గిడుతూరుల్లో మన ఊరు -మన విశాఖ

నర్సీపట్నం రూరల్: మండలంలోని వేములపూడి పంచాయతీ శివారు బంగారయ్యపేటలో ఈనెల 5వ తేదీన మన ఊరు-మన విశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి సీహెచ్ మహాలక్ష్మి, ఎంపీపీ రమణమ్మలు పాల్గొంటారన్నారు.

గిడుతూరులో...

మాకవరపాలెం: మండలంలో నేడు గిడుతూరులో మన గ్రామం--మ విశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఉదయశ్రీ తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం చేసేందుకుగాను మన గ్రామం--మన విశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్నీ శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

చురుగ్గా నీటి ట్యాంకు పనులు

త్వరలో జోగంపేటలో నిరంతరం కొళాయి నీరు



జోగంపేటలో నిర్మాణం చేపడుతున్న ట్యాంకు

గొలుగొండ: మండలంలోని జోగంపేటలో తాగు నీటి పథకం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలో జోగంపేటలో కుమ్మరికాలనీకి తాగు నీరు నిరంతరం అందించే దిశగా రాష్ట్ర మంత్రి అయ్యన్నపాత్రుడు ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు రూ.26లక్షలు మంజూరు చేశారు. దాంతో వారం రోజులుగా నీటి ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెలాఖరులోగా ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి నిరంతరం తాగు నీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఆర్‌డబ్ల్యూఎస్ రూ.80లక్షలతో రెండు ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జోగంపేట, పప్పుశెట్టిపాలెం, పాతమల్లంపేట గ్రామాలకు తాగు నీరు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు.

రోడ్డుపై దమ్ము ట్రాక్టర్లు నిషేధించాలి

నాతవరం: దమ్ము ట్రాక్టర్‌లు నాగలిసెట్‌తో తారురోడ్డుపై తిరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పీకేగూడెం మాజీ సర్పంచ్ బయ్యపురెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పీకేగూడెం-లక్ష్మీపురం రహదారి లక్షలాది రూపాయలతో మూడు నెలల క్రితమే తారురోడ్డుగా వేశారు. అయితే దమ్ముట్రాక్టర్లు తారురోడ్డుపై తిరగడంతో రోడ్డు పాడైపోతుందన్నారు. అలాగే పి.జగ్గంపేట-నాతవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు కూడా దమ్ము ట్రాక్టర్లు నాగలిసెట్‌తో తారురోడ్డుపై తిరగడంతో అధ్వానంగా తయారవుతుందని, వీటిని తారురోడ్డుపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

- అరట్లకోట వీధుల్లో నెలరోజులుగా నిలిచిన వాడుక నీరు
- దుర్గంధం... ■ దోమల విజృంభణ
- బిందెల్లో పట్టుకుని పారబోస్తున్న మహిళలు


బిందెలో మురుగునీరు పడుతున్న దృశ్యం



మురుగుతో అవస్థలు

పాయకరావుపేట : మండలంలోని అరట్లకోట గ్రామంలో నివాసల మధ్య రోజుల తరబడి మురుగు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పంచాయతీ సిబ్బందిగానీ, పాలకవర్గం గానీ పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సాయిబాబా గుడి ఎదురుగా వీధి మధ్యలో కాలువలు లేక ఇళ్లలో నుంచి వచ్చే వాడుక నీరు, వర్షపునీరు ఎప్పటికప్పుడు పోయేందుకు కచ్చా కాలువ ఏర్పాటు చేసి సమీపంలో ఉన్న పుంతరోడ్డు పక్క కాలువకు మళ్ళించుకుంటున్నారు. అయితే పుంతరోడ్డులో ఓ వ్యక్తి ఇల్లు కట్టడంతో పునాదితీసిన మట్టితో కచ్చా కాలువ మూతపడింది. దీంతో వీధిలో మురుగునీరు బయటకుపోయే మార్గంలేక గత నెల రోజులుగా నిలిచిపోయింది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతో సమీప నివాసితులు నరకాన్ని చవిచూస్తున్నారు. కొందరు ఇంట్లోని వాడుక నీరు బిందెలతో పట్టుకుని దూరంగా పారబోస్తున్నారు. ఈ సందర్భంగా గర్లంక జమీలు, గణసాల రమణమ్మ, శారద, గొల్లపల్లి గన్నెమ్మ, దివిలి పార్వతి, బి.వరహాలు తదితరులు మాట్లాడుతూ రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయి నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్నవారు లేరని వాపోయారు. మురుగునీటిలో నడుస్తుండడం వల్ల కాళ్ల దురదలు పుడుతున్నాయని వాపోయారు. దీనిపై పలుమార్లు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి తెలియజేసినా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్నామని చెబుతున్న అధికారులు, నాయకులు క్షేత్రస్థాయిలో పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి గ్రామంలో పారిశుధ్య మెరుగుకు కృషి చేయాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బి.ఎ.బి.ఎల్.మూర్తిని వివరణ కోరగా రోడ్డుపై వేసిన మట్టిని తొలగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కచ్చాకాలువలను పునరుద్ధరించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.


కచ్చా కాలువ మూతపడిన దృశ్యం

అధికారులు పట్టించుకోలేదు



వీధిలో నిలిచిపోయిన మురుగు తొలగించాలని మండలస్థాయి అధికారికి విజ్ఞప్తిచేసినా పట్టించుకోలేదు. మురికినీటిలో నడుస్తుంటే కాళ్లకు దురదలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

- గర్లంక జమీలు, రైతు

మురికినీటిని దూరంగా పారబోస్తున్నాం



వీధి కాలుల్లేక ఇంట్లో మురికినీటిని రోజూ బిందెలతో పట్టుకుని దూరంగా పారబోస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ కాలువలు నిర్మించేంతవరకు కనీసం కచ్చాకాలువలైనా ఏర్పాటు చేయాలి.

గణసాల రమణమ్మ, గృహిణి

నెల్లిపూడి బ్రాంచి పోస్టాఫీస్ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

నక్కపల్లి : మండలంలోని నెల్లిపూడి గ్రామానికి మంజూరైన బ్రాంచి పోస్టాఫీసును ఎలమంచిలి తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ఉమామహేశ్వరరావు, నెల్లిపూడి సర్పంచ్ సిరిశెట్టి సన్యాసిరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలమంచిలి సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పోస్టాఫీసుకు ప్రత్యేక గుర్తింపు వుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి పోస్ట్‌మాస్టర్ వి.వి. సుబ్బరాజు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

కామాక్షి ఆలయంలో అర్ధ ఏకాహం


భజన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలోని ఉపమాక కామాక్షి దేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం విశేష పూజలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పాటలను ఆలపించారు. మహిళా భజన భక్త సమాజాలు కూడా ఇందులో పాల్గొన్నాయి. పలువురు భక్తులు అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు.

సముద్ర ఇసుక అక్రమ రవాణా

నక్కపల్లి : మండలంలోని చినతీనార్ల గ్రామంలోని సముద్రతీరంలో ఉన్న ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన కొందరు యువకులు తెలిపారు. సముద్రపు ఒడ్డు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కొబ్బరితోటల్లోకి తరలిస్తున్నారని, అక్కడ నుంచి రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని వారు చెప్పారు. శుక్రవారం ఇసుక తరలిస్తున్న వ్యక్తులను తాము ప్రశ్నిస్తే తమపైనే దౌర్జన్యం చేయబోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తరలింపు అడ్డుకోవాలన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయండి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దాసు



కోటవురట్ల: అనకాపల్లి ఏపీటీఎఫ్ భవన్‌లో ఆదివారం నిర్వహించే జిల్లా స్థాయి విద్యాసదస్సును విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సత్యాడ దాసు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త విద్యా విధానాన్ని ఎలా చూడాలనే అంశం, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారం, ఉద్యమాల్లో మహిళలు భాగస్వామ్యం అనే అంశాలపై వక్తలు ప్రసంగిస్తారన్నారు. ఈ సదస్సుకు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాండురంగ వరప్రసాద్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నరసింహారెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు సందేహాలకు సమాధానాలు ఇస్తారన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

నక్కపల్లి/కోటవురట్ల : మండలంలోని శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. తమ ఇళ్లల్లో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీదేవి పూజలు జరుపుకున్నారు. అనంతరం నక్కపల్లిలోని వారపుసంత వద్ద వున్న దుర్గామాత ఆలయం, ఉపమాక దుర్గాభవానీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉపమాక ఆలయంలో ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుడు మహేష్ కుంకుమ పూజలు నిర్వహించారు. మండలంలోని చిన దొడ్డిగల్లు, గొడిచెర్ల, దేవవరం, వేంపాడు, ఉద్దండపురం, అమలాపురం, చందనాడ, జానకయ్యపేట, ఎన్.నర్సాపురం, తదితర గ్రామాల్లోని ఆలయాలన్నీ కళకళలాడాయి. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. మండలంలో కోటవురట్ల శివాలయం, రాజగోపాలస్వామి ఆలయం, లింగాపురం దుర్గాదేవి ఆలయం, పందూరు, గొట్టివాడ, చౌడువాడ, పాములవాక, జల్లూరు, బీకేపల్లి, కె.వెంకటాపురం గ్రామాల్లోని ఆలయాల్లో ఉన్న అమ్మవార్లకు మహిళలు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు.


లింగాపురం దుర్గాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


ఉపమాకలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మహిళలు

పేదలకు ఆర్థిక సాయం

ఎస్.రాయవరం(నక్కపల్లి) : ఎస్.రాయవరం మండలం కోనవానిపాలెం గ్రామానికి చెందిన ఏడు పేద కుటుంబాలకు చిరు వ్యాపారాల నిమిత్తం స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. ఈ మేరకు శుక్రవారం స్రవంతి సంస్థ అధ్యక్షుడు అప్పరాజు వీటిని పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారాలు చేసుకునే నిమిత్తం ఒక్కో కుటుంబానికి ఆరు వేల రూపాయల చొప్పున్న అందజేశామని చెప్పారు. ఈ ఆర్థిక సాయంతో చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అప్పలనాయుడు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

- నియోజకవర్గంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు
- భక్తులతో కిటకిటలాడిన లక్ష్మీదేవి ఆలయాలు
- పలుచోట్ల భారీ ఎత్తున కుంకమ పూజలు
- క్రిష్ణాపురంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు


ఎలమంచిలి మండలంలోని క్రిష్ణాపురం ఆలయం వద్ద కుంకుమ పూజలు

ఇంటింటా శ్రావణ శోభ

ఎలమంచిలి/రూరల్/అచ్యుతాపురం/రూరల్/మునగపాక /రాంబిల్లి : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ శ్రావణ శుక్ర వారం పూజలు ఘనంగా జరిగాయి. లక్ష్మీదేవి ఆలయాల వద్ద పెద్ద ఎత్తున సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.ఎలమంచిలి పట్టణంలోని సంతోషిమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. క్రిష్ణాపురంలో ప్రతి ఏడాది శ్రావణ మాసం రెండో శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి కూడా ఆలయం వద్ద పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పులపర్తి, గూండ్రిబిల్లి, పద్మనాభరాజుపేట, బయ్యవరం, లక్కవరం, పోతిరెడ్డి పాలెం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉప సర్పంచ్ కొలగాని నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లుచేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయం త్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పుల పర్తిలోని లక్ష్మీదేవి ఆలయంలోనూ భక్తుల రద్దీ నెలకొంది. ఇక్కడ జరిగిన సామూహిక పూజల్లో రెండు వందల మంది భక్తులు పాల్గొ న్నారు. కమిటీ సభ్యుడు సిద్దా గురయ్య భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

అచ్యుతాపురంలోని పలు గ్రామాల్లో శ్రావణ శోభ నెలకొంది. పూడిమడకలో లక్ష్మీదేవి సహిత జగన్నాథస్వామి, అచ్యుతాపురంలో సాయిబాబా, నునపర్తిలో దుర్గాదేవి, శివాలయం, మడుతూరులో చౌడేశ్వరస్వామి ఆలయం,దోసూరులో సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హరిపాలెంలోని అందలాపల్లిలో ఉన్న భగీరధీ అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాకలోనూ వరలక్ష్మీదేవి పూజలు ఘనంగా జరిగాయి.మునగపాకలో భ్రమరాంబదేవి, పాలేశ్వర భీమే శ్వర ఆలయం, కాశీవిశాలాక్షి దేవాలయం, ఉమ్మలాడలో దేవీతల్లి ఆలయం, చూచుకొండలో దుర్గాదేవి ఆలయం, తోటాడలో ఓం దేవా లయం, తిమ్మరాజుపేట, అరబుపాలెం, పల్లపు ఆనందపురం, నాగు లాపల్లి, టి. సిరసపల్లి, పాటిపల్లి, నాగవరం, వాడ్రాపల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


హరిపాలెం భగీరధీ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


ఉమ్మలాడలో దేవీతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఎలమంచిలిలో జగన్ వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ నాయకుల రాస్తారోకో

జగన్‌కి మతిభ్రమించింది

ప్రతిపక్ష నేత వ్యాఖ్యలపై మండిపడిన టీడీపీ శ్రేణులు

ఎలమంచిలి/మునగపాక/రాంబిల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎల మంచిలి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు జగన్ దిష్టిబొమ్మను దహనం చేశాయి.ముందుగా పట్టణంతోపాటుగ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు తులసీనగర్ నుంచి ప్రధాన రహదారి మీదు గా దిమిలి రోడ్డు జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ జం క్షన్ వరకు ర్యాలీ చేశారు.అనంతరంబస్టాండ్ జంక్షన్ వద్ద జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌ప ర్సన్ రమాకుమారి మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్ర బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌కి ప్రజలే తగిన బుద్ధి చెబుతా రన్నారు. మండల పరిషత్ ముఖ్య సలహాదా రుడు విజయ్‌బాబు మాట్లాడుతూఅభివృద్ధిని చూసి తట్టుకోలేకే వైసీపీ లేనిపోని విమర్శలు చేస్తుందన్నారు. బీసీ సంఘం జిల్లా నేత మళ్ల కొండబాబు మాట్లాడుతూ జగన్ ప్రతి పక్షనేత హోదాలో ఉండి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ కొఠారు సాంబ, జెడ్పీ టీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, మళ్ల కొండబాబు,ఆడారి వెంకట్, సుందరపు బాబ్జీ, కౌన్సిలర్లు పండూరి శ్రీను,బొద్దపునాగేశ్వరావు, చంద్రరావు, సూరిబాబు పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై జగన్ చేసిన వ్యాఖ్యల పట్ల తెలుగు తమ్ముళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మునగపాక మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేసి, జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ హత్యా రాజకీయాలకు అలవాటు పడిన జగన్ నోటి వెంట ఇటువంటి మాటలే వస్తా యని, ఇప్పటికైనా జగన్ తన నోరు అదుపు లోకి పెట్టుకోకపోతే భవిష్యత్తులో ప్రజల్లో తిరగడానికే ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస రావు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మద్దాల వీరు నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, డొక్కా నాగభూషణం, ఆడారి గోవింద, దాడి శివ, దొడ్డి రమేష్, రాపేటి పరమేష్, పాల్గొన్నారు. అలాగే రాంబిల్లిలోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ధూళి రంగనాయకులు, ఎంపీపీ కె. అనిత, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు దిన్‌బాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కె. ప్రసాద్, పాల్గొన్నారు.


రాంబిల్లి జంక్షన్‌లో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు


లబ్ధిదారుల జాబితా చదువుతున్న అధికారి

పలుచోట్ల హౌసింగ్ గ్రామసభలు

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో హౌసింగ్అధికారులు శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. అధికారులు మూడు బృందాలుగా విడిపోయిసభలు చేపట్టారు. గతంలో అధికారులు నిర్వహించిన సాధికారక సర్వే ఆధారంగా ఇంతవరకు సొంతిల్లు లేని వారి పేర్లు సభల్లో చదివి వినిపిం చారు. అభ్యంతరాలు ఉన్నట్లయితే తమకు తెలియజేయాలని కోరారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు గృహ నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ బలరాం, హౌసింగ్ ఏఈ ప్రసాద్, పాల్గొన్నారు.

పందుల తరలింపునకు ప్రత్యేక డ్రైవ్

- నేటి నుంచి అమలు
- రంగం సిద్ధం చేసిన అధికారులు

ఎలమంచిలి : పట్టణం నుంచి శివారు ప్రాంతా లకు పందుల తరలింపునకు అధికారులు శనివారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నారు. పందుల పెంప కందారులకు మున్సిపల్ కమిషనర్ ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఇచ్చిన సంగ తి తెలిసిందే. ఈ మేరకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడానికి రంగం సిద్ధం చేశారు. ఇకపై పట్టణంలో ఎక్కడైనా పందులు కని పిస్తే పెంపకందారులపై చర్యలు తీసుకోనున్నారు. వా స్తవానికిపట్టణంలో పందుల సమస్య అధికంగా ఉంది. శుక్రవారం కూడా పందుల సంచారం ఎక్కువగా కని పించింది. ప్రధాన జంక్షన్, వీధుల్లో విచ్చలవిడిగా తిరు గుతున్నాయి. ఎప్పటినుంచో ఈ సమస్య పరిష్కారానికి పట్టణవాసులు విన్నవిస్తున్నా.. ఎవరూ పెద్దగా పట్టిం చుకోలేదు. పెంపకందారులు తెల్లవారేసరికే పందులను తీసుకువచ్చి కొత్తపేట, యానాద్రి కాలనీ, రామ్‌నగర్, యర్రవరం వార్డుల్లో విడిచిపెడుతున్నారు. దీంతో ప్రజ లకు ఇబ్బందులు తప్పడం లేదు.ఈ నేపథ్యంలో అధికా రులు తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్త మవుతోంది. అయితే దీన్ని ఎంతవరకు అమలు చేస్తారన్న సందేహం కూడా ప్రజల్లో కలుగుతోంది.


రవీంద్ర భారతి స్కూల్ వీధిలో పందుల సంచారం



కొండకర్ల ఆవ జంక్షన్‌లో పర్యాటక కేంద్రం బోర్డు

అచ్యుతాపురంరూరల్ : కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న ఇక్కడి ప్రజల కోరిక త్వరలోనే తీర నుంది.ఈమేరకు ఇటీవల ఇక్కడి పక్షులరకాలు,ఆవ విస్తీర్ణం, ఆవ గర్భం వివరాలతో కొండకర్ల జంక్షన్‌లో బోర్డు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకరమైనచెట్లు, దేశీయ పక్షులు, విదేశీ పక్షుల బొమ్మలతో కూడిన వివరాలు అందులో ఉన్నాయి.


కన్యకాపరమేశ్వరీ ఆలయంలో దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


సత్యనారాయణపురం కల్యాణగిరిపై కోటి కుంకుమార్చనలు



గవరపాలెం గౌరీ సంఘంలో కొలువైన అమ్మవారికి మహిళల పూజలు

వరాల తల్లికి వందనం


చీరల అలంకరణలో సంతోషిమాత


కన్యకాపరమేశ్వరీ అమ్మవారు




సతకంపట్టులో కనకదుర్గమ్మ


కల్యాణగిరిపై వేంచేసిన కనకదుర్గమ్మ

అనకాపల్లి టౌన్ : తెలుగువారి సంప్రదాయ పూజల్లో ఒకటైన వరలక్ష్మీ వ్రతాన్ని అనకాపల్లి, కశింకోట మండలాల్లో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే ఇంటిల్లిపాదీ లేచి ఈ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వారివారి శక్తి కొలది బంగారం కాసు, చీరలు, వివిధ రకాల పిండివంటలు, పూలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి వరాల తల్లిని అంతా మనసారా వేడుకున్నారు. ఇదిలావుండగా, శ్రావణమాస వేడుకల్లో భాగంగా పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూకాంబిక అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సంతోషిమాతా అమ్మవారిని చీరలతో అలంకరించారు. పట్టణవాసులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయం వద్ద బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ సమకూర్చిన ప్రసాదాన్ని క్లబ్ గౌరవాధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, అధ్యక్షుడు కర్రి చినఅప్పలనాయుడు, ఆలయ భక్తజన సేవా మండలి సభ్యుడు దాడి వాసు తదితరులు పంపిణీ చేశారు.భోగలింగేశ్వరస్వామి ఆలయంలో కూడా భక్తులు పూజలు నిర్వహించారు.

గవరపాలెంలో..

గవరపాలెం : సతకంపట్టు జంక్షన్‌లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పీవీ రమణ, కేఎం నాయుడు, పొలిమేర శ్రీను, బుద్ధ సంతోష్, సూరిశెట్టి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే గౌరీ సంఘంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వరలక్ష్మీదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

కల్యాణగిరిపై కోటి కుంకుమార్చనలు

కొత్తూరు : సత్యనారాయణపురంలోని కల్యాణగిరిపై వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు భక్తులతో సామూహిక కోటి కుంకుమార్చనలు జరిపారు. ఆలయ చైర్మన్ మేడిశెట్టి వెంకట సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక కార్యదర్శి బోయిన నాగేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కశింకోటలో ఇంటింటా వేడుక

కశింకోట రూరల్ : వరలక్ష్మీ వ్రతాన్ని మండలవాసులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండ్లు, కాయలు, పిండివంటలు వంటి వాటిని లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పించారు. కొందరుబంగారం కాసులను ఉంచి పూజలు చేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు.



నూకాంబికకు రూ. లక్షా 50 వేల కరెన్సీతో అలంకరణ

అనకాపల్లి టౌన్ : వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం నూకాంబిక అమ్మవారిని లక్షా యాభైవేల రూపాయలతో అలంకరించారు. కొణతాల మహాలక్ష్మినాయుడు అనే భక్తుడు రూ.20, 50, 100నోట్లతో అమ్మవారిని అందంగా తీర్చిద్దారు. ఇందుకు సుమారు పది గంటల సమయం పట్టినట్టు ఆలయ సిబ్బంది తెలిపారు. లక్ష్మీదేవి అలంకారంలో కనిపించిన అమ్మవారిని దర్శించేందుకు విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఆరున్నర గంటల తర్వాత దీపాలంకరణ జరిపారు. ఈ వేడకలో ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సుజాత, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల సురేంద్ర, కొణతాల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'నక్షత్రం' కోసం ప్రేక్షకుల ఎదురుచూపు

- శాటిలైట్ పాస్‌వర్డ్ విడుదల కాక చిత్ర ప్రదర్శనలో జాప్యం
- సత్యనారాయణ థియేటర్ వద్ద ఆందోళన
- టిక్కెట్ల వాపస్ ఇచ్చిన యాజమాన్యం

నెహ్రూచౌక్ : గవరపాలెం బాలకృష్ణ బస్టాప్ సమీపం సత్యనారాయణ థియేటర్ వద్ద పలువురు ప్రేక్షకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సాయి ధరమ్‌తేజ్ నటించిన నక్షత్రం సినిమా మ్యాట్నీ షో వరకు విడుదల కాకపోవడంతో టిక్కెట్లు కొన్న కొందరు తమ నిరసన తెలియజేశారు. దీంతో చివరకు థియేటర్ యాజమాన్యం ప్రేక్షకుల నుంచి టిక్కెట్లు తీసుకుని డబ్బులు తిరిగి చెల్లించింది. అనంతరం థియేటర్ యాజమాన్యం మాట్లాడుతూ శాటిలైట్ పాస్‌వర్డ్ అందకపోవడంతో చిత్రాన్ని ప్రదర్శించ లేకపోయామన్నారు. థియేటర్ యాజమాన్యం తప్పిదం లేదని వివరించారు.


థియేటర్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రేక్షకులు

కార్తీకమాసం నాటికి హుద్‌హుద్ బాధితులకు ఇళ్ల పంపిణీ

అనకాపల్లి : కార్తీకమాసం నాటికి హుద్ హుద్ బాధితులకు ఇళ్లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన రావుగోపాలరావు స్టేడియంలో నిర్మిస్తున్న నమూనా ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుద్ హుద్ బాధితులకు మారేడుపూడిలో 96 ఇళ్లు, తాళ్లపాలెం 94 ఇళ్ళు నిర్మించామని వాటిని కార్తీకమాసం నాటికి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. అలాగే అనకాపల్లి పట్టణానికి మరో రెండువేల 500 ఇళ్లు మంజూరవుతున్నాయని, ఆ ఇళ్లు కొరియన్ టెక్నాలజీతో నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, పార్టీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు, గొర్లి శేఖర్, నడిపల్లి గణేష్, వాకాడ కోటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపుపై ధర్నా

ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించిన భవన నిర్మాణ కార్మికులు

అనకాపల్లి రూరల్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులు ఇతర అవసరాలకు మళ్లించడం తగదని ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల దశాబ్దాల పోరాటం వల్ల కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందన్నారు. ఈ బోర్డుకు భవన, ఇతర నిర్మాణ రంగాల నుంచి సెస్సు రూపంలో వసూలుచేసిన సొమ్ము జమ అవుతుందని, ఆ సొమ్మును కేవలం భవన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాల్సి ఉందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిబంధనను అధిగమిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పునరాలోచించి భవన నిర్మాణ కార్మిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోన లక్ష్మణ్, ప్రతినిధులు నర్సింగ్‌యాదవ్, కె.శ్రీనివాసరావు, టి.ఆచారి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.


డీటీకి వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు